ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 28.02.2026 | సంపుటి : 12 సంచిక : 220 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# ఢిల్లీ మద్యం కేసు ఉత్తిదే

- ఏవరైన ఆధారాలు లేకుండానే ఛార్జీషీటు వేస్తారా?
- సీబీఐపై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- కేజ్రీవాల్, సిసోడియా, కవితలపై కేసులు కొట్టివేత



## మోడీ, అమిత్ షాల కుట్రకు బలయ్యా

- నన్ను దొంగగా చిత్రీకరించి ప్రచారం చేశారు
- నేను నిర్దోషినని కోర్టు నిరూపించింది
- ఆమ్ ఆద్మీని దెబ్బతీసే కుట్ర
- ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు జరపాలి
- కోర్టు తీర్పుతో ఉద్వేగానికిలోనై కన్నీరు పెట్టుకున్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న తనను ఆరు నెలలపాటు జైల్లో పెట్టారు. ఇదంతా మోడీ అమిత్ షాల కుట్ర అని, కోర్టు తీర్పు అనంతరం కే జ్రీవాల్ మీడియాతో మాట్లా డుతూ.. కన్నీరు పెట్టుకున్నా రు. రాజకీయంగా తనను దెబ్బతీయడంతో పాటు 'ఆప్‌కు చెందిన ఐదుగురు నేతలను జైల్లో పెట్టారు. నా జీవితంలో ఎన్నడూ తప్పు చేయ లేదు. కేవలం విపక్షాలపైనే ప్రధాని మోదీ దృష్టి పెట్టారు. ప్రజా సమస్యలను మోదీ ప ట్టించుకోరు. నాపై ఎన్నో తప్పుడు కేసులు పె ట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు ప్రయత్నించారు. నేను అసలుసి సలైన నిజా యితీపరుడిని. నేను కేవలం ప్రజల కోసమే పనిచేశాను. నిజం ఎప్పటికై నా గెలుస్తుంది' అంటూ క న్నీరు పెట్టుకున్నా రు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కీలక పరి ణామం చోటుచేసుకుంది. లిక్కర్ కేసులో రౌస్ అవె న్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరి యల్ లేకుండా కేసులో ఇరికిం చిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని,

మిగతా 2లో..

- సౌత్ గ్రూప్ అంటూ పేర్కొనడాన్ని తప్పుపట్టిన కోర్టు
- ప్రాంతాల వారీగా నేరాన్ని నిర్ధారించలేమని వ్యాఖ్య
- హైకోర్టులో సవాల్ చేస్తామని సీబీఐ వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు

మిగతా 2లో..




## న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది

కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఆనాడే చెప్పా

కష్టకాలంలో అండగా నిలిచి వారిందరికీ కృతజ్ఞతలు

ఢిల్లీ కోర్టు తీర్పుపై కవిత హర్షం

హైదరాబాద్(జనంసాక్షి):న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత అన్నారు. తను నిందితురాలిగా ఉన్న దిల్లీ మద్యం కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. నేను కడిగిన ముత్యంలా బయటికి వస్తానని తెలంగాణ ప్రజలకు మొదట్నుంచి చెబుతున్నాను. అలాగే వచ్చాను. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన

మిగతా 2లో..

## మా దర్యాప్తు సీబీఐ కేసుపై ఆధారపడి లేదు

- పక్కా సాక్ష్యాధారాలతో విచారిస్తున్నాం
- మద్యం పాలసీ కేసు విచారణపై స్పందించిన ఈడీ

2లో..



జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో

## కోర్ అర్బన్ చట్టం

- ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వ కార్యాలయాల పనులు వేగవంతం చేయాలి
- ఓఆర్ఆర్ లోపల రోడ్లన్నింటిని ఎంఏయూడీ పరిధిలోకి తేవాలి
- చెరువులు, కుంటల అభివృద్ధి.. సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): అవుటర్ రింగురోడ్డు పరిధిలోని (కోర్ అర్బన్) మూడు కార్పొరేషన్లకు వర్తించేలా గ్రేటర్ హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టం తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనుమతులు, రుసుములు, అభివృద్ధి పనుల నిర్వహణ, ఇతర వ్యవహారాలన్నింటికి ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 99 రోజుల కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో చేపట్టే పనులు తొలుత చేపడతామని సీఎం తెలిపారు. ఎంఏయూడీపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ ఏరియాలో పారిశుద్ధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడి వేయాలో తెలియక ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారని.. ముందుగా చెత్త వేయాల్సిన ప్రాంతాలను గుర్తించి అక్కడ బోర్డులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆ తర్వాత నిర్దేశిత ప్రాంతాల్లో కాకుండా ఇష్టారీతిగా ఎక్కడిపడితే అక్కడ చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో రోడ్ల నిర్మాణ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఉపాధిహామీలో రోడ్ల నిర్మాణం నిర్దేశిత కాలం వరకు మళ్లీ వేయడానికి అనుమతులు రావని.. అలాంటి సాంకేతికతను వినియోగించాలని సీఎం సూచించారు. రోడ్డు నిర్మించిన తర్వాత దాని జీవిత కాలం ఎంతనేది నిర్ణయించి.. ఆ లోపు దానిని తొలగించినా... అక్కడ మళ్లీ రోడ్డు వేసినా అందుకు బాధ్యులు ఎవరో తేల్చాలని సీఎం ఆదేశించారు. కోర్

మిగతా 2లో..

## తెలంగాణ ఉద్యోగులకు ఊరట

బకాయిల కోసం రూ.745 కోట్లు విడుదల

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిలు రూ.745 కోట్లు విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. విడతల వారీగా బకాయిలు విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు తాజాగా

మిగతా 2లో..

## లిక్కర్ కేసు వల్లే ఎన్నికల్లో ఓడిపోయాం

మా నాయకులపై పెట్టిన ప్రతి కేసు రాజకీయ కక్షలో భాగమే: కేటీఆర్




న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు క్లీన్‌చిట్ ఇస్తూ వచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "మద్యం కుంభకోణం పేరుతో దిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఈ కుంభకోణం కారణంగానే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైంది. ఇవాళ కవితకు అనుకూలంగా వచ్చిన తీర్పుతో న్యాయం జరిగింది. ఇదే విధంగా మా నాయకులపై పెట్టిన ప్రతి కేసు రాజకీయ కక్షలో భాగమే. నిజాలు బయటకు రానంత కాలం కాంగ్రెస్, భాజపా దుష్ప్రచారాలను చూస్తూనే ఉంటాం" అని పేర్కొన్నారు.కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు తెలంగాణ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు

మిగతా 2లో..

నా వల్ల కాదు.. మీ వైఫల్యాల వల్లే

## ఓడారు

- బీఆర్ఎస్ ఓటమి స్వయంకృతపరాధమే
- కవిత కౌంటర్




హైదరాబాద్(జనంసాక్షి):దిల్లీ మద్యం కేసు కారణంగానే బిఆర్ఎస్ ఓటమి చెందిందని కెటిఆర్ చేసిన వ్యాఖ్య లపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. స్వయంకృతంతో ఓడిపోయిన వారు ఇప్పుడు ఈ కేసే కారణమని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మద్యం కేసులో తన తప్పు తేలకుండానే వ్యక్తిత్వ హననం చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెల్లడైన తర్వాత ఎక్స్‌లో తన అన్న కేటీఆర్ పెట్టిన పోస్టు చూశానని, నాపై పెట్టిన కేసు వల్లే బీఆర్ఎస్ ఓడిందనట్లుగా ఆయన పోస్టు చేశారని అన్నారు. బీఆర్ఎస్ నేతలను నేను సూటిగా ప్రశ్నిస్తున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి నేను కారణమా? ప్రజలకు ఇళ్లు ఇవ్వకపోవడం బీఆర్ఎస్ ఓటమికి కారణం. ఉద్యోగాలు ఇవ్వకపోవడం కారణం. అభ్యర్థులను మార్చకుండా దోపిడీదారులకే మళ్లీ టికెట్లు ఇవ్వడం కారణం. అన్నిటికంటే ముఖ్యంగా మీ అహంకార ధోరణెలి పార్టీ ఓటమికి కారణం అంటూ ఏకి పారేశారు. ఇవాళ కోర్టు తీర్పును మీకు అనుకూలంగా మార్చుకొని మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేయాలని చూడటం కరెక్ట్ కాదు. కేటీఆర్.. ఇప్పటికైనా మీరు ప్రజల తీర్పును గౌరవించాలని అన్నారు. నేను

మిగతా 2లో..



12లో..

## సమగ్ర నివేదిక రూపొందించండి

99 రోజుల యాక్షన్ ప్లాన్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## జీఐ హస్తకళలతో ప్రత్యేక బస్సులు

- జీఐ ఆన్ వీల్స్‌కు టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం
- బస్సులపై జీఐ వారసత్వ ప్రదర్శన
- జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్, మంత్రి పొన్నం



హైదరాబాద్(జనంసాక్షి):దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వద్ద తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , టీజీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ / మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి పాల్గొన్నారు. సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ,

మిగతా 2లో..

## అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు

బహిరంగ యుద్ధం మొదలు పెట్టామన్న ఖవాజా ● పాక్ ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చేశాం ప్రకటించుకున్న అఫ్గాన్..! ● మధ్యవర్తిత్వానికి సిద్ధమని ప్రకటించిన ఇరాన్





ఇస్లామాబాద్(జనంసాక్షి): పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. సరిహద్దుల్లో ఇరుదేశాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో పాక్ కీలక ప్రకటన చేసింది. అఫ్గాన్ పై బహిరంగ యుద్ధం ప్రారంభించినట్లు తెలిపింది. ఈ మేరకు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'మా సహనం నశించింది. ఇప్పుడు మాకు.. మీకు మధ్య బహిరంగ యుద్ధమే' అని ఆఫ్గానిస్తాన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. గురువారం రాత్రి అఫ్గాన్ దాడులకు బదులుగా పాక్ వైమానిక దాడులు ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్'గా పేర్కొంది. కాబుల్‌లో మూడుసార్లు పేలుడు శబ్దాలు వినిపించాయని తాలిబన్ అధికారులు పేర్కొన్నారు. కాబుల్, కాందహార్, పక్తియా ప్రావిన్స్‌లలో వైమానిక దాడులు జరిగాయని అఫ్గాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీహుల్లా తెలిపారు. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని వెల్లడించారు. పాక్‌పై చేపట్టిన దాడుల్లో 55 మంది ఆ దేశ సైనికులు చనిపోయారని అఫ్గాన్ ప్రకటించింది. అయితే, ఇస్లామాబాద్ దీన్ని తోసిపుచ్చింది. ఘర్షణల్లో ఇద్దరు పాక్ సైనికులు మరణించారని, మరో ముగ్గురు గాయపడ్డారని పేర్కొంది. ఇస్లామాబాద్ సైనికుల నిర్బంధంపై అఫ్గాన్ చేసిన ప్రకటనను పాక్ ప్రభుత్వ ప్రతినిధి మోషరఫ్ అలీ

మిగతా 2లో..

## దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ముందుకు రావాలి

గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయన్న మోదీ - గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందన్న ప్రధానిదేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఆవిష్కం ణలతో ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయా పరిశ్రమలకు ఆర్థిక సంస్థలు ఆచరణాత్మక పరిష్కారాలతో అండగా నిలిచి మార్కెట్ నమ్మకాన్ని పెంచాలని సూచించారు. 'వికసిత్ భారత్' కోసం సాంకేతికత, సంస్కరణలు, ఆర్థికం అనే అంశంపై నిర్వ హించిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే

మిగతా 2లో..

## ఉక్రెయిన్‌పై మళ్లీ క్షిపణులు వర్షం

- భీకర దాడులతో విరుచుకుపడ్డ రష్యా
- రష్యా దాడితో ఉక్రెయిన్‌లోని ఖర్గివ్‌లో ఓ ఇంటిని చుట్టుముట్టిన అగ్నికీలలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



కీవ్(జనంసాక్షి):ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. రష్యా బలగాలు బుధవారం రాత్రి ఉక్రెయిన్‌లోని 8 ప్రాంతాలను లక్ష్యంగా చేసు కొని 420 డ్రోన్లు, 39 క్షిపణులతో విరుచుకుపడ్డాయి. వీటిలో 11 బాలిస్టిక్ క్షిపణులు కూడా ఉన్నాయి. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో ఉక్రెయిన్‌వాసులు గాయప డ్డారు. వారిలో చిన్నారులూ ఉన్నారు. తమ దేశంపైకి దూసుకొచ్చిన 17 ఉక్రెయిన్ డ్రోన్లను బుధవారం రాత్రి కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. మరోవైపు- యుద్ధంలో మరణించిన దాదాపు 1,000 మంది ఉక్రెయిన్ సైనికుల మృతదేహాలను ఆ దేశానికి తాము అప్పగించామని రష్యా అధికారి వ్లాదిమిర్ మేదిన్‌స్కీ తాజాగా వెల్లడించారు. ఉక్రెయిన్ కూడా 35 మంది రష్యా సైనికుల మృతదేహాలను అప్పగించిందని తెలిపారు. ఈ అప్పగింత ఎప్పుడు జరిగిందనేది మాత్రం స్పష్టంగా పేర్కొనలేదు. తమ దేశంతో కొనసాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ తరఫున 75 దేశాలకు

మిగతా 2లో..

## తమిళనాట ఒకే విడతలో ఎన్నికలు

పరిశీలనలో ఉంది : సీఈసీ జ్ఞానేశ్ కుమార్

## కౌంటింగ్ అయిన వారం వరకు ఈవీఎం-వీవీప్యాట్ వెరిఫై: సీఈసీ

## పదవీవిరమణకు 2 నెలల ముందే కొత్త సీజేల నియామకం'

సుప్రీంకోర్టు కొలీజియం కీలక నిర్ణయం

వివరాలు 2లో

## లిక్కర్ కేసు వల్లే ఎన్నికల్లో ఓడిపోయాం

నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, ప్లలె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## నా వల్ల కాదు.. మీ వైఫల్యాల వల్లే ఓడారు

కడిగిన ముత్యంలా వస్తానని అన్నారు. అలాగే తీర్పుతో రుజువు అయ్యిందన్నారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు క్లీన్‌చిట్ ఇస్తూ వచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మద్యం కుంభకోణం పేరుతో దిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఈ కుంభకోణం కారణంగానే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైంది. ఇవాళ కవితకు అనుకూలంగా వచ్చిన తీర్పుతో న్యాయం జరిగింది. ఇదే విధంగా మా నాయకులపై పెట్టిన ప్రతి కేసు రాజకీయ కక్షలో భాగమే. నిజాలు బయటకు రానంత కాలం కాంగ్రెస్, భాజపా దుష్ప్రచారాలను చూస్తూనే ఉంటాం అని పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యోగులకు ఊరట

బకాయిలు విడుదలయ్యాయి. మరోవైపు గ్రామ పంచాయతీలకు సైతం రూ.389 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక బకాయిల విషయంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నాడు ఆయన ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు రూ.745 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేశారు. గతంలో ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన తర్వాత పెండింగ్ బిల్లులను విడతల వారీగా క్లియర్ చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.745 కోట్లతో ఉద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. కేవలం ఉద్యోగులకే కాకుండా, గ్రామాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వం అదనంగా రూ389 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం కావడంతో పాటు, ఎంతోమంది ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

## అఫ్గాన్‌పై వైమానిక దాడులు ప్రారంభం

జైదీ ఖండించారు. అఫ్గాన్ సైనికులే 133 మంది మరణించారని.. 200 మందికి పైగా గాయపడ్డారన్నారు. తొమ్మిది మంది సైనికులను నిర్బంధించినట్లు తెలిపారు. ఇటీవల తమపై జరిగిన వైమానిక దాడులకు ప్రతీకారంగా పాక్‌పై అఫ్గాన్ విరుచుకుపడింది. ఇది ఇరుదేశాల మధ్య తాజా ఉద్రిక్తతలకు దారితీసింది. కాబుల్, పక్తియా, కాందహార్‌లోని పలు నగరాలపై వైమానిక దాడులు చేపట్టింది. రెండు దేశాల సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో 'సూసైడ్ స్క్వాడ్' అంటూ అఫ్గాన్ మీడియా విడుదల చేసిన చిత్రం ఆందోళన కలిగిస్తోంది. బఖ్తర్ న్యూస్ ఏజెన్సీ ఈ చిత్రాన్ని షేర్ చేసింది. వారంతా సూసైడ్ బాంబర్ల బెటాలియన్ అని భద్రతా వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది. వారంతా పేలుడు పదార్థాలు అమర్చిన దుస్తులు, కారు బాంబులతో ప్రధాన ప్రాంతాలను టార్గెట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించింది. మరోవైపు, పక్తియా, పక్తికా, ఖోస్ట్ వంటి సరిహద్దు ప్రావిన్సుల్లో పాక్ దాడులను ఎదుర్కొంటున్నామని తాలిబన్ ప్రతినిధి వెల్లడించారు. గురువారం పాక్ సైనిక స్థావరాలపై అఫ్గానిస్థాన్ దాడులు చేయడంతో తాజా ఘర్షణలు చెలరేగాయి. తాము చేసింది ప్రతీకారదాడులేనని తాలిబన్లు ప్రకటించుకున్నారు. ఆ వెంటనే పాక్ యుద్ధాన్ని ప్రకటించింది. దీంతో రెండువైపులా భారీ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఇక రెండు దేశాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ముందుకొచ్చింది. పాకిస్థాన్ దాడులతో అఫ్గాన్ ప్రజలు వణికిపోయారు. 'భూకంపం వచ్చిందేమోనని మేమంతా అనుకున్నాం. ఎందుకంటే కొన్నిరోజుల క్రితం కాబుల్‌లో భూకంపం వచ్చింది. తర్వాత అవి దాడులని అర్థమైంది' అని కాబుల్ నివాసి ఒకరు వెల్లడించారు.

## పదవీవిరమణకు 2 నెలల ముందే కొత్త సీజేల నియామకం'

న్యూఢిల్లీ(జనంసాక్షి):మద్రాస్, ఏపీ హైకోర్టులకు కొత్త సీజేలను సిఫారసు చేసిన కొలీజియం- ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ సిఫారసు- మద్రాస్ హైకోర్టు తదుపరి సీజేగా జస్టిస్ సుశ్రుత్ అరవింద్ సిఫారసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా రాష్ట్రాల్లోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల పదవీ విరమణకు రెండు నెలల ముందే కొత్త సీజేలను నియమించాలని తెలిపింది. దీంతో కొత్త సీజేలు కోర్టు పరిపాలన, వ్యవస్థపై ముందుగానే అవగాహన పొందే అవకాశం ఉంటుందని కొలీజియం భావిస్తోంది.ఈ మేరకు జరిగిన తాజా సమావేశంలో, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని కొలీజియం రెండు ముఖ్యమైన హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను సిఫార్సు చేసింది. ఆంధ్రప్రదేశ్, మద్రాస్ హైకోర్టుల్లో త్వరలో ఖాళీ కానున్న సీజే పదవుల భర్తీకి చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం చండీగఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ లీసా గిల్‌ను సిఫారసు చేసింది.ఆమెను ముందుగా ఆంధ్రప్రదేశ్? హైకోర్టుకు బదిలీ చేసి, ఖాళీ ఏర్పడిన రోజునుంచే చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది.

## జీఐ హస్తకళలతో ప్రత్యేక బస్సులు

జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని తెలిపారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపమని, సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచుతాయని, కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గవర్నర్ గారి దూరదృష్టి ఫలితమని తెలిపారు. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్ మరియు విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. టీజీఎస్‌ఆర్టీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోచంపల్లి ఇక్కత్ వరంగల్ , వరంగల్ తివాచీలు కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన ఆరు ప్రముఖ జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందనున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను సృజనాత్మక వేదికగా మలచి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టటం జరిగిందని స్పష్టం చేశారు.

# మద్యం కేసు ఉత్తిదే..



వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయస్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితలను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదల య్యారు.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సీబీఐ కోర్టు ఈ కేసునుంచి కేజ్రీవాల్‌ను డిశ్చార్జ్ చేసింది. శుక్రవారం ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై ది రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. సీబీఐ వేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని కోర్టు పేర్కొం ది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి సిసోడియాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చింది. కవితతో పాటు 23 మంది నిందితులు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. అందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును సీబీఐ సవాల్ చేయనుంది. సౌత్ గ్రూప్ అంటూ పేర్కొనడాన్ని తప్పుపట్టిన కోర్టు ఢిల్లీ లిక్కర్ కేసులో 'సౌత్ గ్రూప్' పేరుపై సీబీఐ కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. లిక్కర్ కేసులో కొంత మంది నిందితులను వారి ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని 'సౌత్ గ్రూప్' అని పిలవడం సరైన పద్ధతి కాదని న్యాయస్థానం హెచ్చరించింది. 'సౌత్ గ్రూప్' అనే పదానికి చట్టంలో ఎలాంటి ఆధారం లేదని స్పష్టం చేసింది. నేరం నిరూపించడానికి ప్రాంతం లేదా వారు ఎక్కడి వాళ్లు అన్నది సంబంధం లేదని తేల్చిచెప్పింది. మరి మిగతా నిందితులను 'నార్త్ గ్రూప్' అని ఎందుకు పేరు పెట్టలేదని... ఇది ఒకపక్షపాతంగా కనిపిస్తోందని మందలిం చింది. ప్రాంతం ఆధారంగా ఇలా పిలవడం వల్ల ప్రజల్లో, కోర్టులో కూడా ఒక తప్పుడు భావన కలుగుతుందని సీబీఐ కోర్టు అభిప్రాయపడింది. క్రిమినల్ కేసులు వ్యక్తి చేసిన పనిపై ఆధారపడి ఉండాలని, అతను ఎవరు..?, ఎక్కడి వాళ్లు,? అన్నవిషయంపై కాదని స్పష్టం చేసింది. నిందితుడిని అతని చర్యల ఆధారంగా మాత్రమే విచారించాలని సూచించింది. అతని జాతి, ప్రాంతం, జాతీయత వంటి అంశాలను ఈ కేసులోకి లాగడం తగదని పేర్కొంది. ఇలా చేయడం న్యాయమైన విచారణ హక్కుకు విరుద్ధమని తెలిపింది. అమెరికా కోర్టు ఇచ్చిన ఒక తీర్పును కూడా ఉదాహరణగా సీబీఐ కోర్టు ప్రస్తావించింది. జాతి లేదా జాతీయత ఆధారంగా నిందితులను పిలవడం తప్పని అక్కడ కూడా చెప్పారని న్యాయస్థానం గుర్తు చేసింది. ఇకపై చార్జ్‌షీట్లు తయారు చేసే సమయంలో దర్యాప్తు సంస్థ చాలా జాగ్రత్తగా ఉండాలని సీబీఐ కోర్టు హెచ్చరికలు జారీ చేసింది. నిందితుల గురించి తటస్థంగా, సాక్ష్యాల ఆధారంగా మాత్రమే రాయాలని సూచించింది. ప్రాంతం, గుర్తింపు వంటి అంశాలను ఉపయోగించడం మానుకోవాలని మందలించింది. నిందితుడు చేసిన నేరాన్ని మాత్రమే చూడాలని.. అతను ఎక్కడి వారన్నది కాదని సీబీఐ కోర్టు స్పష్టం చేసింది.

## మోడీ, అమిత్ షాల కుట్రకు బలయ్యా

వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. సిసోడియాపై ప్రాథమికంగా కేసు కూడా నిలబడలేదని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా లను కోర్టు డిశ్చార్జ్ చేసింది. కేజ్రీవాల్‌ను సరైన ఆధారాలు లేకుండా ఇరికించారని జడ్జి వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కవితతో పాటు ఈ కేసులో ఉన్న 23 మంది నిందితులు తప్పు చేశారన్న సాక్ష్యా దారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యానించింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత అరవింద్ కేజ్రీవాల్ భావోద్వేగానికి గురయ్యారు. మీడియా ముందు కన్నీరు పెట్టుకున్నారు. తీర్పు తర్వాత, తనపై ఉన్న కేసు పూర్తిగా కల్పితమని మరోసారి పునరుద్ఘాటించారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడానికి స్వతంత్ర భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని ఐదుగురు ప్రముఖ నాయకులను జైలులో పెట్టారని గుర్తు చేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అరెస్టు చేసి జైలుకు పంపారని, ఇది భారత చరిత్రలో ఇంతకు ముందెన్నడూ జరగలేదని అన్నారు. తాను ఆరు నెలలు జైలులో ఉన్నానని, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాదాపు రెండు సంవత్సరాలు జైలులో గడిపారని తెలిపారు. ఈ లిక్కర్ వ్యవహారం కల్పితమని, తన ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా దుష్ప్రచారం చేస్తున్నారని కేజ్రీవాల్ అన్నారు. టీవీ ఛానెళ్లలో తనను పదే పదే అవినీతిపరుడిగా చిత్రీకరించారని కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు జరపాలి

ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్‌షా కుట్ర పన్నారని, ఇప్పుడు దేశానికి వారు క్షమాపణ చెప్పాలని ఆప్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ సహా 23 మంది నిందితులకు ప్రత్యేక కోర్టు విముక్తి కల్పించిన అనంతరం ఆయన తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ఢిల్లీలో మళ్లీ ఎన్నికల జరపాలని మోదీకి సవాలు విసిరారు.'ఏళ్ల తరబడి నేను నిజాయితీని కూడబెట్టుకున్నాను, డబ్బులు కాదు. అవినీతి, అవకతవకలకు పాల్పడలేదు. సీబీఐ, ఈడీ నాపై దాడి చేశాయి. ప్రాథమిక ఆధారాలు లేకుండా అరెస్టు చేశారు. ఇవాళ కోర్టు 600 పేజీల తీర్పులో ఈ కేసులో చిన్న సాక్ష్యం కూడా లేదని తేల్చిచెప్పింది. ఆమ్ ఆద్మీ పార్టీని అంతం చేయడానికి ఇద్దరు వ్యక్తులు... మోదీ, అమిత్‌షా కుట్ర పన్నారన్నారు.

## మా దర్యాప్తు సీబీఐ కేసుపై ఆధారపడి లేదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):న్యూఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనిలాండరింగ్ కేసు స్వతంత్రత కలిగిందని ఈడీ అధికారులు తెలిపారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసు నుంచి మాజీ సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా సహా నిందితులందరికీ దిల్లీ కోర్టు ఊరట కలిగించిన నేపథ్యంలో ఈడీ ఈ వ్యాఖ్యలు చేసింది. తమ దర్యాప్తు కేవలం సీబీఐ కేసుపై ఆధారపడి లేదని పక్కా సాక్ష్యాధారాలతో విచారిస్తున్నామని ఈడీ అధికారులు తెలిపారు. దిల్లీ మద్యం పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఇతరులను నిర్దోషులుగా విడుదల చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈడీ అధికారుల ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.విజయ్ మదన్‌లాల్ కేసులో సుప్రీంకోర్టు 2022లో ఇచ్చిన తీర్పు మేరకు ప్రధాన కేసు కొట్టివేస్తే దానికి అనుబంధంగా ఉన్న మనీ లాండరింగ్ కేసు కూడా రద్దవుతుంది.

## న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది

కేసు అని ఎన్నోసార్లు చెప్పాను. అదే నిజమైంది. దీంతో నేను, నా కుటుంబం కొన్ని నెలలపాటు క్షోభ అనుభవించాం. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారు. కోర్టు తీర్పు రాకుండానే నాపై కొందరు అనుచితంగా మాట్లాడారు. కష్ట సమయంలో అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాను అని కవిత అన్నారు. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చీట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్. అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాతో పాటు కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది. లిక్కర్ కేసులో ఐదు నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. లిక్కర్ కేసులో కోర్టు తీర్పుపై కవిత స్పందించారు. కవిత మాట్లాడుతూ.. నిజం గెలిచింది.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వచ్చా.. నా తల్లిదండ్రులు, అత్తామామలు మాకు అండగా నిలిచారు.. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని టా÷-గ్గం÷ట్ చేయడానికే ఈ కేసు పెట్టారు.. నన్ను మూడేళ్ల పాటు నానా మాటలు అన్నారు.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేశారు.. రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని నిరూపితమైంది.. నాకు అండగా నిలిచిన వారిని మరిచిపోను అంటూ కవిత భావోద్వేగానికి గురైంది.

## తమిళనాట ఒకే విడతలో ఎన్నికలు

చెన్నై(జనంసాక్షి):తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నిర్వహించాలని పలు పార్టీలు సూచించినట్టు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. వారి విజ్ఞప్తులను వివిధ కోణాల నుంచి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడే దీనిపై ఒక స్పష్టత ఇస్తామని అన్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై జ్ఞానేశ్ కుమార్ శుక్రవారంనాడు సమీక్ష జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలో జరిపిన ఎస్ఐఆర్ పక్రియ దేశానికే ఒక మోడల్‌గా నిలిచిందని, విజయవంతంగా ఈ పక్రియ పూర్తయిందని చెప్పారు. ఎస్ఐఆర్‌తో పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్టు కొన్ని రాజకీయల పార్టీలు విమర్శించినప్పటికీ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విషయంలో ఈసీ అధికారులు ఎంతో ప్రొఫెషనలిజం కనబరిచారని ప్రశంసించారు. ఇటీవల కాలంలో ఏమాత్రం పొరపాట్లకు తావీయకుండా బీహార్ ఎన్నికలు జరిగాయని, అంతకు మించి మరింత మెరుగ్గా తమిళనాడులో ఎన్నికలు నిర్వహిస్తామని, సరికొత్త రికార్డు సృష్టిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు పక్రియ పూర్తయిన ఏడు రోజుల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వీవీపాట్ల స్లిప్పులను వెర్గి÷ చేసుకోవడానికి అభ్యర్థులను అనుమతిస్తామని సీఈసీ తెలిపారు. అయితే ఇందుకు కొంత మొత్తం చెల్లించాలని అన్నారు. ఈవీఎం రౌండ్లకు ముందు పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లు కౌంటింగ్ జరుపుతామని చెప్పారు.

## కౌంటింగ్ అయిన వారం వరకు ఈవీఎం-వీవీప్యాట్ వెరిఫై

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా అభ్యర్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కౌటింగ్ పూర్తయిన ఏడు రోజుల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వీవీప్యాట్ల స్లిప్పులను వెరిఫై చేసుకోవడానికి అభ్యర్థులకు అనుమతి ఇచ్చింది. అయితే అందుకు కొంత మొత్తం చెల్లించాలని చెన్నైలో జరిగిన కార్యక్రమంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై ఈసీ సమీక్ష జరిపింది." తమిళనాడులోని 75,000 పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇక్కడ నిర్వహించిన సర్ ప్రక్రియ దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈవీఎం రౌండ్ల కంటే ముందు పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లు కౌంట్ చేసేలా నిర్ణయం తీసుకున్నాం" అని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. అలాగే తమిళనాడులో అన్ని పార్టీలు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని కోరాయని పేర్కొన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

## ఉక్రెయిన్‌పై మళ్లీ క్షిపణుల వర్షం

చెందిన 10 వేల మందికి పైగా వాలంటీర్లు పోరాడుతున్నారని రష్యా ప్రభుత్వరంగ వార్తాసంస్థ 'టాస్' గురువారం ఓ కథనంలో పేర్కొంది. నెలనెలా దాదాపు 600 మంది కొత్త వ్యక్తులు (విదేశీయులు) కీవ్ తరఫున భూతల పోరాటంలో పాల్గొనేందుకు నమోదు చేసుకుంటున్నారని తెలిపింది.

# ప్రజాస్వామ్య వ్యవస్థపై కొత్త విశ్వాసం

- మీరు ప్రశ్నించండి.. మేం పరిష్కరిస్తాం
- ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు మీకుంది
- మావోయిస్టులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటి
- పునరావాసం, రక్షణ సహకారం అందిస్తామని హామీ
- లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని వెల్లడి
- భవిష్యత్ ప్రణాళికలను సీఎంకు వివరించిన మాజీ నేతలు



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : జీనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత మావోయిస్టులు చట్టపరిధిలో తమ పనితాము చేసుకోవచ్చునని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. వారు సమాజంలో గౌరవప్రదంగా జీవంచడానికి అవసరమైన అన్ని సహాయాలనూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని హామీనిచ్చారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో పనిచేసేవారితో ప్రభుత్వం కూడా కలిసి ముందుకు సాగుతుందని చెప్పారు. ఇటీవలే తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, పుల్లూరి ప్రసాద్, పోతుల పద్మావతి, బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డిలు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం సచివాలయంలోకి వెళ్లినవారు డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ ఇంటలిజెన్స్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్, తెలంగాణ ఎస్ఐబీ (ఇంటలిజెన్స్) ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుమతి సమక్షంలో సీఎంతో చర్చలు కొనసాగించారు. ముఖ్యమంత్రి సలహాదారు వెం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. కేశవ రావు, తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకుపైగా వారితో సుదీర్ఘంగా చర్చించిన సీఎం రేవంత్.. పలు కీలకాంశాలపై సమాలోచనలు జరిపారు. అడవుల్లో అనేక సంవత్సరాలు గడిపిన తర్వాత ప్రజాస్వామ్య బాటను ఎంచుకున్నందుకు సీఎం వారిని అభినందించారు. ఏ సమస్యకూ హింస శాశ్వత పరిష్కారం కాదని, ప్రజల ఆకాంక్షలు ప్రజాస్వామ్య మార్గాల ద్వారానే నెరవేరతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆయుధ పోరాటాన్ని విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలోకి రావడానికి వీలు కల్పించిన ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి కేడర్లు ఏకపక్షంగా కృతజ్ఞతలు తెలిపారు. పునరావాసం పొందిన కేడర్లకు ప్రస్తుతం పొరుగు రాష్ట్రాల్లో ఉన్న విధానాలతో సమానంగా రిలీఫ్, పునరావాస ప్యాకేజీలను మెరుగుపరచాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. పునరావాసం పొందిన మావోయిస్టులకు భద్రత, ఇతర పునరావాస ప్రయోజనాలు కల్పించడంలో ఎలాంటి లోపం ఉండదని సీఎం ఈ సందర్భంగా హామీనిచ్చారు. మావోయిస్టుల లొంగుబాటుపై అసెంబ్లీలోనూ ప్రకటన చేస్తానన్నారు.

రాష్ట్రంలో మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి గత రెండు సంవత్సరాలుగా జరిగిన పురోగతి గురించి డీజీపీ శివధర్ రెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. గత రెండు సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 591 మంది మావోయిస్టులు పునరావాసం పొందారని, వారు ఇప్పుడు సామాన్య పౌరులుగా సాధారణ జీవితాన్ని గడుపుతున్నారని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖ సమన్వయ ప్రయత్నాలు, ప్రభుత్వం అమలు చేసిన మెరుగైన పునరావాస విధానాల వల్ల ఉన్నత నాయకులలో కూడా మార్పు వచ్చిందని, దీనితో వారు ప్రజాస్వామ్య వ్యవస్థపై కొత్త విశ్వాసంతో సమాజంలో పునరావాసం పొందాలని నిర్ణయించుకున్నారని ఆయన వివరించారు. మాజీ కేడర్లు చేసిన మౌఖిక విజ్ఞప్తుల ఆధారంగా సామరస్యపూర్వక పరిష్కారానికి మార్గం సుగమం చేస్తూ, మొత్తం సమావేశం బహిరంగ, స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

## జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టం

అర్బన్ ఏరియాలో ప్రతి వీధి దీపం వెలుగుతుందో లేదో డ్యాష్ బోర్డులో కనిపించాలని సీఎం అన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే దానిని వెంటనే తెలుసుకొని పరిష్కరించాలన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నగరంలోని అన్ని హోటళ్లలోని కిచెన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తరచూ తనిఖీలు చేపట్టడంతో పాటు పర్యవేక్షణ కొనసాగాలన్నారు. ఫుడ్ సేఫ్టీకి ఆయా హోటళ్లు తీసుకుంటున్న చర్యలను మదింపు చేసి వారికి రేటింగ్స్ ఇవ్వాలని సీఎం సూచించారు. కోర్ అర్బన్ ఏరియాలో ఫైర్ సేఫ్టీకి పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 50 అంతస్తులకుపైగా భవంతులు నిర్మాణాలు జరుగుతున్నాయని.. అంత ఎత్తులో అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన అధునాతన సామగ్రి, సాంకేతికతను సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. నగరంలోని సర్కిల్స్ లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సీఎం సూచించారు. అదే సమయంలో యూనిపోల్స్‌ను ఏర్పాటు చేసి వాటిని మల్టీ యుటిలిటీ పోల్స్‌గా ఉపయోగించాలని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఆర్ అండ్ బీ, ఇతర విభాగాల పరిధిలోని రోడ్లన్నింటిని ఎంఏయూడీ పరిధిలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. వివిధ యాజమాన్యాల పరిధిలో రోడ్లు ఉండడంతో ఉన్న గందరగోళాన్ని తొలగించాలని పేర్కొన్నారు. పనుల్లో ఏకరూపత, పనుల వేగవంతానికి ఇది తోడ్పడుతుందని సీఎం అన్నారు. నగరంలో వివిధ ప్రదేశాల్లో రద్దీ తగ్గించేందుకు డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ల నమూనాలను అధికారులకు ప్రదర్శించారు. వాటిని పరిశీలించిన సీఎం పలు సూచనలు చేశారు. చారిత్రాక ప్రాధాన్యం గల కట్టడాలను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని.. వాటిని పర్యాటక స్థలాలుగా మార్చాలని సీఎం సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్కడ అవసరమైన అనుమతులు వెంటనే తీసుకోవాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాల పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలోని పెద్ద చెరువులు, కుంటల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. హైడ్రా పరిరక్షించిన చెరువుల చుట్టూ కట్టలు కట్టి వదిలి వేయకుండా వాటి రక్షణతో పాటు సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

## దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ముందుకు రావాలి

సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని మోదీ పేర్కొన్నారు. కాగితంపై ఉన్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా సాకారం అవుతాయని వివరించారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందని ప్రధాని తెలిపారు. 11 ఏళ్ల క్రితం కేవలం రూ. 2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ. 12 లక్షల కోట్లకుపైగా పెరిగాయని వివరించారు. ఈ భారీ కేటాయింపులు ప్రైవేట్ రంగానికి ఒక సంకేతమని పేర్కొన్నారు. మరోవైపు, బడ్జెట్‌లోని విషయాలపై మరింత చర్చ జరిపేకంటే దాని తక్షణ అమలుపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ వాటాదారులను కోరారు. అదేవిధంగా, ఆర్థిక రంగం గురించి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్ మార్కెట్లను మెరుగుపరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడి చట్రాన్ని మరింత అనుకూలంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అదేవిధంగా, ఆర్థిక రంగం గురించి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్? మార్కెట్లను మెరుగుపరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ప్రయివేటు ఆసుపత్రిలో ఐదు రోజుల పసికందు మృతి




- డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని బంధువుల ఆరోపణ
- హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత
- సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో శుక్రవారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఐదు రోజుల కిందట జన్మించిన మగ శిశువు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన బాదితులు హాస్పిటల్ వద్దకు చేరుకుని డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే బాబు చనిపోయాడని ఆరోపిస్తూ పెద్ద ఎత్తున ఆసుపత్రి ముందు గుమి గూడారు. దీంతో కొద్ది సేపు అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తెలిసిన వివరాల ప్రకారం పెండల్ వాడ గ్రామానికి చెందిన అంకుశ్ రెడ్డి, భార్య కీర్తన డెలివరీకోసం జిల్లా కేంద్రంలోని శారద నర్సింగ్ హోం లో గత కొద్ది రోజుల క్రితం అడ్మిట్ అయ్యారు. అక్కడే ఆసుపత్రిలో ఉండి ట్రీట్ మెంట్ తీసుకుంటున్నారు. .నాలుగు రోజుల కిందటే కీర్తన డెలివరీ అయి మగ శిశువుకు జన్మనిచ్చింది. ఐతే శుక్రవారం బాబుకు కొద్దిగా అస్వస్థత ఉందని వెంటనే బాబును ఐసీయూలో ఉంచవలసి వస్తుందని బాబు తల్లితండ్రులకు డాక్టర్ ఈ విషయం చెప్పడం జరిగిందని, ఐతే తల్లితండ్రులు వెంటనే వారి వద్ద ఉన్న కార్లో వైద్యం కోసం తీసుకెళ్తామని డాక్టర్ కు చెప్పినా డాక్టర్ వినకుండా బాబును చికిత్స కోసం ఓ ప్రైవేటు వెహికిల్ లో వేరే ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇది ఎంతవరకు సమంజసం అంటూ బాదితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే బాబు మృతి చెందాడని తప్పు కప్పి పుచ్చుకోవడం కోసం బాబును డాక్టర్ వేరే ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగిందని ఆరోపించారు. వెంటనే డాక్టర్ పై తగు చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

# ప్రేమ పెళ్లిపై సోదరుడి కర్కశం

- యువకుడిపై స్నేహితులతో కలిసి దాడి
- ప్రాణాపాయ స్థితో గాంధీలో చికిత్స

**భువనగిరి, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడిపై హత్యాయత్నం జరిగింది. తన చెల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని యువకుడిపై ఓ వ్యక్తి చంపేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారంలో చోటుచేసుకుంది. ప్రస్తుతం బాధితుడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హైదరాబాద్‌లోని నేరెడ్‌మెట్ ప్రాంతానికి చెందిన అజయ్, రామలింగంపల్లికి చెందిన యువతి గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఇటీవల మూడు రోజుల క్రితం వీరిద్దరు వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో అజయ్‌పై యువతి సోదరుడు పగ పెంచుకున్నాడు. బుధవారం యువతి మొబైల్ నుంచి రామలింగంపల్లికి రావాలంటూ అజయ్‌కి ఆమె సోదరుడు మెసేజ్ చేశాడు. తనను తన ప్రియురాలే పిలిచిందని భావించిన అజయ్ రామలింగంపల్లికి వెళ్లాడు. ఆ గ్రామ శివార్లలోకి రాగానే యువతి సోదరుడు అజయ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశాడు. యువతి సోదరుడు, అతని స్నేహితులు అజయ్ కళ్లలో కారం చల్లి... అనంతరం కత్తులతో దాడి చేశారు. అజయ్‌పై 14 సార్లు కత్తితో దాడికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో పడిపోవడంతో చనిపోయాడని భావించి అక్కడి నుండి వెళ్ళిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అజయ్‌ని గాంధీకి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజస్థాన్‌లో మూడు నగరాల పేర్లు మార్పు

- మౌంట్ అబూ ఇకనుంచి అబూరాజ్

**జైపూర్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** మూడు ప్రముఖ నగరాలు, పట్టణాల పేర్లను మారుస్తున్నట్టు రాజస్థాన్ ప్రభుత్వం శుక్రవారంనాడు ప్రకటించింది. ప్రఖ్యాత హిల్‌స్టేషన్ మౌంట్ ఆబూ ఇక నుంచి ఆబూ రాజ్‌గా పేరుమార్పు సంతరించుకుంటుంది. జహాజ్‌పూర్ పేరు యజ్ఞపూర్‌గా, కామా పేరు కామవన్‌గా మారనున్నాయి. ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారంనాడు ఈమేరకు ప్రకటించారు. రాజస్థాన్‌లోని ఏకైక హిల్‌స్టేషన్‌గా మౌంట్ ఆబూకు పేరుంది. ఆరావళి పర్వత శ్రేణిలోని మౌంట్ ఆబూ ప్రధాన పర్యాటక కేంద్రంగా టూరిస్టులను ఆకర్షిస్తోంది. చల్లటి వాతావరణం, నదులు, సరస్సులు, జలపాతాలు, పచ్చని వాతావరణంతో ఏడాదంతా విజిటర్లను అహ్లాదపరుస్తోంది. అలాగే, భిల్వారా జిల్లాలోని జహాజ్‌పూర్ సంస్కృతి, మత ప్రాధాన్యత కలిగిన చారిత్రక పట్టణం. రాజపుత్రుల కాలం నాటి పురాతన ఆలయాలు, మెట్లబావులు, వారసత్వ కట్టడాలు ఎన్నో ఈ ప్రాంతంలో ఉన్నాయి. కాగా, భరత్ జిల్లాలోని కామా పట్టణం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. బ్రజ్ ప్రాంతంలో భాగంగా శ్రీకృష్ణుడు తన బాల్యాన్ని గడిపిన ప్రదేశంగా ఇది ప్రసిద్ధి చెందింది.

# సైబర్ క్రైమ్ కేసులో నిందితుడి అరెస్ట్

**హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నిందితుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కంబోడియా నుంచి వస్తుండగా చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విశాఖకు చెందిన పెదపూడి ప్రసన్నకుమార్‌గా గుర్తించారు. ఇతడిని మ్యాట్రిమోనియల్, క్రిప్టో ఇన్వెస్ట్ మోసం కేసులో ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. ఓ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, బాధితులతో పరిచయం ఏర్పరచుకొని, యువతిగా నటిస్తూ పెళ్లి చేసుకుంటానన్న హామీతో మోసాలకు పాల్పడినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. నకిలీ క్రిప్టో ట్రేడింగ్ ద్వారా పెట్టుబడి పెట్టాలని ప్రలోభాలకు గురిచేసినట్లు గుర్తించారు. ఒకరి నుంచి రూ.11 లక్షలు కాజేసినట్లు విచారణలో తేలింది. దాదాపు 400 నుంచి 500 అక్రమ సిమ్ కార్డులు సేకరించి ఫేక్ అకౌంట్లు తెరిచినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది.

# రాష్ట్రంలో కేన్సర్ నివారణ దిశగా మరో ముందడుగు

**హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** సర్వైకల్ కేన్సర్ నివారణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు. కింగ్ కోఠి డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

# చౌరస్తా నా! 'చావు' రాస్తా

- ట్రైల్లకింద నలిగిపోతున్న ప్రాణాలు
- రోడ్డు ప్రమాదానికి గురై 62 మంది మృతి
- క్షతగాత్రులుగా మారిన 103 మంది వాహనదారులు
- ప్రాణాలు గాల్లో కలుస్తున్న చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- చౌరస్తా విస్తరణకు పట్టుబట్టిన ఆర్ఎన్. రాము
- లభిస్తున్న ప్రజల మద్దతు






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** చౌరస్తా అంటే నాలుగు దిక్కుల నుండి వెళ్ళే వాహనదారులు స్వేచ్ఛగా ప్రాణాలతో ఇంటికి చేరాలి కానీ వాహనదారుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి ఆ కుటుంబల ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి పోలీస్ రికార్డ్ ప్రకారం ఒక్కో కుటుంబంలో తండ్రి కూతురు సైతం ఒకే ప్రమాద ఘటనలో ప్రాణాలు పోగొట్టుకున్న షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో ఇప్పటి వరకు 62 మంది మృత్యువాత పడితే 103 మంది వాహనదారులు తీవ్ర గాయాలపాలై క్షతగాత్రులుగా మారిన దుస్థితి నెలకొంది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో రోజు రోజుకు ట్రాపిక్ సమస్య విపరీతంగా పెరగడంతో వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు చౌరస్తా విస్తరణ లేకపోవడం నాలుగు వైపుల నుండి సమస్యగా మారింది దీంతో ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో 62 మంది వాహనదారులు మృత్యువాత పడగా 103 మంది వాహనదారులు క్షత గాత్రులుగా మారారు దీంతో ఆ కుటుంబాల్లో తీవ్రమైన విషాదాన్ని నింపింది చౌరస్తా ప్రమాద ఘటన చౌరస్తా విస్తరణ చేపట్టాలని మరో ప్రమాదంతో మరొక్కరి ప్రాణాలు పోవోద్దని షాద్ నగర్ పట్టణానికి చెందిన ఆర్.ఎన్ రాము వివిధ రూపాల్లో తన పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు షాద్ నగర్ పట్టణ చౌరస్తా విస్తరణ పనులు చేపట్టాలని ధర్నాలు రాస్తారోకోలు ఆందోళనలు సైతం చేపట్టారు దీంతో పెద్ద ఎత్తున సోషల్ మీడియా వేదికగా ఆయనకు ప్రజల మద్దతు లభిస్తుంది.

### త్వరలోనే విస్తరణ చేపడతాం! : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రోజురోజుకు ట్రాపిక్ సమస్య విపరీతంగా పెరగడంతో చౌరస్తాలో ప్రమాదాలు జరుగుతున్న మాట వాస్తవం ఫుట్ పాత్ పై కొంతమంది పేద ప్రజలు చిన్న చిన్న వ్యాపారాలతో జీవనం సాగిస్తున్నారు వారికి ప్రత్యామ్నాయంగా ఆధారం చూయిస్తూ త్వరలోనే చౌరస్తా విస్తరణతో ఆ సమస్యను పరిస్కరించడంతో పాటు ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం...

# చెన్నూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- మంత్రి వివేక్ వెంకటస్వామి



**చెన్నూరు ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** చెన్నూరు మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించి మున్సిపాలిటీలో బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్లు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. చెన్నూరు మున్సిపాలిటీలో సుమారు రూ.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనేక వార్డుల్లో బోర్‌వెల్స్, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమృత్ 2.0 పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందజేస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరిట నిధులను దుర్వినియోగం చేసిందని విమర్శించిన మంత్రి, చెన్నూరు పట్టణ ప్రజలకు గోదావరి నుంచి శుద్ధజలాల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. త్వరలో పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు కూడా చేపడతామని వెల్లడించారు. పట్టణంలోని కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఇప్పటికే నిధులు కేటాయించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో గోదావరి ఇసుకను అందు బాటులోకి తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. మారెమ్మవాడలో రహదారి సమస్యను పరిష్కరించామని గుర్తుచేశారు. మున్సిపాలిటీలో 100 కొత్త ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినము . ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కేబినెట్‌లో చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. దేవులవాడ, బబ్బేరు, చెలుక గ్రామాల రైతులకు సుమారు రూ.18 కోట్ల పరిహారం మంజూరు చేసి పంపిణీ చేసినట్లు వివరించారు. మే నెలలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కోటి ఇరవై లక్షల రూపాయలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. చెన్నూరులోని ప్రతి వార్డులో సమన్వయంతో పని చేసి మున్సిపాలిటీనీ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

# వరల్డ్ అథ్లెట్స్ లెవెల్-2 కోచ్‌గా తిరుమల రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రపంచ అథ్లెటిక్స్ లెవెల్-1 అండర్ -16 కోచ్ తిరుమలరావు చోటు సంపా దించారు. తా జాగా వెలు వడిన ప్రపంచ అథ్లెటిక్స్ ఎలిజి బిలిటీ లెవె ల్-2 అండర్ 18 స్పెషలైజేషన్ కోచ్‌గా తిరుమల రావు బోరాడి ప్రత్యేక కోచ్ భాగంలో అర్హత లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, హై జంప్, పోల్ వాల్ట్, చోటు సంపాదించుకున్నారు. ఇది అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆసియా అథ్లెటిక్స్ అసోసియేషన్, ప్రపంచ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో జరుగుతుంటాయి. కోచ్‌ల విద్య, ధృవీకరణ వ్యవస్థ స్థాయి కోచ్‌లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల కోచులు పాల్గొన్నారు. ఇందులో లెవెల్ -1, లెవెల్ -2, లెవెల్ -3 కోచ్‌లు ఉంటారు. ఈ కోచ్ అందరూ నేషనల్, ఆసియా, వరల్డ్ లెవెల్‌లో ఇవనున్నారు. లెవెల్ -1 కోచ్‌గా స్ప్రింట్, మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్, జేమ్స్ అండ్ త్రో, రిలే అండ్ రేస్వాక్ విభాగాలలో నిర్వహించిన పోటీలు, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణతతో పాటు కమ్యూనికేషన్ స్కిల్లో ఎంపికవగా. ఇప్పుడు లెవెల్ - 2 కోచ్ గా కూడా ఎలిజిబిలిటీ సాధించనున్నారు.

# మెడికల్ సీట్ల పేరుతో వందమందికి మోసం

- ఇద్దరు కేటుగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** మెడికల్ సీట్లు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 40 లక్షల రూపాయలు మోసం చేసిన ఘటన కుత్బుల్లాపూర్, పేట్ బాషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం మోసానికి పాల్పడిన ఇద్దరు కేటుగాళ్లను పేట్ బాషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. జీడిమెట్ల విలేజ్ లోని ఓ బాధితుని ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఎస్.హెచ్ఓ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు అర్విందర్ రావు(40), న్యూఢిల్లీ, వెంకటరావు(58) హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా నీట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులే టార్గెట్ గా దాదాపు 100 మందిని మోసం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాదాపు 2 కోట్ల50 లక్షలకు పైగా మోసం చేసినట్టు పోలీసుల వెల్లడించారు. నిందితుల నుంచి నకీలీ అలాట్‌మెంట్ లెటర్స్, ఐడీలు, నకీలీ ఒప్పందపత్రాలు, 4 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.

# బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు అబద్ధం

- జీఐ ఆన్ వీల్స్.. టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం
- బస్సులపై జీఐ వారసత్వ ప్రదర్శన
- జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులు
- జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్ , మంత్రి పొన్నం




**హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వద్ద తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , టీజీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ / మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి పాల్గొన్నారు.సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని తెలిపారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపమని, సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచుతాయని, కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గవర్నర్ గారి దూరదృష్టి ఫలితమని తెలిపారు. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్ మరియు విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోచంపల్లి ఇక్కత్ వరంగల్ , వరంగల్ తివాచీలు (కార్పెట్లు), కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన ఆరు ప్రముఖ జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందనున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను సృజనాత్మక వేదికగా మలచి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టటం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ నాగి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం గవర్నర్ గారి ఆలోచనల ఫలితమని తెలిపారు. బస్సులపై జీఐ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా సంస్కృతిని ప్రజలకు చేరువ చేయడంతో పాటు కళాకారులకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యమని చెప్పారు. బస్సులపై ప్రదర్శించిన డిజైన్లను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగదు బహుమతులు మెమొంటోలు అందజేశారు. జీఐ గుర్తింపుల సాధనలో సేవలందించిన సుభజిత్ సహా ప్రత్యేకంగా సన్మానించారు. ఆరు జీఐ కళారూపాలకు చెందిన కళాకారులను కూడా ఘనంగా సత్కరించారు.తదనంతరం గవర్నర్ , మంత్రి , జిల్లా కలెక్టర్ టీజీఎస్ఆర్టీసీ అధికారులు కలిసి జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ÷భౌగోళిక సూచిక (జీఐ) అనేది ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన ఉత్పత్తి లక్షణాలు, నైపుణ్యం, సంప్రదాయాన్ని ప్రతిబింబించే సమిష్టి మేథో సంపత్తి హక్కు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి 18 జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులు ఉన్నాయి. జీఐ గుర్తింపు ద్వారా సంప్రదాయ కళలు, వారసత్వాన్ని సంరక్షించడం, నకిలీలను నివారించడం, కళాకారులకు గుర్తింపు కల్పించడం, వారి జీవనోపాధిని స్థిరంగా నిలుపుటకు దోహదపడుతుంది. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రాజశేఖర్ , శ్రీ ఖుస్రో షా ఖాన్, రీజినల్ మేనేజర్లు శ్రీలత , సుధ పరిమళ , జేఎన్ఏఎఫ్ఏయూ ప్రతినిధులు, కళాకారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నైతికతకు సవాలు
# మైనార్టీల భద్రత ఎక్కడ?

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయన్ ఒక సందర్భంలో తన కుమార్తె ముస్లిం స్నేహితురాలికి ఢిల్లీలో మతపరమైన గుర్తింపు కారణంగా ఫ్లాట్ ఇవ్వకుండా నిరాకరించారని గుర్తుచేసిన సంఘటన చిన్నదిగా కనిపించినా, భారత సమాజంలో రాజ్యాంగ నైతికతకు, సామాజిక వాస్తవానికి మధ్య ఉన్న అంతరాన్ని బలంగా బహిర్గతం చేస్తుంది. రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇస్తుంది; కానీ అనుభవజీవితంలో మైనార్టీలు అనేక రకాల వివక్షను ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు 2014 తరువాత మరింతగా వినిపిస్తున్నాయి.




నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం మతపరమైన ఉద్రిక్తతలకు సంబంధించిన కేసులు గత దశాబ్దంలో స్థిరంగా నమోదవుతున్నాయి. కౌలుదారులపై మతం ఆధారంగా ఇల్లు ఇవ్వకుండా నిరాకరించడం వంటి "హౌసింగ్ డిస్క్రిమినేషన్" అంశంపై ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్ వంటి నగరాల్లో పలు సర్వేలు వెలువడ్డాయి. ఉదాహరణకు, సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సిఎస్‌డిఎస్) వంటి సంస్థల అధ్యయనాలు ముస్లింలకు అద్దె ఇళ్ల విషయంలో అధిక నిరాకరణలు ఎదురవుతున్నాయని సూచించాయి. ఇది కేవలం వ్యక్తిగత పక్షపాతం కాదు; ఇది సామాజికంగా స్థిరపడిన మత ద్వేష ధోరణికి సంకేతం.

2015లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అఖ్లాఖ్ హత్య, 2017లో రాజస్థాన్‌లో పేహ్లూ ఖాన్‌పై దాడి, 2020లో ఢిల్లీలో జరిగిన సామూహిక హింస వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఈ ఘటనల్లో మతపరమైన ప్రేరణ ఉన్నదనే ఆరోపణలు ఈ 11 ఏళ్ళలో లెక్క లేనన్ని ఫిర్యాదులు వచ్చాయి. చాలా వరకు ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియాలో ఇలాంటి వార్తలు, దృశ్యాలు రాకుండా బీజేపీ పాలన ఉన్న రాష్ట్రాల్లో జరిగింది. మానవహక్కుల సంస్థలు, ముఖ్యంగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదికలు ఈ కాలంలో మైనార్టీలపై హింసా సంఘటనలపై ఆందోళన వ్యక్తం చేశాయి.

ఇటీవలి సంవత్సరాల్లో కొన్ని రాష్ట్రాల్లో "బుల్డోజర్ న్యాయం" అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అల్లర్ల తర్వాత నిందితుల ఇళ్లు కూల్చివేయడం జరిగింది. ప్రభుత్వం దీనిని చట్టబద్ధ చర్యగా పేర్కొన్నప్పటికీ, పౌరహక్కుల వాదులు ఇది సమూహపరమైన శిక్షలా మారుతోందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఇలాంటి చర్యలు చట్టపరమైన విధానాలను అనుసరించాల్సిందేనని స్పష్టం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇళ్లు, దుకాణాలు కూల్చివేతకు గురైన వారిలో మైనార్టీలు అధికంగా ఉన్నారని మీడియా నివేదికలు సూచించాయి.

ఆర్థిక, సామాజిక సంక్షేమ రంగాల్లోనూ వెనుకబాటు స్పష్టంగా కనిపిస్తుంది. సచ్చర్ కమిటీ నివేదిక (2006) ముస్లింల సామాజిక–ఆర్థిక స్థితిపై స్పష్టమైన దృష్టాంతం ఇచ్చింది. ఆ తరువాత పరిస్థితులు ఎంత మెరుగుపడ్డాయనే అంశంపై వివాదం కొనసాగుతోంది. విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకు రుణాల ప్రాప్తి వంటి అంశాల్లో మైనార్టీల ప్రాతినిధ్యం ఇంకా తక్కువగానే ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మైనార్టీ సంక్షేమ పథకాల బడ్జెట్ కేటాయింపులు కొన్ని సంవత్సరాల్లో తగ్గినట్లు కేంద్ర బడ్జెట్ విశ్లేషణలు చూపించాయి.

సాంస్కృతిక రంగంలో కూడా చర్చనీయాంశాలు పెరిగాయి. కొన్ని రాష్ట్రాల్లో పాఠ్యపుస్తకాల మార్పులు జరిగాయి. మొఘల్ చరిత్రకు సంబంధించిన అధ్యాయాలు తగ్గించబడినట్లు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్టి) పాఠ్యాంశ మార్పులపై విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం దీనిని "రేషనలైజేషన్"గా వివరించినా, విమర్శకులు ఇది చరిత్రను ఏకపక్షంగా మలచే ప్రయత్నమని అంటున్నారు. చరిత్రను తొలగించడం కేవలం అకాడమిక్ సమస్య కాదు; అది ఒక సమాజం సాంస్కృతిక గుర్తింపును ప్రశ్నించడమే.

సోషల్ మీడియా యుగంలో అసత్య ప్రచారం వేగంగా వ్యాపిస్తోంది. ముస్లింలపై "లవ్ జిహాద్", "ల్యాండ్ జిహాద్" వంటి పదాలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ఫ్యాక్ట్ చెకింగ్ సంస్థలైన ఆల్ట్ న్యూస్ వంటి వేదికలు అనేక ఫేక్ న్యూస్ ఉదాహరణలను బయటపెట్టాయి. అయినప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో ద్వేష ప్రసారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇది సామాజిక విభజనను మరింత లోతుగా చేస్తోంది.

మహిళలపై మతపరమైన దాడుల ఆరోపణలు కూడా వినిపించాయి. కొన్ని కేసుల్లో మతపరమైన గుర్తింపు ఆధారంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. అయితే ప్రతి ఘటనను సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయం జరిగేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ఒక సంఘటనను మొత్తం సమాజంపై ముద్ర వేయడానికి ఉపయోగించడం కూడా సముచితం కాదు.

ఓటర్ కార్డు, రేషన్ కార్డు వంటి ప్రాథమిక పౌరహక్కుల విషయంలో వ్యవస్థపరమైన నిరాకరణలపై విస్తృత స్థాయిలో నిర్ధారిత గణాంకాలు తక్కువగానే ఉన్నా, స్థానిక స్థాయిలో వివక్ష ఆరోపణలు వినిపించాయి. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) 2019 అమలుపై జరిగిన చర్చలు మైనార్టీలలో భయాందోళనలు కలిగించాయి. ప్రభుత్వం ఇది శరణార్థుల రక్షణకోసమేనని చెప్పినప్పటికీ, విమర్శకులు ఇది మతాధారిత పౌరసత్వానికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ సమస్త పరిణామాల మధ్య ప్రధాన ప్రశ్న ఇదే: రాజ్యాంగ నైతికతను సామాజిక ప్రవర్తనలో ఎలా ప్రతిష్టించాలి? డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ సభలో చెప్పినట్లుగా, రాజకీయ సమానత్వం సామాజిక, ఆర్థిక సమానత్వంతో బలపడాలి. మైనార్టీల భద్రత, గౌరవం కేవలం చట్టపరమైన రక్షణతోనే కాదు; సామాజిక అవగాహనతో, పరస్పర గౌరవంతో సాధ్యమవుతుంది.

భారతదేశం బహుళత్వం మీద నిర్మితమైన దేశం. ఇక్కడి బలం వైవిధ్యం. మైనార్టీలను రెండవ శ్రేణి పౌరులుగా చూడాలనే భావజాలం రాజ్యాంగానికి వ్యతిరేకం. ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, పౌర సమాజం కలిసి పనిచేసి చట్టపరమైన చర్యలు పారదర్శకంగా అమలు చేయాలి. హింసా సంఘటనలపై వేగవంతమైన దర్యాప్తు, నిష్పక్షపాత న్యాయం, ద్వేష ప్రసారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో సమాజంలో పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే సంభాషణలు అవసరం.

ఉజ్జల్ భుయన్ ప్రస్తావించిన సంఘటన ఒక హెచ్చరిక. రాజ్యాంగం కాగితంపై ఉన్న విలువలు ప్రజల మనసుల్లో స్థిరపడకపోతే, ప్రజాస్వామ్యం బలహీనమవుతుంది. సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే మూల విలువలను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత. మైనార్టీల భద్రతను రక్షించడం కేవలం వారి హక్కు కాదు; అది భారత ప్రజాస్వామ్య గౌరవాన్ని కాపాడే పరీక్ష.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## మంత్రాంగం

ఒక వైపు తుపాను
ఒకవైపు అంతర్ఘర్షణ
ఒక వైపు ప్రజారక్షణ
నాల్గోవైపు కుర్చీ బలోపేతం
ఇది పాలన యంత్రాంగం
ముఖ్య అధిపతి చందరంగం...
బుద్ధుడి మౌనం
అశోక చక్రం నిశ్చలత
సామాన్యుడి గుండె నిబ్బరం
చలన శక్తి గా మారితే
ఓ కొత్త కేతం
ఓ కొత్త చేతన...
యంత్రాంగం మారుతుంది
ప్రజా పాలన వస్తుంది
నిజంగానే నియంతృత్వం
పలాయన మంత్రం పఠిస్తుందా?

రేడియమ్
9291527757




## డా. విశారదన్ మహారాజ్ పోరాటంతో
# విశ్వ వ్యాప్తమైన కుమ్మెర సంఘటన

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత సమకాలిన రాజకీయ అంశాలలో గత వారం నుండి ప్రజల జీవితాల్లో అత్యంత చర్చల్లో ఉన్న టాప్ సెన్సేషన్ అంశం ఏంటి అంటే నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామ సంఘటన. ఇక విషయంలోకి వెళ్తే నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర మల్లన్న గట్టు జాతరలో 18.02.2026 న ఆ గ్రామం లోని రజక(చాకలి) గణేష్ కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన సర్పంచ్ తుకారం రెడ్డి అయిన బంధు వర్గానికి మధ్య భౌతిక దాడులతో ఘర్షణ జరిగింది. తదనంతరం ఆ సమస్య నేడు తెలంగాణ రాష్ట్రాన్ని దాటి తెలుగు రాష్ట్రాల్లో ప్రజలలో అత్యంత చర్చనీయా అంశంగా ఉంటూ దేశవ్యాప్తంగా విశ్వవిప్తం అవ్వడం గమనార్హం. అయితే కుమ్మెర గ్రామంలో మల్లన్న గట్టు జాతరలో అదే గ్రామానికి చెందిన రజక కులానికి చెందిన చంద్రకళ(చాకలి కర్రెమ్మ) ఆమె బావ కోడలు మౌనిక ఇంకా వారి కుటుంబ స్త్రీలు జాతరలో భాగంగా దేవుడిని దర్శించుకునే క్రమంలో భాగంగా అక్కడ ఉన్న జాతర నిర్వాహకులైన రెడ్డి కులస్తులు 100 రూపాయలు తమకు ఇచ్చి దేవుడి దర్శనం చేసుకోవాలని ఆదేశించగా రజక కుల స్త్రీలు రిసిప్ట్ ఇవ్వకుండా 100 రూపాయలు ఇవ్వమని, ఎందుకు మీరు రిసిప్ట్ ఇవ్వకుండా డబ్బులని అడుగుతున్నారని వ్యతిరేకించగా ఒక తక్కువ కులమైన రజక కుల మహిళలు అగ్రకుల రెడ్లని ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేక మహిళలను అనేక రకమైన తప్పుడు బూతు పదలతో దుర్భాషలాడి వారి వస్త్రాలు చింపి, భౌతిక దాడి చేయడం గమనార్హం.




అయితే దేవదయ శాఖ అనుమతి లేకుండా రిసిప్ట్ పెట్టకుండా భక్తుల నుండి డబ్బు వసూలు చేస్తూ నిర్వాహకులైన అగ్రకుల రెడ్లు వేల, లక్షల రూపాయలు తమ స్వలాభం కోసం అర్జిస్తున్నారని స్థానిక భక్తులు చెప్తున్నారు. ఇక తదనంతరం ఆ బాధితులైన రజక స్త్రీలు గుట్టపై జరిగిన సంఘటనని చంద్రకళ బావ కొడుకు కొడుకు అయిన గణేష్ కి చెప్పుకోగా అతను మేము తక్కువ కులస్తులమైన రజకులం కాబట్టి మా ఇంటి మహిళలని అగ్రకుల రెడ్లు బూతు పదాలతో తిట్టి కొట్టారు కాబట్టి అదే బూతు పదాలతో అగ్రకుల రెడ్డి స్త్రీలని రజకులుగా తాము చేస్తే మీరు అంగీకరిస్తార అని మెసేజ్ ని తమ గ్రామ వాట్సప్ గ్రూపులో పెట్టడంతో, రజక కుల వ్యక్తులు అగ్రకుల రెడ్లకు వ్యతిరేకంగా మాట్లాడతార అని రజక కులానికి చెందిన గణేష్ ని అక్కడ ఉన్న గుడి దగ్గర కొబ్బరికాయలు వేసే స్టోరేజ్ రూములో అక్రమంగా నిర్బంధించి దాదాపుగా పది మందిపైగా అగ్రకుల రెడ్లు గణేష్ ని ఒక్కడిగా చేసి భౌతిక దాడి చేయగ అందులో గ్రామ సర్పంచ్ అయినా తుకారం రెడ్డి వారి బంధు వర్గం ఉండడం గమనర్హం. అయితే రజక కులానికి చెందిన గణేష్ మాదిగ కులానికి చెందిన మౌనిక అనే మహిళని తమ ఇరు కుటుంబాల అంగీకారంతో వివాహం చేసుకోగా తాజాగా జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో నూతన సర్పంచ్ అయిన తుకారం రెడ్డికి ఈ రజక కుటుంబం ఓటు వేయలేదని వాళ్ళ కులాంతర వివాహం చేసుకోవడం, గుడిలో వాళ్ళు చేసిన అన్యాయాన్ని ప్రశ్నించడంతో జీర్ణించుకోలేకపోయి ఇలా దుర్బుద్ధితో అగ్రకుల సర్పంచ్ అయినా తుకారాం రెడ్డి అతని బంధు వర్గం రజక కులానికి చెందిన గణేష్ మౌనిక దంపతులపై భౌతిక దాడి చేయడం గమనార్హం. ఇట్టి విషయంలో రజక కులానికి చెందిన గణేష్ మౌనిక దంపతులు ఆ గ్రామ అగ్రకుల రెడ్ల సర్పంచ్ వర్గం వల్ల జరిగిన అన్యాయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి బాధితులు వెళ్ళగా, స్థానిక పోలీస్ అధికారులు బాధితుల వినతి పత్ర ఫిర్యాదును స్వీకరించకపోగా బాధితులపైనే కేసు పెట్టడం అగ్రకుల సర్పంచ్ ప్రభావం శక్తివంతంగా ఉన్నదని చెప్పడానికి నిదర్శనం. ఎందుకంటే పది మంది అగ్రకుల రెడ్లు రజక కులానికి చెందిన గణేష్ ని కొబ్బరికాయల స్టోరేజ్ గదిలో నిర్బంధించి విపరీతంగా భౌతిక దాడి చేయగా గణేష్ తనని తాను రక్షించుకునే క్రమంలో భాగంగా, అక్కడ ఉన్న ఒక రెడ్డికి చెవి భాగంలో చిన్నపాటి గాయం కాగా ఈ సాకుతో రజక కులానికి చెందిన గణేష్ తమపై దాడి చేశాడని అగ్రకుల రెడ్లు పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం వాళ్ళ కుల దురహంకారానికి దోషులైన నిందితులైన రెడ్డి కులస్తుల రాజకీయ పలుకుబడి ఏ విధంగా తప్పుగా ఉపయోగిస్తున్నారో చెప్పడానికి నిదర్శనం. అంతేకాకుండా స్థానిక సర్పంచ్ తూకారాం రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కుంచకుల రాజేష్ రెడ్డికి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కుటుంబ బంధుత్వాలు ఉన్నాయని బాధిత గణేష్ కుటుంబం తమను ఏమీ చేయలేరని సర్పంచ్ తుకారం రెడ్డి చెప్పడం అగ్రకుల రెడ్ల ఆధిపత్య కులాల దురహంకారానికి నిదర్శనం.

ఇకపోతే గణేష్ మౌనిక దంపతులు వారి పసి పాపకి తల్లి పాలు ఇచ్చే క్రమంలో భాగంగా పాప పాలు త్రాగకపోగా హాస్పిటల్ కి తీసుకెళ్తే వైద్య అధికారులు అప్పటికే పాప చనిపోయిందని చెప్పగా భౌతికంగా పసి పాపపై గాయాలు లేకపోయినా శరీర అంతర్భాగంలో బలమైన అనారోగ్యకర ఇబ్బందులను ఎదుర్కొని పసి పాప మరణించడం తల్లిదండ్రులకి తీరని లోటు, పైగా అగ్రకుల రెడ్లు బాధిత కుటుంబమైన గణేష్ మౌనికలపై కేసు పెట్టడం పోలీస్ విభాగం బాధితుల పట్ల లేకపోవడం బాధితులు నిరాశ్రయులయి దుఃఖసంద్రంలో ఉన్నారు. అలాంటి సందర్భంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మరియు ధర్మ సమాజ్ పార్టీ ఫౌండర్ అయిన డా. విశారదన్ మహారాజ్ ఈ సమాచారం తెలుసుకొని వెంటనే 21.02.2026 న సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 12 గంటల వరకు దాదాపు 8 గంటల పాటు నాగర్ కర్నూల్ పట్టణ కేంద్రంలో రోడ్డుపై ట్రాఫిక్ నిర్బంధం చేసి దాదాపు 500 మంది డిఎస్పి, జేఏసీ కార్యకర్తలతో నిరసన ధర్నా కార్యక్రమం బాధితులైన రజక కులానికి చెందిన గణేష్ మౌనిక కుటుంబం పక్షాన మహోన్నతమైన పోరాటం చేసి అగ్రకుల రెడ్ల చేత బాధితులైన గణేష్ దంపతులకు జరిగిన అన్యాయం రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా తెలిసేలా విశారదన్ మహారాజ్ చేసిన భారీ స్థాయి ఉద్యమం బాధితులకి సమాజానికి బలమైన నమ్మకాన్ని విశ్వాసాన్ని ఇచ్చింది. స్వయానా బాధితులే తమకు జరిగిన అన్యాయం మొదటగా భారీ పోరాటంతో ప్రపంచానికి మొత్తానికి తెలిసేలా విశారదన్ మహారాజ్ చేసిన పోరాటాన్ని బాధితులు అభినందిస్తూ తమకి న్యాయం జరుగుతుందని విశ్వసించారు. అయితే ఇంతగా దేశవ్యాప్తంగా చర్చనీయంగా అంశంగా ఉన్న కుమ్మెర గ్రామ సంఘటనపై రాష్ట్ర హోం మంత్రి, ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవ డం బాధితులకి న్యాయం చేస్తామని నిందితులను శిక్షిస్తామని చెప్పకపోవడం తో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేరుతో రెడ్ల ఆధిపత్యం నడుస్తున్నదని సమాజంలో చర్చనీయాంశంగా ఉన్నది. అందుకు సాక్ష్యంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే రాష్ట్రంలో దళితులపై, వెనుకబడిన సామాజిక వర్గాలపై, ఆదివాసులపై అగ్రకులాల చేత భౌతిక దాడులు మానభంగాలు జరుగుతున్న సంఘటనలు రోజురోజుకు పెరుగుతూ ఉండడం ఏ బాధిత కుటుంబాలకి కూడా సకాలంలో న్యాయం జరగకపోవడంతో రేవంత్ రెడ్డి పాలన పట్ల ప్రజలంతా కూడా విరక్తి చెందుతూ అత్యంత వ్యతిరేకతతో ఉన్నారని నిరూపణ అవుతుంది.

ఇకపోతే ఏ మత దేవుడు కూడా కుల,మత బేధాలతో ప్రజలు తమను తాము వేరు చేసుకోని ఒకరిపై ఒకరు భౌతిక దాడులు చేసుకోవాలని ఏ మత దేవుళ్ళు చెప్పకపోవడం అన్ని మతాలలో ఉన్న సారాంశం అయితే, నేడు హిందూ మతంలో అగ్ర కులాలకు మాత్రమే అన్ని రంగాల్లో అత్యంత ఉన్నత స్థానం అంటూ, 90% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలకు అన్ని రంగాల్లో వెనుక బాటుకి గురవుతుండడం హిందూమతంలో ఆధ్యాత్మిక విషయంలో దేవుడి దగ్గర అగ్రకులాల తో పాటు సమానంగా అణగారిన కులాలకి సమాన స్థానం లేకపోవడంతో ఇట్టి విషయాన్ని విశారదన్ మహారాజ్ అన్ని అగ్రకుల పార్టీలని, అగ్రకుల నాయకులకి అభిముఖంగా సింహంల గర్జిస్తూ ప్రశ్నిస్తున్నాడు. తాజాగా రజక కుల గణేష్ మౌనిక దంపతుల పక్షాన డిఎస్పి, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వేదికగా విశారదన్ మహారాజ్ నాగర్ కర్నూల్ పట్టణంలో చేస్తున్న ధర్నా కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు బాధిత కుటుంబానికి సంఘీభావ మద్దతు తెలపడానికి రావడంతో రామచందర్ రావు ముందే విశారదన్ మహారాజ్ బిజెపి మరియు ఇతర అగకుల పార్టీలు పరివర్తన చెంది ప్రజాస్వామీకరించుకొని గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అట్టడుగు కులాలకు ప్రముఖ స్థానం ఇవ్వకుంటే హిందూ మతం బలహీనమవుతున్నది ఒక్క అగ్రకుల నాయకుల వల్లనే అని పిలుపునిస్తూ, అట్టడుగు కులాలని ఇకనైనా అగ్రకుల నాయకులు హక్కున చేర్చుకొని కుల,మత, పార్టీ బేధాలు లేకుండా ప్రజలంతా స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో జీవించేలా అన్ని అగ్రకుల పార్టీ నాయకులు తమ విధి విధానాన్ని నిర్మించుకోవాలని విశారదన్ మహారాజ్ అన్ని అగ్రకుల పార్టీ నాయకులకి దిశా నిర్దేశం చేస్తున్నాడు. తప్ప, బాధితులకి న్యాయం చేయడానికి తమ నిబద్ధతని చాటుకోలేకపోతున్నారు. కానీ అంతిమంగా ఈ కుమ్మెర గ్రామ సంఘటనలో బాధితులైన గణేష్ మౌనిక దంపతులకు జరిగిన అన్యాయం విషయంలో ఒక్క విశారదన్ మహారాజ్ పోరాటం లేకుంటే అగ్రకుల రెడ్లు తమ రాజకీయ పలుకుబడికి ఈ వార్త సమాజానికి తెలిసేది కాదు. బాధితులకి న్యాయం జరగకపోగా అగ్రకుల రెడ్డి నాయకులు బాధితులని భౌతిక దాడులతో డబ్బుతో ఇతర భయభ్రాంతులతో లోబర్చుకొని ఈ అన్యాయం సమాజంలో తెలియకుండా అగ్రకుల రెడ్డి దోషులు నిందితులు జాగ్రత్త వహించును. కాబట్టి ఇక్కడ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పట్టి ఫౌండర్ విశారదన్ మహారాజ్ సాహసోపేత బలమైన ప్రజా ఉద్యమంతో కుమ్మెర గ్రామ సంఘటన దేశవ్యాప్తంగా విశ్వ వ్యాప్తం అయ్యేలా బలమైన వ్యూహాలతో ప్రజా ఉద్యమంతో సమాజంలో మహోన్నత చర్చనీయమైన అంశంగా ఉండేలా చేసిన విశారదన్ మహారాజ్ బలమైన నాయకత్వాన్ని సభ్య సమాజం అభినందిస్తున్నారు. ప్రజల కోసం చిత్తశుద్ధితో నిబద్ధత పోరాటం చేసే విశారదన్ మహారాజ్ లాంటి నాయకుల వెంట కుల,మత బేధాలు లేకుండా ఉండటం నేడు సమాజంలో అవసరత ఎంతైనా ఉన్నది. అప్పుడు మాత్రమే సంఘంలో మానవతా నైతిక విలువలకు భారత రాజ్యాంగ విలువలకు రక్షణ ఉంటూ ప్రజలు స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో సుఖ సంతోషాలతో జీవించగలరనే వాస్తవాన్ని మేధావులు విద్యావంతులు సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.



బి పుల్లెంల గణేష్
(సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)
9553041549

# మారాల్సిన అవగాహన

అవగాహన మారితే అధికారంలోకి వస్తారు. ప్రజల త్యాగాలకు తగిన గుర్తింపు, ప్రయోజనాలు చేకూర్చుతారు. ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమ కారులు మారితే దేశానికి రాజకీయాలకు ప్రజలకు ఒక మలుపు. ఒకనాటి అర్థ శాస్త్రం మారింది. ఇది సంక్షేమ అర్థ శాస్త్ర యుగం. డోనాల్డ్ ట్రంపుతో 35 ఏళ్ల ప్రపంచీకరణ యుగం ముగిసింది. మళ్లీ పరిశ్రమలను, జాతీయం చేసే దశ మొదలైంది. ఏక పార్టీ వ్యవస్థలు నియంతృత్వాలుగా మారాయి. అన్ని వర్గాలను కలుపుకు పోతూ జాతిని ఏక తాటిమీదనడిపే నాయకత్వం కావాలి.

### ఇండియాలో మావోయిజం పనికొస్తుందా?

మావోయిజం ఇండియాకు పనికి రాదు. 1950 నాటికే చైనా కన్నా ఇండియా 50 ఏళ్ల ముందుంది. పెట్టుబడి దారీ విధానంలోకి మారాకే చైనా 1978 నుండి భారత్ ను అధిగమించింది. స్వార్థ రాజకీయ సంక్షోభాల వల్ల అన్ని పార్టీలు చీలి పోయి భారత అభివృద్ధి కుంటు పడింది. ప్రభుత్వ పరిశ్రమల మూత, ప్రభుత్వ విద్య వైద్యం తగ్గి ప్రయివేటు రంగం విస్తరించడంలో ప్రజలు పేదల వ్రతూ కొందరు సంపన్నులయ్యారు. అధిక సంపన్నులు ఓట్లకు డబ్బు ఎర వేసి అధికారంలోకి వచ్చి రాజకీయాలను వ్యాపారంగా, దోపిడి సంపాదనలకు రాజ మార్గంగా మార్చుకున్నారు. వీటిని అరికట్టాలి. బహుళ పార్టీ వ్యవస్థలో బౌద్ధసోషలిజం, ఫ్రెంచి సోషలిస్టులు, అంబేద్కర్ చెప్పిన సోషలిజం సాధించాలి. మావోయిజం బాగా వెనకబడిన సిద్ధాంతం. అధి భారత దేశ పరిణామాలకు పనికి రాదు.

### చైనా ఇండియా పరిణామాలు వేరు

1848 నుండి భారతీయ పరిణామాలు వేరు. దేశంలో ప్రత్యేకంగా కులవ్యవస్థ పునాదిపై ఏర్పడిన గ్రామీణస్వయం పోషక ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్నదనిమార్క్స్ కూడా గమనించాడు. చైనా రష్యా పరిణామాలు వేరు. స్వేచ్ఛ సమానత్వంతో కూడిన పరిపాలన, రాజకీయ వ్యవస్థను రష్యా చైనాలు మన నుంచే నేర్చుకోవాలి. అనుమానం వుంటే రష్యా చైనా రాజ్యాంగాలను భారత రాజ్యంగంతో తులనాత్మకంగా అధ్యయనం చేయాలి. ఆధినిక సైన్సు సాంకేతిక అభివృద్ధి కాలంలో రహస్య ఉద్యమాలు సాగవు. మావో లాంగ్ మార్చ్ తో లక్షలాది ప్రజల మరణం తరువాత అధికారంలోకి వచ్చారు. ఇండియాలో గాంధీ సత్యా అహింస మార్గంలో 1921 నుండే అధికారంలోకి వచ్చారు. 1935 నాటికే భారత్ లో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు జరుగుతూ ముఖ్య మంత్రులు మంత్రి వర్గాలు పని చేస్తూ వచ్చాయి . ఇలా చైనాకు మనకు పోలిక లేదు. కింది స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య వ్యవస్థ ఉన్నంత మాత్రాన మొత్తం పరిపాలన, నగరాలు పట్టణాలు, పరిశ్రమలు అలా లేవు. నూట యాభయి ఏళ్లుగా తెలంగాణ నుండి ప్రజలు బొంబాయి తదితర ప్రాంతాలకు వలసలు సాగించి నగరాలను నిర్మించారు. పారిశ్రామిక అభివృద్ధి సాధించారు.

### జ్యోతిరావు పూలే, ఎన్ యం లోఖండే.

సత్య శోధక సమాజ్ తరపున యన్‌యం లోఖండే మహాత్మా జ్యోతిరావు పూలేల నాయకత్వంలో చికాగో కన్నా ముందే సమ్మెలు చేసి పని గంటలు తగ్గించుకొని, పని పరిస్థితులను మెరుగు పరుచుకున్నారు. బ్రిటిష్ రాజ్యంలో వలె నైజాం లో పరిశ్రమలు, విద్య వైద్య రంగాలు అభివృద్ధి చెందాయి. 1918 లో ఉస్మానియా యూనిర్సిటీ ప్రారంభమైంది. గ్రామాల్లో పీడన దోపిడి కొనసాగింది. కేవలం గ్రామాల పీడన దోపిడీ చూసి మావోయిజం ఇండియాలో పనికి వస్తుందనుకున్నారు. ఇండియాలో మావోయిజం పనికి రాదు అని విర్ధారించడానికి ఆ సిద్దాంతాన్ని అధ్యయనం చేయాలి. బల ప్రయోగంతో మనుషులు చని పోతారు గానీ సిద్ధాంతాలు మరణించవు. సిద్దాంతాలేవీ జీవితానికి మించినవి కావు. జీవితాల ప్రాతిపదికగా, చరిత్ర పరిణామాల ప్రాతి పదికగా మావోయిజాన్ని పరిశీలించి పనికి రాదని పూర్వ పక్షం చేయాలి. ఆ విధంగా పరిశీలిస్తే అనేక విషయాలు తేట తెల్లం అవుతాయి.

### మావోయిజం ఎలా రూపొందింది

మావోయిజం ఒక సైద్ధాంతిక సమస్య. ఒక చారిత్రక పరిణామాల పరిష్కారాల సమస్య. ఒక పరిపాలనా వ్యవస్థల నిర్మాణాల సమస్య. మానవ సంబంధాలు , సామాజిక పరిణామాల , వర్ణ కుల వర్గ లింగ, దేశీయ్యులు నగరాలు అభివృద్ధి చెందాయి. పరిణామాల పరిష్కారాల సమస్య. ఇది తుపాకుల సమస్య కాదు. కర్ర వున్నోడిదే బర్రె అనే వారి సమస్య కాదు. ఇది భూమి సమస్య. వనరుల సమస్య. వనరుల దోపిడీ సమస్య.
ఇది రాజకీయ సమస్య– పరిపాలన విధానాల సమస్య.




ఇది రాజకీయ సమస్య..రాజకీయంగా సైద్ధాంతికంగా పరిష్కరించాల్సిన సమస్య. వారు లేవ నెత్తిన, వారు ప్రకటించిన లక్ష్యాల సాధ్యా సాధ్యాల సమస్య. అది అమిత్ షా , మోడీల , భారత ప్రభుత్వ సాయుధ అణిచి వేతతో పోయేది కాదు. సైద్ధాంతిక అవగాహన మారాలి. మార్చాలి.

### బహుళ పార్టీ వ్యవస్థలో సోషలిజం

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అన్నీ చదివి సోషలిజానికి సంబంధించి వీలైనన్ని రాజ్యాంగంలో పొందు పరిచాడు. సామాజిక వర్గాల ప్రాతినిధ్యం రిజర్వేషన్లు మెజారిటీ అనుమతి ద్వారా పయనం, పరిపాలన, బహుళ పార్టీ వ్యవస్థలో సోషలిజం రాజ్యాంగ బద్దంగా సాధన. ఇది కమ్యూనిస్టులు చెప్పే సోషలిజం కాదు. ఇది బౌద్ధం ఆచరించిన సోషలిజం. బహుళ పార్టీ వ్యవస్థలో ప్రభుత్వ , ప్రైవేటు రంగాలు బండికి రెండు చక్రాల్లా పయనించే ఫ్రెంచి సోషలిస్టులు చెప్పిన సోషలిజం. భారత రాజ్యాంగం దీనికి కట్టుబడి వుంది. భారత రాజ్యాంగంలో బుద్ధిజం వుంది. అంబేద్కరిజం ఉంది. గాంధీయిజం ఉంది. నెహ్రూ ఇజం వుంది. ఫెడరలిజం వుంది. రాష్ట్రాలను దేశంగా కలిపి వుంచే యూనియన్ వుంది. ఐక్య రాజ్య సమితి పేర్కొన్న మానవ హక్కుల హ్యూమనిజం వుంది.

ఇజం అంటే ఒక సిద్ధాంతం. అనేక రంగాల అవగాహనను, ఆచరణ రీతులను తెలుపడానికి దాన్ని ఇజం అని పిలుస్తారు. గాంధీయిజం, అంబేద్కరిజం, సోషలిజం, మార్క్సిజం, కమ్యూనిజం, హ్యూమనిజం, బుద్దిజం, సనాతన వాదం, హిందూయిజం, హెగెలిజం, లెనిజం, స్టాలినిజం.. మొదలైనవి వాటి వాటి ప్రత్యేకతలను కలిగి వున్నాయి. అలా వాటిలో మావోయిజం ఒకటి.

### రాజ్యాంగాల పరిశీలన ఆవశ్యకత

భారత దేశానికి ఒక రాజ్యాంగం ఉంది. చైనా , రష్యా, అమెరికా యూరప్ దేశాలకు కూడా వారి రాజ్యాంగాలున్నాయి. చైనా రష్యా ఇండియా అమెరికా బ్రిటన్ రాజ్యాంగాలను అధ్యయనం చేయాలి. ఆయా చారిత్రక పరిణామాల్లో గడిచి వచ్చిన సంస్కృతి మానవ సంబంధాలు, యుద్ధాలు, రాజ్యాలు, వారి ప్రకృతి పరిసరాలు అనుసరించుకొని అవి రూపుదిద్దుకున్నాయి. వాటిని తులనాత్మక పరిశీలనకు గురి చేయాలి. ఈ పని దశాబ్దాలు గడిచినా కమ్యూనిస్టులు నక్సలైట్లు, మావోయిస్టులు చేయ లేదు. అసలు వాటిని వివరంగా విశ్లేషణాత్మకంగా చదివిన వారెందరు? . వీరంతా " ఏక పార్టీ వాదులు" . కనుక బహుళ పార్టీ వ్యవస్థలోని సోషలిస్టులకు తమకు గల వ్యత్యాసాలను, రాజ్యాంగాలను పరిశీలించడం అవసరం.

మేం అధికారంలోకి వచ్చాక అదే ఉద్యోగులను శిక్షణ ఇచ్చి నడిపిస్తాం అన్నాడు లెనిన్ రాజ్యం విప్లవం పుస్తకంలో! ఈ మాట సరిగ్గా అర్థం చేకున్న వారు విప్లవం చేస్తారా? లేక తమ చదువు ఉద్యోగం , వర్తమానంలో ఎదగడం గురించి, తమ రంగాల కృషికి ప్రాధాన్యత ఇస్తారా? కార్మిక వర్గం అధికారంలోకి వస్తుంది అని తమ దృక్పథం కార్మిక వర్గంగా మార్చుకుంటే వారంతా కార్మిక వర్గమే అని లెనిన్ కొత్త నిర్వచనం ఇచ్చాడు.

భారత దేశంలో, మానవ సమాజంలో మునుపెన్నడూ లేని ప్రతి మనిషికి ఒకే ఓటు ఒకే విలువ ఆచరణలో కొచ్చింది. చస్తే స్వర్గం వస్తే రాజ్యం అని చెప్పి కృష్ణుడు యుద్ధ తంత్రం నడిపాడు. చంపు , చావు అనేది ఆనాటి రాజ్య విధానాలు. ప్రజాస్వామ్యంలో ఓడినా చనిపోయేది లేదు. మళ్లా ప్రయత్నించి గెలిచే వ్యవస్థ వచ్చింది. చంపడం చావడం అనే యుద్ధరీతి రాజకీయాలు రాజరికాల కాలంను తెలుపుతాయి. మావోయిస్టులు ఆ దశలో వున్నారు.

ప్రతి మనిషికి ఒకే ఓటు, ఒకే సమాన గౌరవం సమాన విలువను గుర్తించని వాల్లు ప్రజలను మనుషులుగా చూస్తారా? లేక తమ సిద్ధాంతాలకు సాధనాలుగా చూస్తారా? ఆదివాసీ , అటవీ ప్రాంతాలను రక్షణ కవచాలుగా వుంటాయని మావోయిస్టులు సాధనాలుగా చూసారు. వారిని లక్ష్యంగా చూస్తే శంకర్ గుహ నియోగిలా సమగ్ర సమాజ వికాసం కోసం పని చేస్తారు. దానికి సాయుధ పోరాటాలతో పని లేదు. ప మైదాన ప్రాంతాల్లో 1977–84 లో చేసిన ప్రజా సంఘాల. నిర్మాణం వదిలేయడం పెద్ద పొరపాటు



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# జిల్లా సమగ్ర అభివృద్ధికి సమర్ధవంతంగా పని చేయాలి

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా అన్ని రంగాల్లో ముందుండేలా జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికార యంత్రాంగం సమర్ధవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్ గా శుక్రవారం ఐడిఓసి లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా ఆయా శాఖల అధికారులు నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పౌరులకు నిష్పక్షపాతంగా, పారదర్శకమైన సేవలందించాలన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపడాలంటే అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తమ పరిధిలోని పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో అన్ని శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేయబోయే పనుల సమగ్ర వివరాల



నివేదికను తయారు చేసి అందజేయాలన్నారు. జిల్లాలోని ఆయా శాఖల ఆర్థిక పరిస్థితుల వివరాలను కూడా అందజేయాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి ఆయా శాఖల ఉన్నతాధికారులు అడిగే ప్రతి సమాచారాన్ని నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో పంపించేందుకు సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులతో కఠినంగా వ్యవహరిస్తానన్నారు.

పీఎండిడికేవై (ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన) కు మన జిల్లా కూడా ఎంపిక కావడంతో ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఇందిరమ్మ గృహాలు, తదితర శాఖల పనితీరు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కు పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేశారు. పలువురు అధికారులు శాలువాతో సన్మానించారు. అనంతరం పలువురు మత పెద్దలు కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ (రెవిన్యూ), నర్సింగరావు (స్థానిక సంస్థలు), ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం సేకరణ కోసం ఏర్పాటు చేయండి

- జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రబీ సీజన్ సంబంధించి వరి ధాన్య సేకరణకు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేటులోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణకై సంబంధిత అధికారులతో కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రబీ 2025-26 వరి ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలోని 129 వరి ధాన్యం సేకరణ కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రతి వరి ధాన్యం సేకరణ కేంద్రాల్లో తూనికల సామాగ్రి, టార్పాలిన్లు, సంచులతో పాటుగా తేమ యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, జిల్లా సహకార అధికారి నాగార్జున, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



**మల్దకల్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం రైతుల కొరకు అమలు చేసే పథకాలను పొందేందుకు ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మల్దకల్ మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ తెలిపారు. మండలంలోని రైతులు వ్యవసాయ కార్యాలయంలో వారి పాస్ పుస్తకం,ఆధార్, మొబైల్ నంబర్ తో వచ్చి వారి వివరాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే ఆర్థిక సహాయంతో పాటు ఇతర పథకాలు వర్తించడానికి వీలుగా ఉంటుందని ఆయన తెలిపారు.ఇట్టి అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకొని ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

## నకిలీ సంస్థ పేరిట మ్యూల్ ఖాతాలు

- బ్యాంకు మేనేజర్ సహా నలుగురి అరెస్ట్

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** బినామి వ్యాపార సంస్థల పేర్లతో మ్యూల్ బ్యాంక్ ఖాతాలు తెరిచి సైబర్ మోసాలకు పాల్పడే వారికి సహకరిస్తున్న ఓ ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో జూబ్లీహిల్స్ మర్కంటైల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు చెందిన బ్రాంచ్ మేనేజర్, సేల్స్ మేనేజర్ కూడా ఉండడం తీవ్ర కలకలం రేపింది. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డిసిపి టి. సాయి మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... పహాడీ షరీఫ్‌కు చెందిన జవ్వాద్ ఖాద్రీ రిఫాయి, మహమ్మద్ నౌషాద్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలను సమకూర్చేందుకు పథకం పన్నారు. ఇందులో భాగంగా ఒక షట్టర్‌ను అద్దెకు తీసుకుని, 'స్టార్ అగ్రో ఇండస్ట్రీస్' పేరుతో నకిలీ అద్దె ఒప్పందాలు, తప్పుడు వ్యాపార పత్రాలను సృష్టించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా జూబ్లీహిల్స్ మర్కంటైల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేల్స్ మేనేజర్ పాముల ప్రణవరాజ్, బ్రాంచ్ మేనేజర్ శంకర్ రాథీ సహకారంతో కరెంట్ ఖాతా ప్రారంభించారని తెలిపారు. ఖాతా తెరిచిన వెంటనే దానికి సంబంధించిన ఏటిఎం కార్డు, చెక్ బుక్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలతోపాటు సిమ్ కార్డును కూడా సైబర్ మోసగాళ్లకు సమకూర్చడం జరిగిందన్నారు. దర్యాప్తులో భాగంగా అక్టోబర్



2025లో ఈ ఖాతా ద్వారా సుమారు రూ. 6.67 లక్షల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. విషయం తెలుసుకున్న నిందితులు పరారీలో ఉండగా ఫిబ్రవరి 26, 2026న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సైబర్ క్రైమ్స్ పోలీసు విచారణలో సదరు బ్యాంకు శాఖలోనే దాదాపు 30కి పైగా మ్యూల్ ఖాతాలు తెరిచినట్లు నిందితులు అంగీకరించారన్నారు. ఈ ముఠా వెనుక ఉన్న ఇతర సభ్యులను, బాధితుల వివరాల కోసం దర్యాప్తును కొనసాగిస్తున్నామని డిసిపి వివరించారు. డబ్బు కోసం బ్యాంక్ ఖాతాలు, కెవైసి పత్రాలను ఇతరులకు ఇవ్వడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. బ్యాంకు సిబ్బంది నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు లేదా షఎఎవతీషతీఱఎవ.స్త్రశీజ.ఱఅ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

## బుక్క వేణుగోపాల్‌ను ఆప్యాయంగా పలకరించిన సీఎం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** రాజకీయాల్లో పార్టీలు, జెండాలు, అజెండాలు వేరైనా వ్యక్తిగత అనుబంధాలు నిలకడగా ఉంటాయని మరోసారి నిరూపితమైంది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నార్సింగ్‌లో జరిగిన జస్టిస్ ఎం. లక్ష్మణ్ కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. కార్యక్రమం ముగించుకుని బయలుదేరుతున్న సమయంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు బొక్క వేణుగోపాల్ అక్కడ కనిపించడంతో, ముఖ్యమంత్రి స్వయంగా ఆయన వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి కరచాలనం చేశారు. ఇద్దరూ పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొక్క వేణుగోపాల్ మాట్లాడుతూ రాజకీయ భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ పాత పరిచయాన్ని మరువకుండా స్వయంగా వచ్చి పలకరించడం తనకు మధుర జ్ఞాపకాలను తలపెట్టిందని పేర్కొన్నారు. ఈ సంఘటన అక్కడున్న నాయకులు, కార్యకర్తల దృష్టిని ఆకర్షించింది. రాజకీయాల్లో విభేదాలు సహజమైనవే అయినప్పటికీ వ్యక్తిగత సంబంధాలు, పరస్పర గౌరవం కొనసాగుతూనే ఉంటాయని ఈ ఘటన స్పష్టం చేసింది.

## ఎస్సీ, ఎస్టీల కేసులలో అలసత్వం చేస్తే సహించం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీలపై తప్పుడు కేసులు నమోదు చేయడం తగదని ,ఎస్సీ, ఎస్టీల కేసులలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సమీక్ష సమావేశంలో చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ ,ఎస్టీలపై దాడులు జరిగితే అరికట్టలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పై అలసత్వం వద్దని సూచించారు. నర్సాపూర్ పెద్ద చింతకుంట గిరిజనులపై జరిగిన దాడి కేసు విచారణలో ఐవోలు మార్చాలని చైర్మన్ ఎస్పీని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనానికి మార్చి 26 వరకు స్థలానికి కేటాయించి భవన నిర్మాణం ప్రారంభించాలని ఆర్డీవోను ఆదేశించారు. హవేలి ఘనపూర్ తదితర గ్రామాలలో నెలకొన్న భూమి సమస్యలను 45 రోజులలో పరిష్కరించాలని ఆదేశించారు. నరసాపూర్ మండలం మమతాబాద్ లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి వసతులపై నాణ్యమైన భోజనం పై ఎస్సీ ,ఎస్టీ కమిషన్కు నివేదిక సమర్పించాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారము అందించడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు ప్రారంభం కింద డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించాలని చైర్మన్ ఆదేశించారు. హత్య అత్యాచారం



సాంఘిక విష్కరణ తదితర కేసులలో బాధితులకు పక్క ఇండ్లను అందించాలని కోరారు. చరిత్రలోనే రాష్ట్రా ఎస్సీ ,ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో సైబరాబాద్ మల్కాజ్గిరి హైదరాబాద్ జిల్లాలలో ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్ రూమ్లను పంపిణీ చేశామని తెలిపారు. వివిధ శాఖ లు అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. మెదక్ పట్టణంలోని సి కార్పొరేషన్ నూతన దుకాణాల సముదాయాలను తక్షణమే నిర్మాణాలను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ, ట్రైన్ అధికారి సింధు, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తదిత దళిత సంఘాల నాయకులు డివిఎంసి సభ్యులు పాల్గొన్నారు.

## గురుమూర్తి నగర్ ఉమ్మడి స్థలాన్ని బస్తి దవాఖానకు కేటాయించాలి




**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గిరి నగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్ లో గ్రామపంచాయతీ కాలం నుండి ఉన్న మరుగుదొడ్ల స్థలంపై కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో పట్టా తీసుకోడాన్ని నిరసిస్తూ స్థానిక రాజకీయ నాయకులు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నించిన వ్యక్తులపై చట్టరీత్యాచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇట్టి స్థలంలో బస్తి దవాఖానను నిర్మించి అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వారు తీర్మానం చేసి ఆమోదించినట్లు తెలిపారు.ఇట్టి విషయాన్ని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ నాయకులు నరసయ్య, హరినాథరావు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బి శివకుమార్, ఉస్మాన్, శ్రీను, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం నర్సింగరావు, బిజెపి నాయకులు శివరాజ్, సందీప్, చందు, టిఆర్ఎస్ నాయకులు రాణి, క్రాంతి యాదవ్ స్థానిక బస్తి సీనియర్ నాయకులు అర్జున్, బాలరాజు, అనిల్ గౌడ్, స్థానిక నాయకులు ,బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి




**అంబర్‌పేట్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీర కోనే ఆధ్వర్యంలో అనంత కళాశాలలో విద్యార్థులకు 'అరైవ్ అలైవ్' పేరుతో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో రహదారి భద్రతపై చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అదనపు డీజీపీ రాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనదారులు తమ భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా యువత ఓవర్ స్పీడ్, ఓవర్ టేక్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా మానుకోవాలని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు రహదారులపై బాధ్యతాయుతంగా వ్యవహరించి, హెల్మెట్ మరియు సీటు బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతాం

**హయత్‌నగర్ నగర్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో హయత్ నగర్ మండల విద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో, ఎంఈవో కార్యాలయం లోని సిబ్బందికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్ లు మాట్లాడుతూ హయత్ నగర్ మండల పరిధిలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేసి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై




తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ప్రాంగణం లోనే పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, బ్యాగులు, విక్రయిస్తూ వాటిని అధిక ధరలకు కొనాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారని వారు ఆరోపించారు. స్కూళ్లలో ఇలాంటి అమ్మకాలను నిషేధిస్తూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మండలంలో అవి ఏమాత్రం అమలు కాకపోవడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకుని, పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్స్ విక్రయిస్తున్న యాజమాన్యాలపై, అనుమతి లేకుండా ఫీజులు పెంచుతున్న పాఠశాలలపై చట్టపరమైన, కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రానున్న విద్యా సంవత్సరానికి ముందే మండలం లోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించి, ఫీజు నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత పూర్తిగా విద్యాశాఖదే అని వారు స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం చేయని పక్షంలో.. ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హయత్ నగర్ మండల ఉపాధ్యక్షులు ఈనపల్లి ఉపేందర్, సంయుక్త కార్యదర్శి జూనోతల భాను ప్రకాష్, నాయకులు బోగడి రవితేజ పాల్గొన్నారు.

## అధునాతన సాంకేతికతతో రైతులకు మేలు

**జడ్చర్ల, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** రైతుల మేలు కోసం మహీంద్రా సంస్థ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని జడ్చర్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ కోనేటి పుష్పలత పేర్కొన్నారు. జడ్చర్ల మండల కేంద్రంలోని శ్రీ జయ రామ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత ముఖ్య అతిథిగా హాజరై



సరికొత్త ఎ1 హెచ్ 1 సిరీస్ 575 డిఐ ట్రాక్టర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక కౌన్సిలర్లు, జడ్చర్ల బ్రాంచ్ మేనేజర్ పున్న కృష్ణం రాజు, మహీంద్రా జోనల్ హెడ్ సంతోష్ కుమార్, సమీప గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ కృష్ణం రాజు, జోనల్ హెడ్ సంతోష్ కుమార్ లు కొత్త మోడల్ 575 డిఐ విశిష్టతలను వివరిస్తూ ఈ ట్రాక్టర్ శక్తివంతమైన 4 సిలిండర్ల ఇంజిన్‌తో 36 నుండి 50 హెచ్‌పి రేంజ్‌లో లభిస్తుందని, మోడల్‌ను బట్టి 207 ఎన్ఎం (ఎక్స్.పి ప్లస్), 178.6 ఎన్ఎం (ఎస్పి ప్లస్) గరిష్ట టార్క్‌ను అందిస్తుందని, దీనివల్ల కఠినమైన పొలం పనులను కూడా తక్కువ ఇంధనంతో సులువుగా పూర్తి చేయవచ్చని, ఆధునిక వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందించినట్లు వెల్లడించారు. సాంకేతిక పరంగా ఈ ట్రాక్టర్‌లో 1500 నుండి 1600 కిలోల బరువును ఎత్తగల హైడ్రాలిక్ సామర్థ్యం, 8 ఫార్వర్డ్ మరియు 2 రివర్స్ గేర్లతో కూడిన పార్షియల్ కాన్స్టెంట్ మెష్ ట్రాన్స్‌మిషన్, 42 హెచ్‌పి వరకు పి.టి.ఓ పవర్ వంటి అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయని, ప్రస్తుతం ఈ ట్రాక్టర్లు 575 డిఐ ఎక్స్.పి ప్లస్, ఎస్పి ప్లస్,575 యువ టెక్ ప్లస్ వేరియంట్లలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. మండల పరిధిలోని రైతులు కొత్త ట్రాక్టర్ పనితీరును, సాంకేతికతను ఆసక్తిగా పరిశీలించారు. రైతులకు మేలైన యంత్రాలను మెరుగైన సేవలను అందించడమే తమ లక్ష్యమని షోరూమ్ నిర్వాహకులు తెలిపారు. కౌన్సిలర్లు కుమ్మరి రాజు, జ్యోతి, బుక్క మహేష్, ఉమాశంకర్ గౌడ్, నాయకులు నర్సింలు, కృష్ణారెడ్డి, కొండల్, రాఘువేందర్, రఘు, అశోక్, మల్లేష్, తుంగ రఘు, శాంగంటి రఘు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ వార్డులను అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవాలి

- ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి

**మొయినాబాద్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలంగాణ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ అనిత రెడ్డి లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని జిల్లాలోని మైనా బాద్ మున్సిపాలిటీ నూతనంగా ఏర్పడడంతో గెలుపొందిన వార్డు సభ్యులకు చైర్మన్ వైస్ చైర్మన్ లకు సన్మాన సభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దుబ్బ సోనియా దర్శన్ గా గెల్పొందడంతో పాటు వైస్ చైర్మన్ గా చిలుకూరు గరువు రాజు గెలుపొందారు మిగతా 24 మంది వార్డు సభ్యులను కలిపి సన్మాన సభను ఏర్పాటు చేయగా సభ అధ్యక్షులుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని కొనసాగించారు ఈ కార్యక్రమానికి ముఖ్య



అతిథులుగా విచ్చేసిన పట్నం మహేందర్ రెడ్డి మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ అనిత రెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ జండా ఎగరవేయడం జరిగిందని పేర్కొన్నారు గ్రామాల మున్సిపాలిటీలలోని వార్డులను అభివృద్ధి చేయవలసిన బాధ్యత మీ అందరిని తెలిపారు ప్రభుత్వం ద్వారా మున్సిపాలిటీకి ఇప్పటికే 15 కోట్లు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు దశలవారీగా అభివృద్ధి చేసుకునేందుకు మైనాబాబాద్ నూతన మున్సిపాలిటీకి నిధులు ఇచ్చేందుకు శాసశక్తులకు చేస్తానని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చలనరసింహారెడ్డి తెలిపారు పార్టీలకతీతంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని పేర్కొన్నారు అనంతరం చైర్మన్ సోనియా దర్శన్ పై చైర్మన్ గరుగురాజులను సన్మానించిన అనంతరం వార్డు సభ్యులను సాల్వలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో దొంతు రామ్మోహన్ రెడ్డి భీమ్ భరత్ గౌరి సతీష్ చంద్ర రెడ్డి దర్శన్ గడ్డం వెంకట్ రెడ్డి. మున్సిపల్ కౌన్సిలర్లు ఆయా పార్టీల నాయకులు అభిమాను లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 ఫిబ్రవరి 2026

# వందశాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయండి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి
- కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** పదవ తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జిల్లాలోని కంది మండలం,కాశీపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (మైనార్టీ)ను, అంగన్‌వాడీ కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా పాఠశాలలో తరగతి గదుల పరిశుభ్రతను పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన నాణ్యత ను పరిశీలించారు.మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని స్పష్టంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్ ప్రావీణ్య, పరీక్షలు దగ్గర పడుతున్నందున సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని, క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు.స్పెషల్ క్లాసులు జరుగుతున్నాయా, సిలబస్ పూర్తి అయ్యిందా అనే అంశాలపై విద్యార్థుల నుండి వివరాలు తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని కృషితో ముందుకు సాగితే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని ప్రోత్సహించారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ ప్రతి రోజు శుభ్రత తప్పనిసరిగా ఉండాల నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి మౌలిక వసతులు, పిల్లలకు అందిస్తున్న ఆహారం, మెనూ అమలు పరిస్థితులను పరిశీలించారు. చిన్నారులకు పంపిణీ చేసే షూలు అందరికీ చేరాయా? అనే వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆయా గ్రామాలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించారు. గ్రామంలో మంజూరైన ఇండ్ల సంఖ్య, నిర్మాణ దశలు, లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ పరిస్థితులపై ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లకు ఫోటో కాప్చరింగ్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సరైన యాజమాన్య పద్ధతులతో అధిక పంట దిగుబడి



**హత్నూర, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** పంట సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక పంట దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. మండలంలోని కాసాల రైతు వేదికలో శుక్రవారం ఆత్మ సౌజన్యంతో పంట సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు.భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వినియోగం,నానో ఎరువుల వినియోగం,వరి సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై వివరించారు.భూసార పరీక్షల ద్వారా మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాల స్థితిని తెలుసుకోవచ్చన్నారు. తద్వార ఆ నేలలో ఏ రకమైన పంటలు సాగు చేయాలి. ఎరువులను ఏ మోతాదులో వినియోగించాలి అనే విషయాలు తెలుస్తాయన్నారు.ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఇఫ్కో కంపెనీ ఉత్పత్తులైన నానో యూరియా, డిఎపి లాంటి ఎరువుల వినియోగం అధికంగా ఉందన్వినారు.నానో యూరియా స్ప్రే చేయడం వల్ల నత్రజని వినియోగ సామర్థ్యం పెరుగుతుందన్నారు. 500మి.లీ నానో యూరియా 45కిలోల యూరియా సంచికి సమానమన్నారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని,నారు విత్తే ముందు విత్తన శుద్ధి చేయాలన్నారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు,విస్తరణ అధికారులు మనీషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థలపై విస్తృత అవగాహన కల్పించి, నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో మాదకద్రవ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వం డ్రగ్స్ పై సీరియస్ గా ఉందని మన జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా రైతు తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు రుజువు అయితే అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పరంగా లబ్ది చేకూరే సంక్షేమ పథకాలన్నీ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో యాశీటీ డ్రగ్ కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మన జిల్లాలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ,జూనియర్ జూనియర్ కళాశాలలోనే కాకుండా పాఠశాలలలోనూ మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. జిల్లాలో గంజాయి సరఫరాపై పోలీసు ,ఎక్సైజ్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులే కాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నిషేధాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో జరిగే ప్రతీ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల నిషేధ అంశాన్ని ఒక సబ్జెక్టు గా పెట్టుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్, డీపీ ఆర్ వో రషీద్, సీఐ శివశంకర్, వైద్య శాఖ అధికారి బిక్షపతి, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారిని జయసుధ, ఎక్సైజ్ సి.ఐ. ఎస్.ఐ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థలను నిర్వీర్యం చేయడమే ప్రభుత్వ లక్ష్యమా..?

- మెడికల్ కళాశాల ఆవరణలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మించడం అవివేకం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** విద్యా సంస్థలను నిర్వీర్యం చేయడమే, ప్రభుత్వ లక్ష్యమా అని,మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.శుక్రవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, స్థానిక వనపర్తి మెడికల్ కళాశాలను సందర్శించి, విద్యార్థులను కలసి కళాశాలలో నెలకొన్న సమస్యలను,అడిగి తెలుసుకొన్నారు.మెడికల్ కళాశాల ఆవరణలో యంగ్ ఇండియా స్కూల్ కోసం 8ఎకరాల స్థలం కేటాయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రములో అత్యంత ఉన్నత ప్రమాణాలతో, మెడికల్ కళాశాల ఉండాలని భావితరాల విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం, లేకుండా ఉండాలని మెడికల్,ప్యారా మెడికల్,హాస్టల్,రీసర్చ్ సెంటర్,వసతిని దృష్టిలో ఉంచుకొని 50ఎకరాలతో సువిశాలమైన మెడికల్ కళాశాల ఆవరణ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో నర్సింగ్ కాలేజ్ పూర్తి అయి, అందులో ప్రస్తుతం మెడికల్ కళాశాల కొనసాగిస్తున్నారని, అదేవిధంగా మెడికల్ కళాశాల అన్ని హంగులతో రూపుదిద్దుకుంటుంది అని అన్నారు. ప్రభుత్వం అనాలోచిత చర్యలతో మెడికల్ కళాశాల ఆవరణలో యంగ్ ఇండియా స్కూల్ కోసం 8ఎకరాలు కేటాయించడం అనైతిక చర్య అని దుయ్యబట్టారు.రాబోవు రోజుల్లో మెడికల్ కళాశాలకు అనేక మౌలిక వసతుల కోసం స్థలం అవసరమని, ప్రభుత్వం పునః పరిశీలించి యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలమును ఉపసంహరించుకోవాలని అన్నారు.ప్రభుత్వ స్థలాలు అనేకం ఉన్నాయని, వాటిలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మించాలని, మాకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు.సంప్రదింపులు,చర్చలు లేకుండా ఏకపక్షంగా కేటాయించడం పద్ధతి కాదని అన్నారు.మెడికల్ కాలేజీల్లో, వెలువడే వ్యర్థాలు డిస్పోజల్ మేనేజ్మెంట్ ,ద్వారా దూరం చేయడం జరుగుతుందని, అటువంటి ఆవరణలో స్కూల్ ఏర్పాటు చేయడం విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం అడట మేననని అన్నారు.

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి నిరంజన్ రెడ్డి లేఖ

దామోదర రాజనర్సింహ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, మెడికల్ కళాశాల ఆవరణలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ, ఇక్కడి పరిస్థితులను వివరిస్తూ, లేఖా వ్రాసి స్వయంగా ఫోన్ చేసి పునఃపరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు.సానుకూలంగా స్పందించిన మంత్రి, సమస్యను పరిష్కరిస్తామని, హామీ ఇవ్వడం జరిగింది.ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకుంటే, నా సొంత స్థలం ఇవ్వడానికి సిద్ధమని,



మెడికల్ కళాశాల ఆవరణలో ఎటువంటి ఇతర నిర్మాణాలకు పూనుకోవద్దని, ఇది భవిష్యత్ తరాలకు,ప్రజాహితానికి ముప్పు వాటిల్లుతుందని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమములో మెడికల్ కళాశాల విద్యార్థులు, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,గంధం.బాలపీర్,గంధం.పరంజ్యోతి, ధర్మా నాయక్,కౌన్సిలర్స్ మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్,ప్రేమ్ నాథ్ రెడ్డి,హరిబాబు,బండారు.కృష్ణ,దేవర్ల.నరసింహ,రవి ప్రకాష్ రెడ్డి,బాబు నాయక్, డాక్టర్.డ్యానియల్,హేమంత్ ముదిరాజ్, వెంకట్ సాగర్,జోహెబ్ హుస్సేన్, చిట్యాల.రాము, మంద.రాము, బొబ్బిలి.ప్రేమ్ కుమార్, పెద్ద ముక్కల.రవి,ముద్దు సార్,తేజా రెడ్డి, మర్రికుంట.శ్రీను,కురుమూర్తి,తదితరులు ఉన్నారు.

## బహిరంగ ర్యాలీని విజయవంతం చేయాలి

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** సనాతన ధర్మ పరిరక్షణకు హిందూ ధర్మాన్ని కాపాడేందుకు శనివారం నాడు సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే బహిరంగ ర్యాలీకి అన్ని వర్గాల ప్రజలు ధార్మిక సంస్థలు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని సనాతన ధర్మ పరిరక్షణ హిందూ ఫౌండర్ ప్రెసిడెంట్ బీరవెల్లి చంద్రారెడ్డి గురూజీ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ధర్మ పరిరక్షణ కోసం చేపట్టే ర్యాలీని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలు సహకరించాలని అదే విధంగా ఒకటవ తేదీన జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్ లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి వివిధ ధార్మిక సంస్థలు హాజరవుతున్నారని వివరించారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని కోరారు రౌండ్ టేబుల్ సమావేశానికి స్వామీజీలు మఠాధిపతులు పీఠాధిపతులు సుమారు 70 మంది హాజరవుతున్నారని తెలిపారు.



## రైతులకు రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలి



**కొమురవెల్లి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రైతులకు రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి పంట నష్ట పరిహారం ఇవ్వాలంటూ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కోసం రైతులు మూడు నెలలుగా ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ ఎలక్షన్లు అయ్యేవరకు మభ్యపెట్టి ప్రస్తుతం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రైతాంగం అప్పులు తెచ్చి పంటలు సాగు చేసి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ములీగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా ఇటీవల అకాల వర్షాలతో మొక్కజొన్న, కూరగాయ తోటలు, ప్రొద్దుతిరుగుడు, జిల్లా వ్యాప్తంగా పంటలు నష్టపోయారని అధికారులు సర్వే నిర్వహించి నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలని వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను ఏకం చేసి జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తాడూరి రవీందర్, నాయకులు తేలు ఇస్తారు, నీల బిక్షపతి, తాడూరి మల్లేశం, నరేష్, ప్రశాంత్ బాబు, బక్కేల్లి బాలకిషన్ తాడూరి భరత్, కాగిత బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిఫెన్స్ డ్రైవింగ్ ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాలు నివారణే లక్ష్యంగా అర్రివే అలివె 2వ విడత కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు డిఫెన్స్ డ్రైవింగ్ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ వినీత్ రోడ్డు ప్రమాదాల నివారణలో డిఫెన్స్ డ్రైవింగ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సురక్షితమైన డ్రైవింగ్ అలవాట్లు అలవరుచుకోవడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, వేగ పరిమితులను అతిక్రమించకూడదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలి అని సూచించారు. సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, అప్రమత్తత కోల్పోతే ప్రాణాపాయం సంభవించవచ్చని పేర్కొన్నారు. ప్రతి వాహనదారులు తప్పకుండా వాహనాలకు సంబంధించిన పత్రాలు ఆర్సి, లైసెన్స్, పొల్యూషన్ తదితర పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రత్యేకంగా మెడికల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మీరు రేపటి వైద్యులు కాబట్టి సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలను కాపాడే బాధ్యత మీపై ఉంటుందని, అందుకే ముందుగా మీరు సురక్షితంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి సంవత్సరం అనేక మంది యువత ప్రాణాలు కోల్పోతున్నారని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని ఎస్పీ వివరించారు. కుటుంబంలో ఒక వ్యక్తి లేదా కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని మరియు ప్రమాదాలలో అంగవైకల్ ఏర్పడితే జీవితాంతం దుర్భరమైన జీవితం గడపవలసి వస్తుందని కావున ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ నిర్వహించాలని అవగాహన కల్పించారు. డిఫెన్స్ డ్రైవింగ్ అంటే ఇతరుల తప్పిదాలను కూడా ముందుగా ఊహించి జాగ్రత్తగా వాహనం నడపడం అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్, కళాశాల ప్రిన్సిపల్ కే.సంపత్ కుమార్ సింగ్, లెక్చరర్లు, ఎస్సై రాముడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలి

- విసిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ
- విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు
- లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలి
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, ఎన్‌బీడబ్ల్యూస్, మిస్సింగ్ కేసుల వివరాలను ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరగాలని, బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. అత్యాచార, పోక్సో కేసుల్లో నిర్ణీత గడువుల్లో దర్యాప్తు పూర్తి చేసి దోషులను కోర్టు ముందు నిలపాలని ఆదేశించారు. జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ రెండు గంటల పాటు వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికతో విని స్పందించాలని సూచించారు. క్యూఆర్టీలు జిల్లా వ్యాప్తంగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నాయని, ఇందుకు ఐజీ ప్రశంసలు వ్యక్తం చేశారని గుర్తు చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ప్రశంస పత్రాలతో ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు జర్జ్, రేణుక రెడ్డి, మహేష్, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి తదితరులు, జిల్లా ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి

- ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి

**హత్నూర, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి అన్నారు.మండలంలోని నవాబ్ పేట గ్రామంలో శుక్రవారం మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు.మహిళా సంఘాల నిర్వహణకు సమైక్య భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, మాజీ జడ్పిటిసి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ వావిలాల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి పుష్కర ఘాట్‌ల ప్రతిపాదనలను సిద్ధం చేయాలి

- పుష్కర ఘాట్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ములుగు బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి):** గోదావరి నది పుష్కర ఘాట్ ల ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏటూరు నాగారం,మంగపేట మండలాలలోని చుంచుపల్లి, మల్లూరు, పోదుమూరు, రామన్నగూడెం, ముళ్ళ కట్ట పుష్కర ఘాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 2027 లో నిర్వహించనున్న గోదావరి నది పుష్కరాల సందర్భంగా ములుగు జిల్లాలోని ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్ల నిర్మాణాలు, మరమ్మత్తు పనులు, భక్తుల కోసం ఏర్పాటు చేయవలసిన సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్ర ప్రతిపాదనలను సిద్ధం చేసి వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నదీ తీర ప్రాంతంలో పుష్కరాల సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యంగా ప్రతి ఘాట్ వద్ద భక్తులకు త్రాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు, రవాణా మార్గం, పార్కింగ్ స్థలాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు ఇతర సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి,తహసిల్దార్ రవీందర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సిబ్బందికి ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది నిరంతరం ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తుంటారని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా రక్తపోటు, షుగర్, హీమోగ్లోబిన్, బరువు, తదితర సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి వచ్చే నెలల్లో స్పెసలిస్ట్ వైద్యులచే మెగా వైద్య క్యాంపు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది ప్రతి 6 నెలలకు ఒకసారి తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పి సంకీర్త్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, టిజిఓ కార్యదర్శి సునీల్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ సంధాని, కార్యవర్గ సభ్యులు డా మాధుసూదన్, బాబూరావు, డా కుమారస్వామి, ఫణి కుమార్, డా వెంకన్న, సంతోష్, శ్రీనివాసరావు, రాధిక, స్వాతి టీజీఓ ప్రతినిధులు, టీఎన్జీవో అధ్యక్షులు బూరుగు రవి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంగం అధ్యక్షులు శంకరయ్య, వైద్య బృందం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్లంపల్లి మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



**నెన్నెల, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో నూతన మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన దావా స్వాతి రమేష్ బాబు, వైస్ చైర్మన్ రంగంశెట్టి సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ సంపత్ పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే శాలువాతో వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డులో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి. వెంటనే పరిష్కారం చూపాలి. ఫీల్డ్‌లో ఉంటేనే పాలన బలపడుతుంది. పట్టణ అభివృద్ధే మన లక్ష్యం అని స్పష్టం చేశారు. బెల్లంపల్లి,సమగ్రాభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు.ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ బండి ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయకత్వంలో పట్టణంలో కాంగ్రెస్ మరింత బలపడిందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నూతనంగా గెలుపొందిన కౌన్సిలర్లు, చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు, వైస్ చైర్మన్ రంగంశెట్టి సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు మూచర్ల మల్లయ్య, మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకారంతో బెల్లంపల్లి మున్సిపల్ పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పట్టణ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని నేతలు అభిప్రాయపడ్డారు.

## అంకిత భావంతో విధులు నిర్వహించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- 65 మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌ల పంపిణీ



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన 'భూ భారతి'లో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న సర్వేయర్లు ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో, రెండో విడతలో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన 65 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్‌తో కలిసి ఆయన ధ్రువపత్రాలను, లైసెన్స్‌లను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు, భూ రికార్డుల ప్రక్షాళనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకమైన సేవలు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను ప్రవేశపెట్టిందని వివరించారు. రెండో విడతలో కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 65 మంది అభ్యర్థులు తమ విధులను పూర్తి అంకితభావంతో నిర్వహించాలని కోరారు. క్షేత్రస్థాయిలో భూముల కొలతలు, రికార్డుల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు .అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భూ వివాదాల పరిష్కారంలో సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని, నూతనంగా ఎంపికైన వారు వృత్తిపరమైన నైపుణ్యంతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వే విభాగం అధికారులు, సిబ్బంది, శిక్షణ పొందిన సర్వేయర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా అరైవ్ లైవ్

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ రితిక పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(జనంసాక్షి):** మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, రేష్ డ్రైవింగ్ చేస్తే చట్టపైనమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్‌పిఎం హెచ్‌ఆర్‌డి భవనంలో శుక్రవారం కాగజ్నగర్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మెడికల్ అసోసియేషన్ సౌజన్యంతో లారీ, ట్రక్ డ్రైవర్లు, క్లీనర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ నితికే పంత్ ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన చూపు లోపాలను ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకోవడం ఎంతగానో అవసరమని తెలిపారు. ముఖ్యంగా లారీ, ట్రక్ డ్రైవర్లు ప్రయాణాలు చేసే సమయంలో స్పష్టమైన చూపు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

- రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి
- నిబంధనలు అతిక్రమిస్తే అధికారులు చర్యలు చేపట్టాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- గణపురంలో వాహనదారులకు ఉచిత హెల్మెట్ల పంపిణీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా తలపై హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ భూపాలపల్లి కమిటి, వరంగల్ చక్రవర్తి హాస్పిటల్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన దారులకు ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీఐ కరుణాకర్ అధ్యక్షతన, ఎస్సై అశోక్ నేతృత్వంలో జరిగిన ఈ హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహన దారులు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్ని నియమ, నిబంధనలు విధించినా ప్రజలు వాటిని ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని, అపుడే ప్రమాదాలు నివారించగలమని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తో పాటు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రాణం పోయిన తర్వాత బాధపడినా ఉపయోగం లేదని, ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలను కాపాడుతాయని తెలిపారు. వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చునేవారు కూడా విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎక్కడైనా వాహనాలు పట్టుకున్నప్పుడు తన పేరు చెప్పినా విడిచిపెట్టవద్దని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. సింగరేణి, ఎఎంఆర్, జెన్కో, మెగా తదితర సంస్థల ద్వారా మరిన్ని హెల్మెట్లు పంపిణీ చేయాలని కోరారు. చక్రవర్తి హాస్పిటల్ అధినేత డా. తరుణ్ రెడ్డి మరో 200 హెల్మెట్స్ వితరణ చేయాలని కోరగా ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. వ్యాపారవేత్తలు హెల్మెట్స్ వితరణ చేయాలని ఆయన సూచించారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఒక వ్యక్తి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వేగ నియంత్రణ పాటించాలని, చలానా వేస్తారనే భయంతో కాకుండా ప్రాణ భద్రత కోసం హెల్మెట్ ధరించాలన్నారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వకూడదని సూచించారు. హెల్మెట్ వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వాహన దారులకు హెల్మెట్స్ పంపిణీ చేశారు. పోలీస్ స్టేషన్ నుండి అంగడి స్థలం వరకు హెల్మెట్ లు ధరించి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో సంధాని, డిపిఆర్ఓ శ్రీనివాస్, డీఎస్పీ సంపత్ రావు, సిఐ నరేష్ కుమార్, చక్రవర్తి హాస్పిటల్ వైద్యులు తరుణ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ రాధిక, తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు పావుశెట్టి శ్రీనివాస్, తడుక సుధాకర్, ఎడ్ల సంతోష్, దొమ్మాటి రవీందర్, శ్రీకాంత్ మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- జేఎన్‌యూ యూనివర్సిటీ వీసీ రాజీనామా చేయాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వీసిదిష్టిబొమ్మ దగ్ధం చేసే క్రమంలో అడ్డుకున్న పోలీసులు



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఢిల్లీ జేఎన్‌యూ యూనివర్సిటీ విసి శాంతి శ్రీ దూలపూడి పండిత్ ల ను వెంటనే అరెస్టు చేసి తొలగించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు శుక్రవారం ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో జేఎన్‌యూ యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మను దగ్ధం చేసే క్రమంలో కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ వారం రోజుల క్రితం ఢిల్లీలోని జేఎన్ యు యూనివర్సిటీలో కొంత మంది మతోన్మాద సంఘాల నాయకులు సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థులపై, అధ్యాపకులపై కులం పేరుతో మతం పేరుతో దూషించి వారిని విపరీతంగా కొట్టారన్నారు. అంతే కాకుండా మీరు ఎవరు యూనివర్సిటీలో ధర్నాలు చేయద్దు సమస్యలపై మాట్లాడొద్దని వారిని బెదిరించారు ఇదంతా జరుగుతున్న కూడా పోలీసులు యూనివర్సిటీ క్యాంపస్ లో ఉండి కూడా ఏం చేయలేదన్నారు వారి పైన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమస్యలపై విద్యార్థులు అధ్యాపకులు వెళ్లి విసి కి చెప్పితే వారు కూడా నిమ్మకు నీరతనట్లుగా వ్యవహరించి మళ్లీ విసి కూడా వారిని కులం పేరుతో మతం పేరుతో దూషించి మిమ్మల్ని రెస్ట్ గెట్ చేస్తానని బెదిరించారని అన్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఉన్నటువంటి యూనివర్సిటీ విసి ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరి సాయికుమార్ ,బీరెడ్డి జశ్వంత్ , రాహుల్, సాయి, పవన్ కుమార్, యోగి, ప్రభాస్, ఆర్య, గణేష్ పాల్గొన్నారు

## కొత్తూరు దేవుని గుట్టను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి

- రోడ్డు, కరంట్, మంచి నీటి సౌకర్యం కల్పించాలి
- దుబ్బగూడెంజాలు నుండి గుట్ట పైకి ప్రత్యేకంగా రోడ్డు వేయాలి
- మంత్రి సీతక్కకి విజ్ఞప్తి చేసిన ప్రజాసంఘాల నాయకులు గుండెబోయిన రవి గౌడ్ గుండ మీది వెంకటేశ్వర్లు



**ములుగు,ఫిబ్రవరి27(జనం సాక్షి):** ములుగు జిల్లా ములుగు మండలం కొత్తూరు ఉమ్మడి గ్రామపంచాయ పరిధిలో ఉన్న బౌద్ధ దేవాలయం (లక్ష్మీ నరసింహస్వామి ఆలయం) దేవుని గుట్ట అనే పిలువబడే ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ప్రజాసంఘాల నాయకులు గుండేబోయిన రవి గౌడ్ గుండ మీది వెంకటేశ్వర్లు పంచాయతీరాజ్ శిషు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు సీతక్క కి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరవ శతాబ్దం లో కంబోడియా లోని అంగ్ కోర్ వాట్ దేవాలయంను ఈ గుడి పోలి ఉందని వారు అన్నారుఈ గుడి లో బౌద్ధుని ఆలయ ముఖ చిత్రాలు ఉన్నాయని అన్నారు.2012 సంవత్సరం నుండి కొత్తూరు ఉమ్మడి గ్రామపంచాయతీ ప్రజలు లక్ష్మీనరసింహస్వామీ కళ్యాణం ప్రతి సంవత్సరం హోలీ పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు జాతర నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు.గత 20 సంవత్సరాలుగా కొత్తూరు గ్రామ పంచాయతీ ప్రజలు హోలీ పండుగ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి దేవుని గుట్టలో ప్రత్యేక పూజలు కళ్యాణం చేసస్తున్నారని వారు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేవుని గుట్టను పర్యాటక కేంద్రంగా ప్రకటించి రోడ్డు, కరెంటు మంచినీళ్లు సౌకర్యం కల్పిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. మంత్రి సీతక్క స్పందించి ఈ దేవుని గుట్టను పర్యా టక కేంద్రంగా ప్రకటించడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించేలా చూసి ఈ గుడికి నిధుల కేటాయించాలని కోరారు. అలాగే సర్వాపూర్, పెగడపల్లి, అంకన్నగూడెం గ్రామం ప్రజలు గత 20 సంవత్సరాలుగా ఈ గుడికి పోవాలంటే దుబ్బగూడం జాలు నుండి నడిచిపోతున్నారని కాబట్టి ఆ గుట్టపైకి దారి ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

- కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల- కళాశాల (బాలికలు) లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి ఇంటర్మీడియట్ పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రంలో త్రాగునీరు, సరైన వెలుతురు, మూత్రశాలలు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది, ఒకేషనల్ 888 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది, ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు.

## సీఎం కప్ పోటీల్లో జిల్లాకు ఖ్యాతి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలలో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటి జిల్లా పేరును నిలబెట్టారని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంతోషం వ్యక్తం చేశారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సీఎం కప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూజిల్లా క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని అన్నారు.రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలలో జిల్లాకు 4 బంగారు పతకాలు,8 వెండి పతకాలు,13 కాంస్య పతకాలు కలిపి మొత్తం, 25 పతకాలు వచ్చాయని తెలిపారు. ఈ ఫలితాలు జిల్లా క్రీడాకారుల అద్భుత ప్రతిభకు కొలమానమని పేర్కొన్నారు. ఇందుకు గానూ యువజన క్రీడల శాఖ అధికారులు,కోచ్ లు, ఉపాధ్యాయులకు, క్రీడల్లో ప్రోత్సహించినందుకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాల్లో క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి,డీఈవో భోజన్న,సిపిఓ జీవరత్నం,కోచ్ లు,తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి క్రికెట్ క్రీడకు తాటి కృష్ణవేణి ఎంపిక

**గంగారం ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని మారుమూల ప్రాంతమైన తిరుమలగండి గ్రామానికి చెందిన తాటి కృష్ణవేణి కృషి పట్టుదలతో క్రికెట్ క్రీడలో రాష్ట్రస్థాయిలో సెలెక్ట్ అయి బీసీసీఐ నిర్వహించే వన్డే మహిళా టోర్నీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్సిఏ) జట్టులో జాతీయస్థాయి క్రికెట్ క్రీడలలో ఎంపికైనందుకు గాను మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గంగారం మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు వారిని శాలువాతో సత్కరించి ఆర్థిక సాయం పదివేల రూపాయలను అందించారు. ఆమెకు కావాల్సిన సహాయ సహకారాలు మంత్రి సీతక్క అందిస్తారని ఇదే పట్టుదలతో జాతీయస్థాయిలో సెలెక్ట్ అయి ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమట్లగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ గుంట రామారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం సమ్మయ్య, కంగాల శీను, వెంకన్న, మోహన్ రావు, పత్రిక రిపోర్టర్లు అశోక్, సురేష్, పల్లె సురేష్, తదితరులు పాల్గొన్నారు

## ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి దొంగతనం



**భైంసా, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** కుబీర్ మండలంలోని పాంగ్ర గ్రామ శివారులో ఓ రైతు చేనులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి దొంగతనం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణ చేనులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను రాత్రి వేళల్లో దుండగులు ధ్వంసం చేసి, అందులోని విలువైన రాగి కాయిల్స్ ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఉదయం పొలానికి వెళ్లిన రైతు ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్న స్థితిలో కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుబీర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని, దొంగలను త్వరలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. ఈ సంఘటనతో గ్రామ పరిసర ప్రాంతాల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా అంతరాయం కలగడంతో పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ శాఖ రాత్రి పహారా బలోపేతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసిన నూతన అదనపు కలెక్టర్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 27(జనం సాక్షి) :** జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను తన ఛాంబర్ లో పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 ఫిబ్రవరి 2026

# ప్రమాదాల నివారణకు నిరంతర అవగాహన కలిగించాలి

**హాలియా, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రాణనష్టాల్ని తగ్గించవచ్చని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎరైవ్-ఎలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హాలియా లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో వాహనాల డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్ లతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనాల డ్రైవర్లు గంటల తరబడి ప్రయాణాలు చేస్తుంటారని ఇందులో ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని దీంతో మృతుల కుటుంబాలు వీధిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా గతవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిట్టల వెంకటయ్య, మల్లమ్మ కుటుంబానికి రూ.ఒక లక్ష రూపాయల




ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ప్రకటించారు. అనంతరం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ద్వారానే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతోపాటు రాత్రి వేళల్లో వాహనాల డ్రైవర్లు కంటి చూపు కూడా ఓ సమస్యగా మారిందని దీని నివారణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విరివిగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ముఖ్యమని ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు వాడాలని సూచించారు. హాలియా మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ హాలియాలో ఎనిమిది గంటలకు పాఠశాలకు చేరే విద్యార్థులు సుమారు పదివేల మంది ఉంటారని పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ కానిస్టేబుల్ సమకూర్చాలని తెలిపారు సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్ సుమారు రూ.2.50 లక్షల రూపాయల విలువగల సీసీ కెమెరాలు అందజేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి మండల తహశీల్దార్ రఘు సాగర్ వైస్ చైర్మన్ గొడవర్తి రాజా ప్రసాద్ సిఐ సతీష్ రెడ్డి జిల్లా రోడ్ సేఫ్టీ వింగ్ రిటైర్డ్ సిఐ అంజయ్య ఎస్ఐలు బండి సాయి ప్రశాంత్ ఉప్పు సురేష్, ప్రసాద్ మండల వైద్యాధికారి రామకృష్ణ పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్ల ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మంది లేబర్ తీసుకొని పనులు పూర్తి చేసి మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేయాలని అన్నారు. బ్లాక్ లో మధ్య గల అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, మొక్కలు నాటడం, పెయింటింగ్ పనులు, స్ట్రీట్ లైట్స్ వంటి అన్ని రకముల పెండింగ్ పనులు పూర్తిచేయాలని, ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి సిద్ధార్థ, మిషన్ భగీరథ ఇ.ఇ. కరుణాకర్ రెడ్డి, తాసిల్దార్ కవిత, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న 9 తులాల బంగారం రికవరీ

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** బంగారు వస్తువులు బ్యాంకులో దాచుకోవటానికి వచ్చి ఓ మహిళ పోగొట్టుకున్న 9 తులాల బంగారాన్ని రికవరీ చేసి అప్పగించినట్లు మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు తెలిపారు శుక్రవారం నాడు స్థానిక డిఎస్పి ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ ఈ నెల 23 వ తారీఖున సాగర్ పైలాన్ కాలనీకి చెందిన కొమ్ము రాహేల్ కుమారి సాగర్ పైలాన్ కాలనీలో గల ఎస్బిఐ బ్యాంకు నందు తన 9 తులాల బంగారాన్ని భద్రపరచుకొనుటకు బ్యాంకుకు వచ్చి తన వద్ద గల బ్యాగును పక్కనపెట్టి మంచినీళ్లు తాగి వెళ్లేసరికి ఆమె బ్యాగ్ లో ఉన్నటువంటి బంగారు ఆభరణాలు ఉంచి నటువంటి కవర్ కనిపించకపోవడంతో అదే రోజు రాత్రి విజయపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసుకున్న విజయపురి ఎస్సై మిర్యాలగూడ డి.ఎస్.పి ఆధ్వర్యంలో స్థానిక సీఐ సహకారంతో బ్యాంకులో గల సీసీ కెమెరాలు పరిశీలించి అట్టి బంగారు నగలను దొంగిలించినటువంటి మహిళ ను పైలాన్ కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించి సదరు మహిళా నుంచి 24 గంటల లోపు బంగారు ఆభరణాల రికవరీ చేసి బాధిత మహిళకు అప్పగించడం జరిగింది అని అన్నారు . కేసు నమోదు చేసుకున్న 24 గంటల్లోనే బంగారం రికవరీ చేసి మహిళకు అందించినటువంటి సాగర్ సిఐ శ్రీనివాస్ నాయక్, సాగర్ ఎస్సై ముత్తయ్య,విజయపురి స్టేషన్ పోలీసులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించబడింది. జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, ప్రభుత్వ ఆదాయం పెంపు మరియు అక్రమ తవ్వకాల నియంత్రణపై సమగ్రంగా చర్చించిన అనంతరం కలెక్టర్ గారు కఠిన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇసుక బుకింగ్ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో "మానా ఇసుక వాహనం" యాప్ ద్వారానే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫ్‌లైన్ బుకింగ్ అనుమతించబడదని స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరిగి ప్రభుత్వానికి గరిష్ట ఆదాయం లభిస్తుందని తెలిపారు. మంజీరా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్ గారు, ప్రస్తుతం మంజీరా నదిలో ఐదు ప్రభుత్వ రీచ్‌లు అనుమతించబడినప్పటికీ అవి పర్యావరణ అనుమతులకు లోబడి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల నుండి అవసరమైన పర్యావరణ క్లియరెన్సులు పొందిన తర్వాత మాత్రమే ఆ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు నిర్వహించడానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలు చేపట్టరాదని కఠినంగా



ఆదేశించారు. అదేవిధంగా మంజీరా నదిలో మూడు పట్టా భూములు జిల్లా కలెక్టర్ ఆమోదం పొందినట్లు తెలియజేసారు. ఈ బాధ్యత కేవలం రెవెన్యూ శాఖ మరియు గనుల శాఖకే పరిమితం కాదని, పోలీసు శాఖ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కలిసి ఒకే వేదికపై పనిచేసి అక్రమ తవ్వకాలు మరియు రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక నిర్వహణ పూర్తిగా పారదర్శకంగా, నియంత్రితంగా అమలు కావాలని కలెక్టర్ శ్రీమతి ఇల త్రిపాఠి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మైనింగ్ ఏ.డీ సంజయ్ కుమార్, రెవెన్యూ పోలీస్ ఇరిగేషన్ ఆర్.డబ్ల్యూ.ఎస్, మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, గ్రౌండ్ వాటర్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందాలి

● నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**తిరుమలగిరి (సాగర్), ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** రెవెన్యూ సేవలు వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు అందాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తిరుమలగిరి (సాగర్) మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూమి రికార్డులు, పహాణీలు, ఆర్ఓఆర్ ఫైళ్లు, మ్యూటేషన్ దరఖాస్తులు, ధరణి-భూభారతి నమోదు వివరాలను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల నిర్వహణ పద్ధతిపై సూచనలు చేస్తూ, డిజిటల్ నమోదులను సకాలంలో అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార స్థితిని కూడా పరిశీలించారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు సమయానికి సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్-కలెక్టర్ నారాయణ అమిత్ , ఇన్చార్జి తహసిల్దర్ అనిల్ కుమార్ , ఆర్ ఐ లక్ష్మీకాంత్ , రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఇంటి పన్నులు, నల్లా పన్నులు చెల్లించాలి

**నేరేడుచర్ల, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ లో సరస్వతి శిశు మందిర్ స్కూల్ 68,004 రూపాయల ఇంటి పన్నులు చెల్లించారాని మున్సిపల్ కమిషనర్ నాగరాజు



తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలో గృహ యాజమానులు కూడా 2025బి 26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన ఇంటి పన్నులు, నల్లా పన్నులు, వ్యాపార పన్నులు,( ట్రేడ్ లైసెన్స్) మార్చి నెలాఖరులోగా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు.

## ముందస్తు జాగ్రత్తలతో సురక్షిత గమ్యం సాధ్యం



**నేరేడుచర్ల, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** విద్యార్థులు బాధ్యతగా ఉండాలి రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించడంలో, రోడ్డు ప్రమాదాలు నివారించడంలో విద్యార్థులు ఆదర్శంగా, ప్రచారకర్తలుగా ఉండాలి నేరేడుచర్ల ఎస్సై రవీందర్ అన్నారు.సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు.నేరేడుచర్ల పట్టణంలోని ప్రగతి హై స్కూల్లో. రోడ్డు భద్రత మహా ఉద్యమం రోడ్డు నియమ నిబంధనలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై రవీందర్ మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోకూడదు అనేది పోలీస్ శాఖ లక్ష్యమని. ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలతో సురక్షిత గమ్యం సాధ్యం అవుతుంది అన్నారు,డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి,మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపవద్దు, మైనర్ డ్రైవింగ్ తో మీకు ఎదుటి వారికి ప్రమాదం సంభవిస్తుంది అన్నారు.రోడ్డుకు లెఫ్ట్ సైడ్ డ్రైవింగ్ ఆల్ వేస్ రైట్ అని.మనం క్షేమంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలు సాధిస్తాం. రోడ్డు ప్రమాదాల్లో వికలాంగులు అయితే జీవితం వ్యర్థం అవుతుంది, లక్ష్యం ఆవిరౌతుంది. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో వాహనం నడిపే వారు వెనక కూర్చుని ఉన్నవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలి, కార్లు పెద్ద వాహనాల్లో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలి అని కోరారు.మైనస్ డ్రైవింగ్ చేయడం వల్ల వాహనం నడిపేవారు ఇతరులు కూడా ప్రమాదంలో పడతారని.మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని సూచించారు.అతివేగంగా వాహనాల నడపడం ప్రమాదం అన్నారు. ప్రతి వాహనానికి అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలని వాహనదారుడు లైసెన్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు.సైబర్ నేరాలపై గంజాయి మహమ్మారి పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రగతి పాఠశాల ప్రిన్సిపల్ కొప్పుల భాస్కర్ రెడ్డి, స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీలత పోలీస్ సిబ్బంది మస్తాన్, శ్రీనివాస్ పోలీస్ కళాబృందం ఇంచార్జి యల్లన్న, సభ్యులు గోపన్న, చారి,సత్యం, గురు లింగం, కృష్ణ, నాగార్జున, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ అనురాగ్ జయంత్‌కు ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు



**భువనగిరి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ బంగ్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసేవల విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై సానుకూల చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రజల సమస్యల పరిష్కారంలో పరిపాలన-ప్రజాప్రతినిధుల సమన్వయం కీలకమని వారు అభిప్రాయపడ్డారు. జిల్లా అభివృద్ధికి తమవంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నాం



**తిరుమలగిరి (సాగర్), ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని నాగార్జునసాగర్ శాసనసభ్యుడు కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న ముఖ్య సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ వంటివి ప్రజల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్ష పాతాన్ని ప్రదర్శిస్తూ, పేదలకు అండగా నిలుస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని వేగంగా అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసిల్దార్ అనిల్ కుమార్ , తిరుమలగిరి సర్పంచ్ పగడాల పున్నమ్మ సైదులు యాదవ్ , హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి , మాజీ ఎంపీపీ ఆంబోతు భగవాన్ నాయక్ , గడ్డం సాగర్ రెడ్డి, శాగం నాగిరెడ్డి , శాగం రాఘవరెడ్డి, ఆంబోతు గోపాల్ నాయక్, బొమ్మ గురునాథం, ఆంగోత్ బాలు నాయక్, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గుప్త నిధుల పేరుతో క్షుద్ర పూజలు తవ్వకాలు చేపట్టిన వారిపై కేసు నమోదు

**పెనుబల్లి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** పెనుబల్లి మండలం ఎరుగట్లలోగుప్త నిధుల పేరుతో అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేసి తవ్వకాలు చేపట్టి ప్రజలను బయభ్రాంతులకు గురి చేసిన వారిపై వీఎం బంజర్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ కే వెంకటేష్ తెలిపారు. పోలీసులవివరాలప్రకారం ఏరుగట్ల గ్రామానికి చెందిన కండి గోపాల్ రావు మిత్రుడైన కృష్ణాజిల్లా విసన్నపేట మండలశీ పుట్రేల గ్రామానికి చెందిన బిక్కుమల్ల తిరుపతిరావు ఇద్దరూ కలిసి ఏరుగట్ల గ్రామం శివారులో ఉన్న గొర్రెపాటి నాగేశ్వరరావు కౌలుకు చేస్తున్న పత్తి చేనులో లంకె బిందెలు ఉన్నాయని వాటిని తీయాలని నిర్ణయించుకొన్నారు.రుద్రంపూర్ కు చెందిన బాసబోయిన రాజేష్ ను, గొల్లమందల గ్రామానికి చెందిన వీరమల్ల రాధాకృష్ణను, ఏరుగట్ల గ్రామానికి చెందిన కట్టబోయి మోహన్ రావు, మర్రి గంగయ్య, గొర్రె పాట నాగేశ్వరావు,ఒక పూజారిని మాట్లాడుకున్నారు, అనంతరం అర్ధరాత్రి సమయంలో జెసిబి తో వెళ్లి పత్తి చేలో తవ్వుతుండగా నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు విషయాన్ని తెలుసుకుని సంఘటన స్థలశీలో పట్టుకోడానికి ప్రయత్నించగా జెసిబి వదిలేసి పారిపోయినారని తెలిపారు. పైనవారి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## సమగ్ర శిశు, గ్రాంట్లు పీఎంశ్రీ నిధులు మార్చి మొదటి వారంలోగా ఖర్చు చేయాలి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** సమగ్ర శిక్ష గ్రాంట్లు పీఎం శ్రీ పథకం కింద మంజూరైన నిధులను మార్చి నెల మొదటి వారంలోగా పూర్తిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఎంఈఓలను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఎంఈఓ లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలోని అన్ని పీఎం శ్రీ పథకం కింద పాఠశాలల్లో సివిల్ వర్క్టతో పాటు ఇతర ఇంటర్వెన్షన్ల వారీగా కేటాయించిన నిధులను వచ్చే నెల మొదటి వారంలోగా పూర్తిగా ఖర్చు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి మొదటి వారంలో నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించి, సివిల్ పనులు పూర్తి చేసి, సంబంధిత బిల్లులను ట్రెజరీలో సమర్పించాలని ఆదేశించారు. అవసరమైతే ట్రెజరీ అధికారులతో సంప్రదించి, పూర్తయిన పనులకు సంబంధించిన నిధులు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వారం రోజుల్లో పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని, నిర్దేశిత గడువులోగా మొత్తం పనులు పూర్తి చేసి నిధులు వినియోగించాలని ఎంఈఓలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా పనుల పురోగతిని ఎంఈఓలను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, టీఎస్‌డబ్ల్యూఐ ఇంజినీర్ సంతోష్,ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ

● పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ముందస్తు జాగ్రత్తలు పాటించడంతోనే రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతిష్ఠాత్మకంగా పోలీసుశాఖ రూపొందించిన 'అరైవ్.. అలైవ్?ఊ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజ్ లో విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదల్లో గాయపడిన వారు కుటుంబ పోషణకు పడుతున్న ఇబ్బందులు,అనుభవాలను బాధితులు పంచుకున్నారు. విద్యార్థులు ఆటో డ్రైవర్లు ఆటో యూనియన్లు, లారీ యూనియన్లు,కళాశాల అధ్యాపకులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి



ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురక్షితంగా గమ్యానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వివరించారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రముఖులు, మీడియా, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతలో తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది తమ ధ్యేయమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడడం, మద్యం సేవించి నడపడం, సిగ్నల్ జంప్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ఈ ప్రచారంలో ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీష్, ఏసీపీలు తిరుపతి రెడ్డి, రమణమూర్తి, శ్రీనివాసులు, కాలేజ్ చైర్మన్ నవీన్,సిఐలు మురళి, ముష్క రాజు, సంజీవ్, సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.




# ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి..

## 961 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, రియాలిటీ, ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 25,200 దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర ఆవిరై.. రూ.463 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 82,220.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,248.61) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ.. ఆఖర్లో మరింత పతనమైంది. ఈ క్రమంలోనే దాదాపు వెయ్యి పాయింట్లకు పైగా కోల్పోయి 81,159.15 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 961.42 పాయింట్ల నష్టంతో 81,287.19 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి 91.02కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5169 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవే..**

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ అమ్మకాలను కొనసాగిస్తుండడం మన మార్కెట్ పతనానికి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. గురువారం మార్కెట్ నుంచి రూ.3,465.99 కోట్ల విలువైన షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.ఎన్విడియా వంటి పెద్ద కంపెనీలు మెరుగైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించినప్పటికీ.. నిన్నటి అమెరికా మార్కెట్లు నష్టాలు చవిచూశాయి. దీంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లపైనా ఆ ప్రభావం పడింది.అమెరికా- ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, వాషింగ్టన్ తీసుకోబోయే తదుపరి చర్యలపై అనిశ్చితి నెలకొంది. దీనికితోడు అంతర్జాతీయంగా ముడిచమురు ధర ఏడు నెలల గరిష్ఠానికి చేరింది. దీనికితోడు రూపాయి విలువ మరింత పతనమై మళ్లీ 91 స్థాయికి చేరుకోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

# మ్యూచువల్ ఫండ్ పథకాల వర్గీకరణలో సెబీ మార్పులు

- లైఫ్ సైకిల్ ఫండ్స్ పేరుతో కొత్త విభాగం
- సొల్యూషన్ ఓరియంటెడ్ పథకాల రద్దు

**న్యూఢిల్లీ:**మ్యూచువల్ ఫండ్ పథకాలను, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పునఃవర్గీకరించింది. సొల్యూషన్ ఓరియంటెడ్ పథకాల విభాగాన్ని తొలగించడంతో పాటు కొత్తగా లైఫ్ సైకిల్ ఫండ్స్ తీసుకొచ్చింది. ఆయా విభాగాల ఫండ్ పథకాలను మదుపర్లు సులువుగా గుర్తు పెట్టేలా, పథకాల పేర్లు ఏకరీతిలో ఉండాలని సూచించడంతో పాటు, మదుపర్ల ప్రయోజనాల పరిరక్షణకు వెల్లడి నిబంధనలను కఠినం చేసింది. తప్పుదోవ పట్టించేలా రిటర్న్ - క్లెయిమ్‌లతో ఫండ్ పథకాల పేర్లను రూపొందించడాన్నీ సెబీ నిలిపి వేసింది.

5 విభాగాలుగా

మ్యూచువల్ ఫండ్‌లను ఐదు విభాగాలుగా సెబీ వర్గీకరించింది. అవి.. ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, లైఫ్ సైకిల్, ఇతర పథకాలు. ఫండ్ ఆఫ్ ఫండ్ పథకాలు, ఇండెక్స్ ఫండ్స్ లేదా ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) లాంటి పాసివ్ పథకాలను ఇతర పథకాల కిందకు చేర్చింది. ఫండ్ పథకాల పేర్లు... సదరు ఫండ్ విభాగం పేరు మాదిరిగానే ఉండాలి. మదుపర్లు ఫండ్ పథకాలను సులువుగా గుర్తించేందుకు, ఆయా విభాగాల ఫండ్ పథకాల పేర్లలో ఏకరీతిని తీసుకొచ్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతిఫలం లేదా రాబడిని ప్రస్తావించే పదాలు ఫండ్ పథకం పేరులో ఉండకూడదని సెబీ తెలిపింది. ఆఫర్ పత్రాలు, ప్రకటనల్లో పథకం రకానికి సంబంధించిన వివరాలు సెబీ నిర్దేశించిన పద్ధతి ప్రకారమే పొందుపరచాలి.

వీటికి చరమగీతం..

పదవీ విరమణ, పిల్లల చదువులు, పెళ్లి లాంటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని మదుపు చేసే సొల్యూషన్ ఓరియెంటెడ్ పథకాల విభాగాన్ని తక్షణమే ఆపేయనున్నట్లు సెబీ తెలిపింది. ఈ విభాగంలోని ప్రస్తుత పథకాల్లోకి కొత్త వారిని చేర్చుకోవడం ఆపేయాలని తెలిపింది. ఈ పథకాల తరహాలో కేటాయింపులు, రిస్క్ ప్రొఫైల్ ఉండే వాటిల్లో వీటిని విలీనం చేయాలని తెలిపింది. ఇందుకు ముందస్తుగా సెబీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

లైఫ్ సైకిల్ ఫండ్స్.. లక్షిత కాలపరిమితితో కూడిన ఓపెన్ ఎండెండ్ పథకాలివి. ఈ పథకాల్లోకి వచ్చే పెట్టుబడులను ఈక్విటీ, డెట్, ఇన్విట్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కమొడిటీ డెరివేటివ్స్ (ఈటీసీడీ), బంగారం, వెండి ఈటీఎఫ్‌లు (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్) ఇలా పలు విభాగాల్లో కేటాయింపులు చేస్తారు. లైఫ్ సైకిల్ ఫండ్స్‌ను కనిష్ఠంగా 5 ఏళ్లు, గరిష్ఠంగా 30 ఏళ్ల కాలపరిమితితో ఫండ్ సంస్థలు తీసుకొని రావచ్చని సెబీ తెలిపింది. 5 ఏళ్ల గుణకంతో ఈ కాలపరిమితులు ఉండొచ్చు. లైఫ్ సైకిల్ ఫండ్స్‌లో.. కాలపరిమితి గడువు సమీపిస్తున్న కొద్దీ, ఈక్విటీల్లో కేటాయింపులు ఆటోమేటిక్‌గా తగ్గించి డెట్, నష్ట ముప్పు తక్కువగా ఉండే ఇతర అసెట్స్ విభాగాల్లో కేటాయింపులు పెంచుతారు.

# స్మార్ట్‌ఫోన్ కాలుతోంది

## ధరలు పెంచేస్తున్న కంపెనీలు!

**న్యూఢిల్లీ:**స్మార్ట్‌ఫోన్ ధరల పెంపు.. గత కొన్ని నెలలుగా వినిపిస్తున్న మాటే. మెమొరీ చిప్‌ల కొరత వల్ల స్మార్ట్‌ఫోన్ ధరలు పెరగనున్నాయన్న అంచనాలు వెలువడ్డాయి. కంపెనీలూ సంకేతాలు ఇచ్చాయి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ఒక్కొక్కటిగా ఆచరణలోకి తెస్తున్నాయి. కొత్తగా లాంచ్ చేస్తున్న స్మార్ట్‌ఫోన్లతో పాటు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న మోడళ్ల ధరలూ పెంచేస్తున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన స్మార్ట్‌ఫోన్ దిగ్గజం శాంసంగ్.. ఇటీవల ధరల పెంపు చేపట్టగా.. చైనాకు చెందిన వివో, ఐకూ బ్రాండ్లు ధరల పెంపునకు సిద్ధమవుతున్నాయి.చైనాకు చెందిన వివో, దాని అనుబంధ ఐకూ స్మార్ట్‌ఫోన్ ధరల పెంపును ప్రకటించాయి. వివో టీ4, ఐకూ జడ్10 సిరీస్ ఫోన్లపై గరిష్ఠంగా రూ.2,500 వరకు పెంచుతున్నాయి. మార్చి 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. వివో టీ4సీ, వివో టీ4ఖీ, వివో టీ4 మోడళ్లపై కనిష్ఠంగా రూ.1,500, గరిష్ఠంగా రూ.2,500 పెంచుతున్నట్లు వివో పేర్కొంది. ఇక ఐకూ జడ్10చీ, ఐకూ జడ్10ఖీ, ఐకూ జడ్10 మోడళ్ల ధరలూ అదే స్థాయిలో పెంచుతున్నట్లు ఐకూ పేర్కొంది.శాంసంగ్ పెంచేసింది: శాంసంగ్ తన ఏ, ఎఫ్ సిరీస్ మోడళ్ల ధరలను తాజాగా సవరించింది. బడ్జెట్, మిడ్ రేంజ్ సెగ్మెంట్‌కు చెందిన ఎఫ్ 17, ఏ36, ఏ56 ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఫోన్ల ధరలను కనిష్ఠంగా రూ.1,000 నుంచి గరిష్ఠంగా రూ.2,000 వరకు పెంచింది. పెరిగిన ధరలు ఫిబ్రవరి 25 నుంచే అమల్లోకి వచ్చాయి. రిటైల్, ఆన్‌లైన్ స్టోర్లలో పెరిగిన ధరలే దర్శనమిస్తున్నాయి.ఎస్ 26 ధరా ఎక్కువే: శాంసంగ్ తాజాగా లాంచ్ చేసిన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఎస్26 సిరీస్ ధరలను కూడా భారీగా పెంచేసింది. ఎస్26 ధర రూ.87,999 నుంచి; ఎస్26+ ధర రూ.1,19,999; అల్ట్రా ధర రూ.1,39,999 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఎస్25 లైనప్‌తో పోల్చినప్పుడు ఎస్ 26 ధర ఏకంగా రూ.13 వేలు ఎక్కువ కాగా.. ఎస్26 ప్లస్ ధర ఏకంగా రూ.20 వేలు ఎక్కువ ధరకు తీసుకొచ్చింది. ఎస్26 అల్ట్రా ధర కూడా గత స్మార్ట్‌ఫోన్‌తో పోలిస్తే రూ.10వేలు అధికం.

**ఎందుకీ పెరుగుదల?**

స్మార్ట్‌ఫోన్ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం మెమొరీ చిప్‌ల కొరత. ఏఐ డేటా సెంటర్ల నుంచి విపరీతమైన డిమాండ్ కారణంగా అంతర్జాతీయంగా మెమొరీ చిప్‌ల కొరత ఏర్పడింది. దీంతో మొబైల్ తయారీ ఖర్చు పెరుగుతోంది. దీనికితోడు స్మార్ట్‌ఫోన్లలో ఏఐ సాంకేతికతను జోడిస్తుండడంతో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ ధరలకు రెక్కలు వస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లలో వినియోగించే ప్రాసెసర్‌ల ధరలను ఆయా కంపెనీలు పెంచుతుండడం వల్ల మొబైల్ తయారీ కంపెనీలు కూడా ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదలాయిస్తున్నాయి. ధరల పెంపుపై నథింగ్ సీఈఓ కార్ల్‌పై ఇదివరకే క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది రాబోయే స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరగబోతున్నాయని, అందుకు నథింగ్ కూడా మినహాయింపు కాదన్నారు.

# 4000 మంది ఉద్యోగులకు లేఆఫ్..

### భారీగా పెరిగిన 'బ్లాక్' షేర్లు

**వాషింగ్టన్:**అమెరికాకు చెందిన ఆర్థిక సేవల సంస్థ 'బ్లాక్' 4000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ కంపెనీ సీఈఓ జాక్ డోర్సే పేర్కొన్నారు. "ఏఐ టూల్స్ కంపెనీ పనితీరును మార్చాయి. ఆ ప్రభావం ఇప్పటికే మాకు కనిపిస్తోంది. కొద్దిపాటి సిబ్బంది కూడా ఆ టూల్స్‌ను వాడి మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. చాలా కంపెనీలు ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించాయని అనుకుంటున్నా" అని డోర్సే అభిప్రాయం వ్యక్తంచేశారు. కంపెనీ చరిత్రలో తాము తీసుకున్న అత్యంత క్లిష్టమైన నిర్ణయాల్లో ఇదొకటని లేఆఫ్‌లను ఉద్దేశించి పోస్టు పెట్టారు. అలాగే ఆ సిబ్బందికి 20 వారాల వేతనంతో పాటు ఆరు నెలలు హెల్త్ కవర్ ఉంటుందని చెప్పారు. వారు వేరే ఉపాధి వెతుక్కొనే క్రమంలో సహకరిస్తామని చెప్పారు. ఏఐ టూల్స్ మెరుగైన పనితీరు ప్రదర్శిస్తున్నాయని, దాంతో మిగతా సంస్థలు కూడా తమ శ్రామిక శక్తిని తగ్గించుకునే అవకాశం ఉందని డోర్సే అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ లేఆఫ్‌ల ప్రకటనతో బ్లాక్ షేర్లు అమాంతం పెరిగాయి. ఎక్స్‌టెండెడ్ ట్రేడింగ్‌లో ఒక్కో షేరు ధర 24 శాతం కంటే ఎక్కువ పెరిగింది. ట్విటర్ (ప్రస్తుతం ఇది ఎక్స్‌గా మారింది) వ్యవస్థాపకుల్లో ఒకరే జాక్ డోర్సే. ఆయన 2009లో స్క్వేర్ సంస్థను స్థాపించారు. 2021లో దానికి బ్లాక్‌గా పేరు మార్చారు. కంపెనీ వినియోగిస్తోన్న బ్లాక్ చెయిన్ సాంకేతికతను ప్రతిబింబించేలా అలా పేరు మార్చారు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,48,200 | ₹ 1,61,570 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

# భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

- 17 ఒప్పందాలపై సంతకాలు
- ద్వైపాక్షికంలో సరికొత్త శకం
- భారత పర్యటనకు రావాలనిఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జోగ్‌కు మోదీ ఆహ్వానం



**న్యూఢిల్లీ:**జెరూసలెంలో గురువారం ఒప్పంద పత్రాలపై సంతకాల అనంతరం విలేకరుల సమావేశంలో భారత్, ఇజ్రాయెల్ ప్రధానులు మోదీ, నెతన్యాహు. చిత్రంలో ఇరుదేశాల విదేశాంగ మంత్రులు ఎస్.జైశంకర్, గిడియన్ సార్ జెరూసలెం: భారత్-ఇజ్రాయెల్ సంబంధాల్లో సరికొత్త శకం మొదలైంది. ఎన్నో కాల పరీక్షలకు నిలిచిన తమ బంధాన్ని ఇరు దేశాలు తాజాగా 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుకున్నాయి. ఉభయ ప్రయోజనకర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) త్వరలోనే కుదుర్చుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని మోదీ గురువారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా చర్చలు జరిపారు. అమెరికా-ఇరాన్ ప్రతిష్టంభన కూడా వారి చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మోదీ-నెతన్యాహు భేటీ అనంతరం- వాణిజ్యం, వ్యవసాయం, విద్య, ఇంధనం, సైబర్‌స్పేస్, డిజిటల్ చెల్లింపులు తదితర రంగాల్లో దిల్లీ-టెల్‌అవీవ్ మొత్తం 17 కీలక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. సాంకేతికతల బదిలీ ఫ్రేమ్‌వర్క్ ద్వారా మిలిటరీ హార్డ్‌వేర్ సంయుక్త అభివృద్ధి, ఉత్పత్తి చేపడుతూ.. తమ మధ్య ఇప్పటికే ఉన్న సన్నిహిత రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించుకున్నాయి. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్, కీలక ఖనిజాల రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకునేందుకు భారత్-ఇజ్రాయెల్ కీలక, భవిష్యత్ సాంకేతికతల భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుంటున్నట్లు మోదీ ప్రకటించారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ వినియోగానికి ఒప్పందం కుదిరిందన్నారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వంతో భారత భద్రతా ప్రయోజనాలు నేరుగా ముడిపడి ఉన్నాయని.. నెతన్యాహుతో భేటీ అనంతరం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. సంఘర్షణలకు మానవాళి బలిపశువుగా మారకూడదంటూ, గాజా శాంతి ప్రణాళికకు భారత మద్దతును పునరుద్ఘాటించారు. ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదన్నారు. ప్రధానుల చర్చల అనంతరం ఇరు దేశాలు ఉమ్మడి ప్రకటనను కూడా విడుదల చేశాయి. ఏఐ, ఆరోగ్య సేవలు, వ్యవసాయం వంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ జెరూసలెంలో ఏర్పాటుచేసిన ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్‌ను మోదీ సందర్శించారు. ఆయా ఆవిష్కరణలను చూసి ముగ్ధులయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఇజ్రాయెలీ టెక్నాలజీ కంపెనీలకు ఆయన పిలుపునిచ్చారు.

**ఇజ్రాయెల్ అధ్యక్షుడితో భేటీ**

ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌తో మోదీ భేటీ అయ్యారు. విద్య, స్టార్టప్‌లు, నవకల్పనలు, సాంకేతికతలు, అనుసంధానం తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవడంపై చర్చించారు. ద్వైపాక్షిక మైత్రికి చిహ్నంగా మోదీ, హెర్జోగ్ ఓక్ చెట్టును నాటారు. భారత పర్యటనకు రావాలంటూ ఇజ్రాయెల్ అధ్యక్షుణ్ని భారత ప్రధాని ఆహ్వానించారు. భారత సంతతికి చెందిన పలువురు యూదు ప్రముఖులు జెరూసలెంలో మోదీతో సమావేశమయ్యారు. ప్రధానిని కలిసినవారిలో రికీ షాహీ, ఇసాక్ థాంగ్జన్ తదితరులు ఉన్నారు. 2023 నాటి లెక్కల ప్రకారం- ఇజ్రాయెల్‌లో భారత సంతతి యూదుల సంఖ్య దాదాపు 85 వేలు. గూఢచర్యం నేపథ్యంలో రూపొందించిన ఇజ్రాయెలీ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ 'ఫౌదా' తారాగణంతో మోదీ కొద్దిసేపు ముచ్చటించారు. వారితో తీసుకున్న సెల్ఫీని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఇజ్రాయెల్ పర్యటనను ముగించుకొని గురువారమే మోదీ స్వదేశానికి బయలుదేరి వచ్చారు. యాద్ వశెమ్ స్మారకం వద్ద నివాళులు జెరూసలెంలో ప్రపంచ హోలోకాస్ట్ (యూదులపై నాజీల మారణహోమం) స్మారక కేంద్రమైన యాద్ వశెమ్ దగ్గర పుష్పగుచ్ఛం ఉంచి నమస్కారం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఉన్నారు. జెరూసలెంలోని యాద్ వశెమ్ స్మారకాన్ని నెతన్యాహుతో కలిసి మోదీ సందర్శించారు. యూదులపై నాజీల మారణహోమం(హోలోకాస్ట్)లో మృతులకు పుష్పాంజలి ఘటించారు. హోలోకాస్ట్‌లో మరణించినవారి పేర్లు ఉండే హాల్ ఆఫ్ నేమ్స్‌ను కూడా సందర్శించారు. తన సతీమణి సారా బంధువుల పేర్లు అందులో ఉండటాన్ని మోదీకి నెతన్యాహు చూపించారు. మోదీ యాద్ వశెమ్‌ను సందర్శించడం ఇది రెండోసారి.

# ఆర్‌బీఐ పేరిట ప్రచారంలో ఉన్న ఆ లెటర్ ఫేక్: కేంద్రం



**న్యూఢిల్లీ:**పాత నాణేలకు బదులుగా భారీగా డబ్బులు ఇస్తున్నట్లుగా పేర్కొంటూ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా పేరిట సర్క్యులేట్ అవుతున్న లేఖ నకిలీదని కేంద్రం స్పష్టం చేసింది. పాత నాణేలను ఎక్స్ఛేంజీ చేసుకునేం దుకు రూ.700 ఫారం ఫీజు, రూ.12,150 డెలివరీ ఫీజుగా చెల్లించడం ద్వారా రూ.34 లక్షల వరకు నగదు పొందొచ్చని ఆశ చూపించే ఆ లేఖ పూర్తిగా నకిలీదని తేల్చి చెప్పింది. ఇదో కుంభకోణమని, ఆర్‌బీఐకి దీంతో ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం సంబంధిత నకిలీ లేఖను 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఆర్‌బీఐ ఎప్పుడూ డబ్బులు, ఫీజు లేదా వ్యక్తిగత వివరాలను అడుగుతూ ఈ-మెయిల్ పంపడమో లేదా లేఖలు పంపడం వంటివి చేయదని తెలిపింది. ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏదైనా పేమెంట్ చేసే ముందు జాగ్రత్తగా చెక్ చేసుకోవాలని పేర్కొంది.

# అక్టోబర్- డిసెంబర్‌లో జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 7.4 శాతంగా ఉంది. ఈ మేరకు శుక్రవారం కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలను కేంద్రం విడుదల చేసింది. ఇప్పటి వరకు 2011-12ను ఆధార సంవత్సరంగా వ్యవహరిస్తుండగా.. దాన్ని 2022-23కు మార్చారు.కొత్త సిరీస్ ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 7.6 శాతం వృద్ధి నమోదు చేయొచ్చని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ అంచనా వేస్తోంది. ఈ ఏడాది జనవరిలో 7.4 శాతంగా వేసిన అంచనాలతో పోలిస్తే ఇది ఎక్కువే. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికానికి వృద్ధి రేటును కూడా 8.2 శాతం నుంచి 8.4 శాతానికి సవరించింది. తొలి త్రైమాసికానికి మాత్రం 7.8 శాతం నుంచి 6.7 శాతానికి తగ్గించింది. తాజా గణాంకాల్లో జీఎస్టీ, ఇ-వాహన్ గణాంకాల వివరాలనూ చేర్చారు. వంట మనిషి, డ్రైవరు సహా ఇంట్లో పనివాళ్లు అందించే సేవలను కూడా జీడీపీ లెక్కింపునకు పరిగణనలోకి తీసుకున్నారు.

# ఏఐ కూడా వై2కే లాంటిదే

## కంపెనీలకు ప్రయోజనమే

### ఉద్యోగాలేమీ పోవు: కేంద్ర మంత్రి గోయల్

ముంబయి: కృత్రిమ మేధ(ఏఐ) రాక వల్ల భారత ఐటీ రంగంలో ఉద్యోగాలు పోవచ్చన్న భయాలను కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ కొట్టివేశారు. ఈ కొత్త సాంకేతికత వల్ల భారత కంపెనీలకు అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉద్యోగాల తీరులో మార్పు వస్తుంది మినహా, ఏఐ ప్రభావం వల్ల దేశంలో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్న ఆందోళనేమీ తమకు లేదని ఆయన అన్నారు. 'వై2కే సమయంలో ఆకాశం జారి మీద పడుతుందనుకున్నాం. కంప్యూటర్లేవీ పనిచేయవు అనుకున్నారు. 2000 జనవరి 1 తర్వాత భారత ఐటీ వెనుతిరిగి చూడలేదు. ఏఐ కూడా అటువంటి మలుపుగానే భావించాల'ని ఆయన అన్నారు. 'మెరుగైన సమాజానికి ఏఐ అనేది శక్తిమంత విప్లవం. టెక్నాలజీతో ఎంత స్నేహం చేస్తే, అంతగా మన నైపుణ్యాలు పెరుగుతాయి. కొత్త అవకాశాలు కనిపిస్తాయి. ఏఐతో మరిన్ని అవకాశాలు, మెరుగైన లాభాలు, భారీ ప్రాజెక్టులు, అధిక ఎగుమతులు సాధ్యమవుతాయని భావిస్తున్న'ట్లు తెలిపారు. చైనా నుంచి నేర్చుకోవాలి: 'ప్రాజెక్టుల విషయంలో చైనాను చూసి మనం నేర్చుకోవాలి. బులెట్ రైలు ప్రారంభించడానికి మనకు ఇంకా 4-5 ఏళ్ల సమయం పడుతుంది. అక్కడ ఇప్పటికే వేల కిలోమీటర్ల మేర బులెట్ రైళ్లు పరుగులు తీశాయి.

# అమెరికా డిమాండ్స్‌కు నో చెప్పిన ఆంథ్రోపిక్



**వాషింగ్టన్:**అమెరికా డిమాండ్స్‌కు ఆ దేశానికి చెందిన ఏఐ స్టార్టప్ సంస్థ ఆంథ్రోపిక్ నో చెప్పింది. యుద్ధాలు, గూఢచర్యానికి సంబంధించి ఏఐకి ఉన్న 'సేఫ్టీ రూల్స్'ను తొలగించాలని అమెరికా రక్షణశాఖ చేసిన డిమాండ్‌ను తాము అంగీకరించట్లేదని ఆంథ్రోపిక్ సీఈఓ దారియో అమోడెయ్ స్పష్టం చేశారు. ఏఐ టూల్ క్లాడ్ నుంచి రక్షణలను తొలగించబోమన్నారు. అలా చేస్తే కృత్రిమ మేధ ఉపయోగాలు ప్రజాస్వామిక విధానాలను అణగదొక్కే అవకాశం ఉందని తెలిపారు. యూఎస్ ఎన్ని బెదిరింపులకు పాల్పడినా భద్రతా చర్యలను విస్మరించే అవకాశం ఇవ్వమని.. తమ నిర్ణయాన్ని మార్చుకునే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో పెంటగాన్‌తో జరిపిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని.. త్వరలో అమెరికా ప్రభుత్వంతో మరిన్ని చర్చలు జరిగే అవకాశం ఉందని దారియో అమోడెయ్ పేర్కొన్నారు. ఏఐ టూల్ క్లాడ్‌ను అమెరికన్లపై గూఢచర్యానికి, ప్రాణాంతక సైనిక కార్యకలాపాల కోసం ఉపయోగించకూడదన్నారు. మరోవైపు ఎటువంటి పరిమితులు లేకుండా ఏఐను అందించే విషయంలో ఆంథ్రోపిక్‌పై ఒత్తిడి తీసుకువచ్చేందుకు రక్షణ ఉత్పత్తి చట్టాన్ని ఉపయోగించుకోవాలని యూఎస్ రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆంథ్రోపిక్ స్టార్టప్ కొత్త ఫీచర్లలో మిలిటరీకి సంబంధించినవి కూడా ఉన్నాయి. మిలిటరీ క్లాసిఫైడ్ సిస్టమ్స్ (సున్నితమైన డేటాను నిర్వహిస్తుంది)లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏకైక మోడల్ ఇది. దీనిని సున్నితమైన నిఘా, రక్షణ కోసం ఉపయోగించవచ్చు. దీంతో చట్టబద్ధమైన ఉపయోగాల కోసం ఏఐ మోడళ్లను ఆంథ్రోపిక్ ప్రభుత్వానికి అందుబాటులో ఉంచాలని.. యుద్ధాలు, గూఢచర్యానికి సంబంధించి ఏఐకి ఉన్న 'సేఫ్టీ రూల్స్'ను తొలగించాలని రక్షణశాఖ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే అమెరికా ప్రభుత్వానికి, ఆంథ్రోపిక్‌కు మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి.

# ట్రంపే గెలిచాడు.. వెనక్కి తగ్గిన నెట్‌ఫ్లిక్స్

**న్యూఢిల్లీ:**నెట్‌ఫ్లిక్స్- వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ మధ్య కొన్ని రోజుల క్రితం డీల్ కుదిరింది. ఇప్పుడు ఆ ఒప్పందం నుంచి నెట్‌ఫ్లిక్స్ వెనక్కి తగ్గింది. చివరకు ట్రంప్‌తో సంబంధం ఉన్న పారామౌంట్ స్కైడ్యాన్స్‌కు లైన్ క్లియర్ అయింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ (డబ్ల్యూబీడీ)కి చెందిన టీవీ, సినిమా స్టూడియోలు, స్ట్రీమింగ్ విభాగాన్ని కొనుగోలు చేయడానికి నెట్‌ఫ్లిక్స్, కామ్‌కాస్ట్ కార్పొరేషన్, పారామౌంట్ సంస్థలు పోటీపడ్డాయి. ఈ బిడ్డింగ్ వార్‌లో తొలుత నెట్‌ఫ్లిక్స్‌పై డిస్కవరీ మొగ్గు చూపింది. వార్నర్ సంస్థను కొనుగోలు చేసేందుకు తాత్కాలిక ఒప్పందం కూడా కుదిరింది. కానీ ఆ ఒప్పందాన్ని పరిశీలించాల్సి ఉందంటూ ట్రంప్ ప్రకటనలు చేయడం, భారీ మొత్తాన్ని కోట్ చేస్తూ పారామౌంట్ హొస్టైల్ బిడ్ వేయడంతో సీన్ మొత్తం మారిపోయింది. మేనేజ్‌మెంట్ ఈ డీల్‌కు అనుకూలంగా లేనప్పుడు నేరుగా వాటాదారులు లక్ష్యంగా ఈ 'హొస్టైల్ బిడ్'ను వేస్తుంటారు. నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్ సంస్థ చేసుకున్న తాత్కాలిక ఒప్పందం ప్రకారం.. ఒక్కో షేరుకు 28 డాలర్లు కాగా, పారామౌంట్ 30 డాలర్లు ఆఫర్ చేసినట్లు తెలిసింది. ఇదే తమకు బెటర్ ఆఫర్ అని డబ్ల్యూబీడీ గురువారం ప్రకటించింది. ఈ డీల్ చర్చల్లో భాగంగానే నెట్‌ఫ్లిక్స్ సీఈఓ టెడ్ సరండోస్ వైట్‌హౌస్‌కు వెళ్లారు.

## జేవీ కాలనీ అక్రమ నిర్మాణాలపై
# అధికారుల మక్కువ

**వచ్చామా.. కూల్చినట్టు చేసామా.. వెళ్లిపోయామా!**

- కార్పొరేటర్ ఫిర్యాదు చేసినా అధికారుల నిర్లక్ష్యం
- సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై తీవ్ర ఆరోపణలు
- ప్రజలు, మీడియా హెచ్చరికలు వద్దు





**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాల విషయంలో శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల వ్యవహారం వివాదాస్పదమవుతోంది. జేవీ కాలనీలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్న విషయం మీడియాలో విస్తృతంగా ప్రచురితమవుతున్నా, స్థానికులు, డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఫిర్యాదులు చేసినా అధికారులు చేస్తున్న తీరు అనేక అనుమానాలకు దారి తీస్తోంది. వచ్చి కొంత కూల్చినట్టు చేసి వెళ్లిపోతున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత కొన్ని నెలలుగా జేవీ కాలనీలో డబుల్ రిజిస్ట్రేషన్‌తో భవనాల నిర్మాణం ఊపందుకుందని, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అధికారులు, కొంతమంది బిల్డర్లు అక్రమ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 99 సర్వే నంబర్ భవనంపై గట్టి చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ గతేడాది సెప్టెంబర్ 22న సవివరంగా ఫిర్యాదు చేశారు. అయితే డిసెంబర్ చివరి వారంలో ఓ మారుతూ మంత్రంగా కొంత కూల్చినట్టు చేసి అధికారులు మొహం చాటేశారని, తదనంతరం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారి తీస్తోందని రాగం దుయ్యబట్టారు.

శుక్రవారం మరోమారు అట్టహాసంగా వచ్చిన అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా కొంత హడావుడి చేసి ఒక అంతస్తు పైకప్పును కూల్చివేసి వెళ్లిపోయారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేతల హడావుడి మీద ఉన్న శ్రద్ధ భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయడానికి ఎదురయ్యే సవాళ్లు ఏంటని ప్రశ్నిస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు పురుడుపోసుకుని పక్కా భవనాలుగా మారడంలో అధికారుల పరోక్ష సహకారం ఉందనేది స్థానికుల ఏకాభిప్రాయం. ఈ విషయంలో సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మరిన్ని ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు.




# అసలే దూరం.. ఆపై పనిభారం

- కొసరుపై ఉన్న శ్రద్ధ అసలుపై లేదు
- ఇన్చార్జి ఏఎస్సిడిఓల పాలన అస్తవ్యస్తం
- సమస్యలకు నిలయంగా కారేపల్లి వసతిగృహం
- ఇది ఖమ్మం షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ పరిస్థితి



**ఖమ్మం, (జనంసాక్షి):** ఖమ్మం జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ పరిధిలోని వసతిగృహాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. జిల్లా అధికారి ఎన్ని సూచనలు చేసినప్పటికీ, క్షేత్రస్థాయి పర్యటనలు చేసిన ఏఎస్సిడిఓల పర్యవేక్షణ లోపంతో పాలనలో లోటుపాట్లు కలుగుతున్నాయి. ముఖ్యంగా వారు ఉద్యోగం చేసేది ఒకచోట, ఇన్చార్జి బాధ్యతలు నిర్వర్తించేది మరోచోట కావడంతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ శాఖ పరిధిలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర ఏఎస్సిడిఓ పోస్టులు ఉన్నాయి. వీటిలో మధిర మినహా ఖమ్మం, సత్తుపల్లి పోస్టులకు ఇన్చార్జిలు ఉన్నారు.

**దూరం భారమై..**

ఖమ్మం, సత్తుపల్లి ఏఎస్సిడిఓ పోస్టులకు ఇన్చార్జిగా పనిచేస్తున్న ఇద్దరు అధికారులకు పని భారం ఎక్కువవుతుంది. సత్తుపల్లి ఏఎస్సిడిఓగా పనిచేస్తున్న వీరయ్య కారేపల్లి పోస్ట్ మెట్రిక్ వసతిగృహం సంక్షేమ అధికారి. ఖమ్మం ఏఎస్సిడిఓగా పనిచేస్తున్న అబ్దుల్ రావూఫ్ రాజేశ్వరపురం ప్రీ మెట్రిక్ వసతిగృహం సంక్షేమ అధికారిగా పనిచేస్తున్నారు. వీరి ఇరువురుకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడంతో వారు వారి పరిధిలోని వసతిగృహ పాలన వ్యవహారాలు చక్కబెడుతూ, డివిజన్ వ్యాప్తంగా ఉన్న సుమారు 20 వసతిగృహాల పర్యవేక్షణ బాధ్యతలు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పర్యవేక్షణకు ప్రతిరోజు ఇతర వసతి గృహాలకు వెళుతుండటంతో తమ వసతిగృహంలో పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**సమస్యలకు నిలయంగా కారేపల్లి వసతి గృహం**

కారేపల్లిలోని పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహం సమస్యలకు నిలయంగా మారింది. ఈ వసతి గృహానికి సంక్షేమాధికారిగా పనిచేస్తున్న వీరయ్య సత్తుపల్లి ఇన్చార్జి ఏఎస్సిడిఓగా సైతం పనిచేస్తున్నారు. ఈ వసతి గృహంలో పారిశుద్ధ్యం నిర్వహణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. రేకుల గదిలో సుమారు 20 మంది విద్యార్థులు బస చేస్తుంటే మూడు ఫ్యాన్లు మాత్రమే తిరుగుతున్నాయి. ఒక ఫ్యాన్ పూర్తిగా మరమ్మత్తులకు గురైంది. ఈ వసతి గృహంలో రెండు మరుగుదొడ్లు, ఒక స్నానపు గది మాత్రమే ఉండడంతో ఉదయం సమయంలో విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారు. వారికి ఒక్కో రోజు చెరువుగట్టు దిక్కవుతుంది. ఇక మెనూ విషయంలో సైతం అనేక లోటుపాట్లు ఉన్నాయి. నాణ్యమైన పౌష్టికాహారం అందడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారి పలుమార్లు గృహాలను సందర్శిస్తూ ఎన్ని సూచనలు చేసినప్పటికీ వీరిపై ఉన్న పనిభారం వల్ల పాలన సక్రమంగా సాగడం లేదు. ఈ విషయంపై జిల్లా అధికారి దృష్టి సారించి వారిపై అదనపు పని భారాన్ని తగ్గిస్తే వారికి ఉన్న వసతిని అద్భుతంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

## చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు
# సౌందర్య రాజన్ మృతి

- బాలాజీ దేవాలయ అభివృద్ధిలో కీలక పూజారి
- రెండు రోజులపాటు బాలాజీ దేవాలయం మూసివేత



**మొయినాబాద్ ఫిబ్రవరి 27 జనంసాక్షి :** తెలంగాణ తిరుపతిగా పేరుందిన చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధానార్చకులు ఆలయ చైర్మన్ తెలంగాణ రాష్ట్ర అర్చకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎంవి సౌందర్య శుక్రవారం మధ్యాహ్నం కన్ను మూశారు. చిలుకూరు బాలాజీ దేవాలయం గండిపేట చెరువు ఒడ్డున ఉండడంతో అప్పట్లో తాతలు ముత్తాతలు నుంచి తమిళనాడు నుంచి దేవాలయ అర్చక పూజారులుగా వెంకట రాఘవ చార్యులు కుమారుడైన సౌందర్య రాజన్ చిలుకూరు బాలాజీ దేవాలయంలో విచ్చేసి స్థిరపడ్డారు ఆలయ అభివృద్ధిలో ఎంతో కృషి చేస్తూ దినదిన అభివృద్ధిగా తెలంగాణ రాష్ట్రంలోని తెలంగాణ తిరుపతిగా పేరు గావించిన సౌందర్యరాజన్ కన్నుమూయడంతో చుట్టుపక్కల గ్రామాలు ప్రాంతాల ప్రజలు దిగ్భ్రాంతి గురయ్యారు. బాలాజీ దేవాలయ అభివృద్ధిలో ఆయన చేసిన కృషి సేవలు గుర్తు చేసుకుంటూ దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ప్రధాన అర్చకులు దేవాలయ చైర్మన్ సౌందర్య రాజన్ దాదాపు 90 సంవత్సరాలు పూర్తి చేసుకుని కనుమయడంతో ఆలయ చుట్టుపక్కల వ్యాపారస్తులు అయ్యో పాపం అంటూ ఏడవ సాగారు. ప్రొఫెసర్ గా రాణించిన సౌందర్య రాజన్ అభివృద్ధిలో అందరితో కలిసి అభివృద్ధి దేయంగా కృషి చేశారని గుర్తు చేసుకుంటూ భక్తులు ద్రి బంతి చెందారు. తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధిలో గ్రామాలలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి ఎనలేని సేవ చేశారని భక్తులు గుర్తు చేసుకున్నారు ఆయన మృతి అందర్నీ కలిసివేసింది. మృతి చెందిన సౌందర్యరాజా అంత్యక్రియలు నేడు శనివారము జరగనున్నట్లు పలువురు పేర్కొన్నారు. సౌందర్య రాజన్ అంత్యక్రియలు జరిగేంతవరకు చిలుకూరు బాలాజీ దేవాలయం రెండు రోజుల పాటు మూసి ఉండడం జరుగుతుందని తెలిపారు.



# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీలు

**విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు.. ఒక పూజారి తొలగింపు**

**సికింద్రాబాద్(జనంసాక్షి):** బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ ఆలయంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ తో కలిసి ఆలయ పరిపాలన విభాగాన్ని ఆమె పరిశీలించారు. లడ్డూ ప్రసాద కౌంటర్, ప్రధాన బుకింగ్ కౌంటర్, రికా ర్డ్స్ రూమ్, ఈఓ, సూపరింటెండెంట్ కార్యాలయాలు, నిర్మాణంలో ఉన్న పార్కింగ్ కాంప్లెక్స్, భక్తుల క్యూలైన్లను ఆమె పరిశీలించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు రావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. లడ్డూ, పులిహోర తయారీ విధానం, శుభ్రతపై ఆరాతీసి శాంపిల్లను పరీక్షలకు పంపించారు. 200 గ్రాములు ఉండాల్సిన పులిహోర ప్యాకెట్ 150 గ్రాములే ఉండటాన్ని గుర్తించారు. ప్రసాదం తయారీ గది పరిశుభ్రత లోపించినట్లు గమనించి వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఒక పూజారిని తొలగించినట్లు తెలిపారు. దేవస్థాన అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారం, వెండి, నగలు, దాతల వివరాలు, టెండర్లు, హుండీ లెక్కల పై రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిం చాలని దేవాదాయ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అవకతవకలు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులకు మెరుగైన పార్కింగ్ సదుపాయాలు కల్పించడం, శాశ్వత ఈవో నియామకం, కాంట్రాక్టు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఆమె తెలిపారు.

# రోడ్డు భద్రతలో నిర్లక్ష్యం ప్రాణాంతకం

- 'అరైవ్-అలైవ్' అవగాహన సదస్సులో ఎస్పీ స్నేహ మెహ్రా



**పరిగి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర గౌరవ డీజీపీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'అరైవ్ – అలైవ్' కార్యక్రమం భాగంగా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని శారద గార్డెన్స్‌లో భారీ రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొడంగల్ చౌరస్తా నుంచి శారద గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిగి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ రవాణా సంఘాలకు చెందిన డ్రైవర్లకు ప్రముఖ కంటి ఆసుపత్రి మాక్స్ విజన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడులను పంపిణీ చేశారు. డ్రైవర్ల ఆరోగ్య సంరక్షణే రహదారి భద్రతకు మూలమని ఎస్పీ స్పష్టం చేశారు.

**ప్రమాదాలకు ప్రధాన కారణాలు ఇవే**

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతోనే 'అరైవ్–అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. నిద్రలేమి, అతివే గం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్లే మెజారిటీ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. "వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలము" అని డ్రైవర్లను ఉద్దేశించి పిలుపునిచ్చారు.

కంటి చూపులో లోపాలు ఉన్న డ్రైవర్లకు ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాద ముప్పు ఎక్కువగా ఉంటుందని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయడంతో పాటు వాహనాలకు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆటో, కార్, బస్సు, లారీ, హెవీ వెహికల్ డ్రైవర్ యూనియన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. డ్రైవర్లతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, మునిసిపల్ చైర్మన్ వేంకటేష్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి ఎంఆర్వో వెంకటేశ్వరి, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరిగి ఆర్టీఓ వీరేందర్ నాయక్, ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, పరిగి సబ్ డివిజన్ ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు అందుబాటులో టెలిమానస్ సేవలు

**ఉచిత హెల్ప్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి : జిల్లా వైద్య శాఖ**

**మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా, ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లాలో కొనసాగుతున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టెలిమానస్ సేవలను విస్తృతంగా అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రకటించింది. పరీక్షల ఒత్తిడి, ఆందోళన, భయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న విద్యార్థులు ఉచితంగా 14416, 1-800-891-4416 హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చేసి నిపుణులైన కౌన్సిలర్ల సలహాలు పొందవచ్చని అధికారులు తెలిపారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లాలోని ప్రతి పరీక్షా కేంద్రంలో టెలిమానస్ పోస్టర్లు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

అవసరమైతే ప్రత్యక్ష మానసిక ఆరోగ్య సేవలకు రిఫర్ చేసే సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు పూర్తైన అనంతరం ఫలితాల సమయంలో కూడా విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున టెలిమానస్ సేవలను నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సి. ఉమా గౌరి సూచించారు.

# తాడిపర్తిలో 'రాయి డస్ట్' దందా

**అనుమతులు లేవు.. నిబంధనలు అసలే లేవు!**

- గాలిలో విషం.. నేలపై కాలుష్యం
- భూత్పూర్ అన్నదాతల ఆవేదన





**భూత్పూర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని తాడిపర్తి గ్రామ శివార్లలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రాయిడస్ట్ పరిశ్రమలు స్థానిక పర్యావరణానికి శాపంగా మారాయి. ఎటువంటి కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ దందా వల్ల అటు గాలి, ఇటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి.

**ఆగిన పంటల ఎదుగుదల..**

తాడిపర్తి గ్రామ పరిసరాల్లోని రెండు రాయి పౌడర్ తయారీ పరిశ్రమల నుండి వెలువడుతున్న విపరీతమైన డస్ట్, కిలోమీటర్ల మేర వ్యాపిస్తోంది. ఈ తెల్లటి దుమ్ము పొరలు సమీపంలోని పంట పొలాలపై, చెట్లపై దట్టంగా పేరుకుపోవడంతో కిరణజన్య సంయోగ క్రియ జరగక పంటల ఎదుగుదల పూర్తిగా ఆగిపోయింది. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు, కళ్లముందే పంట నాశనమవుతుంటే కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చట్టవిరుద్ధంగా భూగర్భ జలాల తోడివేత**

ఈ పరిశ్రమలకు సంబంధించి వాటర్ బోర్డ్ నుండి ఎటువంటి అనుమతులు లేనప్పటికీ, అక్రమంగా బోర్లు వేసి భూగర్భ జలాలను భారీ ఎత్తున తోడేస్తున్నారు. వాణిజ్య అవసరాల కోసం అనుమతి లేకుండా నీటిని వినియోగిస్తుండటంతో, భవిష్యత్తులో చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

**నరకప్రాయంగా మారిన ప్రయాణం**

పరిశ్రమల నుండి వచ్చే రాయి పౌడర్ రోడ్ల మీద దట్టంగా కమ్ముకోవడంతో వాహనదారుల పరిస్థితి దారుణంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనా లపై వెళ్లే వారికి కంటిచూపు మందగించి, శ్వాస తీసుకోవడం కష్టమై ప్రమాదాల బారిన పడుతున్నారు. నిరంతరం గాలిలో కలిసే ఈ దుమ్ము వల్ల స్థానికులు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. చాలా కాలంగా ఈ ప్రాంతంలో కాలుష్య సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర విమర్శ లు వ్యక్తమవుతున్నాయి. అసలు అనుమతులు లేని పరిశ్రమలు ఏళ్ల తరబడి ఎలా నడుస్తున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే యాజమాన్యాలు బరితెగిస్తున్నాయని, ఇది అధికారుల అంతర్గత సహకారమా లేక నిర్లక్ష్యమా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.





**పరిష్కరించాల్సిన అంశాలు...**

బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో పలువురు నిర్వాసి తులకు కేటాయించిన ఇంటి స్థలం పట్టాలు కోర్టు పరిధిలో ఉండటంతో నిర్వాసితులు ఇండ్లు నిర్మించుకోలేక పోతున్నారు. గ్రామంలో మరోచోట ఖాళీగా ఉన్న స్థలాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.పలు గ్రామాల్లో ఒకే స్థలాన్ని ఇద్దరు నిర్వా సితులకు పట్టా కేటాయించారు. కొందరు నిర్వాసితులు ఇప్పటికే ఇంటి నిర్మాణం చేసుకోవడంతో మరో నిర్వాసితుడికి వేరే స్థలాన్ని మార్చాలని కోరుతున్నా ఆ సమస్య పరిష్కారం కావడం లేదు.కుటుంబ పరిహారం, ఇళ్ల, ఇంటి అడుగు స్థలం, భూములు,యువతీ,యువకుల పరిహారం, తప్పిపోయి న పేర్ల నమోదు ఇలా వివిధ సమస్యలు పరిష్కాణి కి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితులు వేడుకుంటున్నారు.

## నిర్వాసితుల నిరీక్షణకు
# తెరదించేది ఎన్నడో!

- పెండింగ్‌లోనే మూడు వేలకు పైగా దరఖాస్తులు
- సమస్యల పరిష్కారంపై దృష్టి సారించని అధికారులు
- ప్రభుత్వాలు మారిన పరిష్కరం కానీ సమస్యలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** మిడ్ మానేరు ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోసం రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారిన తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పరిష్కరించడంపై అధికారుల దృష్టి సారించడం లేదని ఇటు నాయకులు అటు అధికారులు తమను చిన్న చూపు చూస్తున్నారని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీలోజిపల్లి,వరదవెల్లి, కొదురుపాక, రుద్రవరం,సంకేపల్లి, శాభాష్ పల్లి, కొడుముంజ, అనుపురం, చీర్లవంచ, చింతల్ ఠాణ, గుర్రంవానిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో సుమారు 10,683 కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నట్లు అధికారులు 2008 లో గెజిట్ పబ్లికేషన్ చేశారు. ఒక్కో నిర్వాసిత కుటుంబానికి 242 చదరపు గజాల ఇంటి స్థలం పట్టాతో పాటు, నిర్వాసితుడి వృత్తి ఆధారంగా పలు విడతల్లో పరిహారం చెల్లించారు.కానీ గెజిట్ జాబితాలో తప్పులు దొర్లాయి. నిర్వాసితుల వృత్తి తప్పుగా నమోదు చేశారు. అనేక మంది నిర్వాసితుల పేర్లు తప్పిపోయాయి. వందల మంది నిర్వాసితులను డిపెండెంట్ గా నమోదు చేశారు.

**పెండింగ్‌లో దరఖాస్తులు...**

**విచారణపై ద్రుష్టి సారించని అధికారులు...**

ఆయా గ్రామాల్లో గతంలో సుమారు 3 వేలకుపైగా నిర్వాసితుల నుంచి దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటిపై ఇప్పటి వరకు సంబంధిత అధికారులు విచారణ చేపట్టలేదు.10,683 మంది నిర్వాసితుల్లో 420 మంది నిర్వాసితులు వృత్తి మార్పు ఇతర కారణాలతో పరిహారం తీసుకోలేదు.219 మంది నిర్వాసి తుల నుంచి సంతకాలు సేకరించారు. పరిహారం చెల్లింపులు చేయాల్సి ఉంది.2303 మందిలో 424 మంది యువతులకు, 1614 మంది యువకుల్లో 77 మంది యువకులకు రూ 2 లక్షల చొప్పున పరిహారం అందాల్సి ఉంది. గెజిట్ లిస్ట్ లో తప్పులు నమోదు చేశారు.దీంతో వారికి రావాల్సిన పరిహారంలో ఇబ్బందులు ఎదురవడంతో ఎన్నో ఏళ్లుగా దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. కొన్నింటికి పరిష్కారం లభించినప్పటికీ మిగిలిన నిర్వాసితులకు నిరీక్షణ తప్పడం లేదు. సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా కార్యాలయాల్లో, గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు.అయినప్పటికి నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు.

# ఇండ్లు కట్టడంలో మోదీ..పేదల ఇండ్లు కూల్చడంలో రేవంత్

- కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపించే దమ్ము కాంగ్రెస్‌కు లేదని లేఖ రాయండి
- అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇచ్చే విషయంలో మోదీ పోటీ పడుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చే విషయంలో పోటీ పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. నానా కష్టాలు పేదలు అప్పోసప్పో చేసి బతకడానికి ఇండ్లు కట్టుకుంటే వాటిని కూల్చడం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పనితీరు మారకపోతే, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారని, తక్షణమే పేదల ఇళ్ల కూల్చివేతను ఆపాలని, లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం రోజు కరీంనగర్‌లోని 51వ డివిజన్ లో రూ.16 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భండారి వేణు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... కరీంనగర్ లోని 51వ డివిజన్ లో రూ.16 లక్షల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టామని, ఈ డివిజన్‌లో వర్షం వస్తే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆ నిధులతో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్నామన్నారు. కాంగ్రెస్ సర్కారు హామీలు గాలికి వదిలేసిందని, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలొచ్చే టైంలో మళ్లీ ఏదో ఒక డ్రామాలా దతారని బండి అన్నారు. తక్షణమే రైతు భరోసా చెల్లించకపోతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు గత ఎన్నికల్లో మాట్లాడారు. మేం కూడా అదే చెప్పాం. ఈ అంశంపై విచారణ జరిపే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి లేదని రేవంత్ రెడ్డి ఒప్పుకుంటే మేం విచారణ చేపట్టేందుకు సిద్ధం. ఆ మేరకు లేఖ రాయాలని సీఎంను కోరుతున్నానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# లయన్స్ క్లబ్‌లో బొమ్మ వెంకటేశ్వర్ బ్లాక్ ప్రారంభం

- సామాజిక సేవకు నిదర్శనం లయన్స్ క్లబ్
- లక్షల మందికి ఉచిత కంటి చికిత్స
- మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు
- ప్రభుత్వం అండగా ఉంటుంది



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మ వెంకటేశ్వర్ పేరుతో బ్లాక్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ సామాజిక సేవకు నిదర్శనమని, బొమ్మ వెంకటేశ్వర్ దూరదృష్టితో రేకుర్తిలో ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసి లక్షల మంది పేదలకు ఉపయోగపడే విధంగా సేవలందిస్తోందని, ప్రపంచాన్ని చూసే కళ్లను ఆరోగ్యంగా ఉంచేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. 1988 నుంచి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 8 లక్షల 52 వేల మందికి ఓపీ చికిత్స, 1,21,000 మందికి ఉచిత సర్జరీలు, 95 వేల మంది బీపీఎల్ దాటిన వారికి సర్జరీలు జరిగాయని తెలిపారు. 9,000 గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించారని, లయన్స్ క్లబ్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని మంత్రి చెప్పారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు 2010లో అన్యాక్రాంతమైన స్థలాన్ని అధికారులతో మాట్లాడి నాలుగున్నర ఎకరాలు స్మశానవాటికకు ఇప్పించడం జరిగిందని, లయన్స్ క్లబ్ లేకపోతే ఇక్కడ ఒక యూనిట్ ప్రారంభించి స్థలాన్ని ఇప్పించడం జరిగిందని, సామాజిక కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ ఒక వేదికగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో పేదలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు కొనసాగాలని, మీపై దేవుడు ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా, బొమ్మ వెంకన్న సోదరునిగా లయన్స్ క్లబ్ ఏం కోరిన వారికి సేవలు అందిస్తామని, మీకు అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కష్టం జీవులకు అందుబాటులోకి హుబ్లీ రైలు



- 30 ఏళ్ల కల సహకారమైన వేళ : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- బషీరాబాద్‌లో హుబ్లీ ట్రైన్ నిలుపుదల సంతోషకరం

**తాండూరు ఫిబ్రవరి 27(జనంసాక్షి) :** కష్టజీవులకు సుఖ జీవన ప్రయాణం కోసం హుబ్లీ రైలును బషీరాబాద్ లో నిలపడం సంతోషకరమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలో నవాంద్గీ రైల్వే స్టేషన్ లో హుబ్లీ ట్రైన్ నిలుపుదల కార్యక్రమంలో భాగంగా స్థానిక పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నిర్ణయం చాలా సంతోషకరమైన విషయమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, స్థానిక ప్రజలందరి చిరకాల కోరిక హుబ్లీ ట్రైన్ బషీరాబాద్‌లో నిలువాలని ఉండేదని నేటితో ఆ కోరిక నేరవేరింద న్నారు. తెలంగాణలోనే మారుమూల ప్రాంతంగా, కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్న బషీరాబాద్ మండల ప్రజలకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఇక్కడి ప్రజలు ఎక్కువగా తమ కష్టం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా బషీరాబాద్ మరియు పరిసర గ్రామాల ప్రజలు రాష్ట్ర రాజధాని హైదరబాద్ వెళ్లేందుకు ఇబ్బందులు ఉండేవి, ఇప్పుడు హుబ్లీ ట్రైన్ నిలుపుదలతో ప్రయాణికులకు సౌకర్యం పెరగడంతో పాటు సమయం మరియు ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. ఈ రైలు నిలిపివేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికీ తెలుసుకెళ్ళీ ప్రత్యేకంగా ప్రయత్నాలు చేశామన్నారు. అలాగే ఈ విషయాన్ని కేంద్ర స్థాయిలో ముందుకు తీసుకెళ్లిన స్థానిక ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హుబ్లీ ట్రైన్ నిలుపుదలతో బషీరాబాద్ ప్రాంతం అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేసిందని చెప్పవచ్చన్నారు. అదేవిధంగా ఇక్కడ ఉన్న స్థానిక ప్రజలకు ప్రయాణికులకు, రవాణా భారం తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేంకటేష్ మహారాజ్, మర్కెట్ కమిటీ చైర్మన్ మాధవ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ రాకేస్ మహారాజ్, సొసైటి మాజీ చైర్మన్ వెంకట్ రాం రెడ్డి, సొసైటి మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసద్, మాజీ మర్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, బాల్‌రెడ్డి, సర్పంచ్లు నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన పీఎంశ్రీ నోడల్ అధికారి

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను పీఎంశ్రీ నోడల్ అధికారి ప్రవీర్ కుమార్ శుక్రవారం కలిసారు. పీఎం శ్రీ కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ పరిశీలించేందుకు వచ్చి.. కలెక్టర్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మర్యాద పూర్వకంగా కలువగా, పుష్ప గుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ అమలు చేస్తున్న కార్యక్రమాలు, వివిధ నిర్మాణ పనులపై చర్చించారు.

# నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

- రోడ్డు భద్రతలో అశ్రద్ధ వద్దు
- పోలీస్ మెడికల్ క్యాంపులో డ్రైవర్లకు కంటి పరీక్షలు
- 'అరైవ్ -అలైవ్' అవగాహన సదస్సు
- ఎస్పీ స్నేహ మెహ్రా సూచనలు




**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ప్రతి ప్రాణం విలువైనదే, రోడ్డు భద్రతలో నిర్లక్ష్యం ప్రాణాంతకమని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'అరైవ్ – అలైవ్' కార్యక్రమంలో భాగంగా, పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని శారద గార్డెన్స్‌లో భారీ రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ స్నేహ మెహ్రా కొడంగల్ చౌరస్తా నుంచి శారద గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిగి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ రవాణా సంఘాలకు చెందిన డ్రైవర్లకు ప్రముఖ కంటి ఆసుపత్రి మాక్స్ విజన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడులు పంపిణీ చేశారు. డ్రైవర్ల ఆరోగ్య సంరక్షణే రహదారి భద్రతకు మూలమని ఎస్పీ స్పష్టం చేశారు.

ఈ సదస్సులో మాట్లాడుతూ ఎస్పీ స్నేహ మెహ్రా, ప్రతి పౌరుడు క్షేమంగా తన గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో 'అరైవ్ – అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు అనాథలవుతున్నాయని, ముఖ్యంగా వృత్తిపరమైన డ్రైవర్లు తమ ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "నిద్రలేమి, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడమే మెజారిటీ రోడ్డు ప్రమాదాలకు కారణం. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలము" అని డ్రైవర్లను ఉద్దేశించి తెలిపారు. కంటి చూపులో లోపాలు ఉన్న డ్రైవర్లకు ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుందని, అందువల్ల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, సూచించిన కళ్లజోడులను తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయడంతో పాటు, వాహనాలకు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ భారీ అవగాహన కార్యక్రమంలో ఆటో, కార్, బస్సు, లారీ మరియు హెవీ వెహికల్ డ్రైవర్ యూనియన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. డ్రైవర్లతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, మునిసిపల్ చైర్మన్ వేంకటేష్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరిగి ఆర్‌పీఓ వీరేందర్ నాయక్, పరిగి ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, పరిగి సబ్ డివిజన్ ఎస్‌ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## జగద్గిరిగుట్టలో వివాహిత ఆత్మహత్య

**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ఓ వివాహిత నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని షిరిడి హిల్స్ లో నివాసముండే దివ్య అలియాస్ జ్యోతి ( 33) నరసింహ అనే ఓ వ్యక్తిని ఇటీవల రెండో వివాహం చేసుకుంది. ఇరువురికి రెండవ వివాహం గా తెలుస్తుంది. ఇరువురి మధ్యన గొడవల కారణంగా జ్యోతి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# సురక్షితంగా గమ్యాన్ని చేరడం



**షాబాద్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో 'అరైవ్ – అలైవ్' క్యాంపెయిన్ 2వ దశలో భాగంగా శుక్రవారం షాబాద్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి స్టేషన్ సిబ్బందికి హెల్మెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యత, బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాట్లు, వేగ నియంత్రణ, హెల్మెట్ ధరింపు, సీటు బెల్టు వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలను ప్రజలకు తెలియజేయడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని, కలిగే నష్టాలు కుటుంబాలపై పడే ప్రభావాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ప్రాణం విలువైనదని, రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను అనాథలను చేస్తున్నాయని, అందుకే ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. డ్రైవర్లు క్రమశిక్షణ పాటిస్తే ప్రాణాలు కాపాడగలమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శంకర్ రెడ్డి, సతీష్, రామ్ లాల్ తదితర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల సమావేశం విజయవంతం చేయాలి

- అమరవీరుల స్థూపం నుంచి ర్యాలీ
- ఫిలిం భవన్‌లో కీలక చర్చలు
- ప్రభుత్వ కమిటీ స్వాగతార్హం
- ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి

**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ఆదివారం నగరంలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నగర అధ్యక్షుడు గోడిశాల రమేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఒక ప్రముఖ హోటల్‌లో ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాథమిక సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారులకు, తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఉద్యమకారుల సంక్షేమం కోసం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతార్హమని పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు.

ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్‌లో జరిగే సమావేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి ర్యాలీ ప్రారంభమై ఫిలిం భవన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు రామరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి దయ్యాల ఓం ప్రసాద్, నగర అధ్యక్షుడు గోడిశాల రమేశ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఊకంటి ఓంకార్, కేంసారం సమ్మయ్య, నగర ఉపాధ్యక్షుడు గోడిశాల సతీష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి మంద వెంకన్న, నగర సహాయక కార్యదర్శి పల్లె నారాయణ గౌడ్, వట్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలి

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలని వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి విద్యార్థులకు పిలుపునిచ్చారు. అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అగ్రహారంలోని కె-కన్వెన్షన్ హాల్లో జెఎన్టియు, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రోడ్డు భద్రతపై అవగాహనతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. జిల్లాలో ఎస్పీ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ కార్యక్రమని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా వాహనం నడిపే సమయాల్లో హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం తప్పని సరన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ర్యాష్ ,రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని విద్యార్థులకు వివరించారు.




**సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అత్యవసరం..**

ప్రస్తుతం సైబర్ నేరాలు విస్తరిస్తున్న క్రమంలో విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారం ఎవరితో పంచుకోవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద కాల్స్ లేదా మెసేజ్‌లు వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

**గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.**

యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యానికి, కుటుంబానికి మరియు సమాజానికి హానికరమన్నారు. మత్తు పదార్థాల వ్యసనం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు.

**మహిళల రక్షణ కోసం జిల్లా షీ టీమ్ సేవలు..**

మహిళల భద్రత కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీమ్ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలు, విద్యార్థులు ఎలాంటి వేధింపులు గురైన నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దన్నారు. మహిళల భద్రతకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని అయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్‌ఐ సురేష్, ఎస్‌ఐలు రామ్మోహన్, రాజు, షీ టీమ్ ఏఎస్‌ఐ ప్రమీల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జేఎన్‌యులో విద్యార్థులపై దాడి హేయమైన చర్య

## వీసీ తక్షణమే రాజీనామా చేయాలి : ఎస్ఎఫ్ఐ

**ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి):** సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిరసనలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగిన అమానుష దాడిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండతోనే క్యాంపస్‌లలో ఏబీవీపీ గూండాలు స్వైరవిహారం చేస్తున్నారని మండిపడ్డారు. ముసుగులు ధరించి విద్యార్థినుల హాస్టళ్లలోకి చొరబడి, ఇనుప రాడ్లతో దాడి చేయడం పిరికిపంద చర్య అని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను హింసతో అణచివేయలేరని, విద్యార్థి లోకం ఈ దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.మమత మాట్లాడుతూ.. విద్యార్థులు తమ విద్యార్థి సంఘాన్ని ఎన్నికల తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని వి.సి.ని వైఖరిని ప్రశ్నించినందుకు వారిని క్యాంపస్ నుండి బహిష్కరణ చేయడం దుర్మార్గపు చర్య అని తక్షణమే వారిపై బహిష్కరణ ఎత్తివేయాలనీ డిమాండ్ చేశారు. వేణు పక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. క్యాంపస్‌లో గంటల తరబడి హింస జరుగుతున్నా, పోలీసులు చూస్తూ ఉండిపోయారని, యూనివర్సిటీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు కనీస రక్షణ కల్పించలేని వీసీ కి ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని, ఆయన వెంటనే వైదొలగాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, లేని ఫంక్షన్ లో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, రమేష్, భగత్, శ్రీమాన్, ఆంజనేయులు, ప్రవీణ్, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రా

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 27(జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా చిత్రా మిశ్రా శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రాను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్, పలువురు జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసినారు.




# ఆదమరిస్తే అంతే సంగతులు

- గుంతపడిన రోడ్డు.. ప్రమాద సూచికలు ఎక్కడ..?
- వాహనదారులు, ప్రజలు తీవ్ర ఆందోళన
- బారికేడ్ ఏర్పాటు చేస్తామని అధికారులు

**గంభీరావుపేట, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ఆదమరిస్తే అంతే.. ప్రాణాలు పోవడమే తరువాయి. ఆర్ అండ్ బి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి గుంతపడిన రోడ్డుపై పట్టింపులేదు. గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రధాన రహదారైన సిద్ధిపేట–కామారెడ్డి మార్గంలో మానేరు వాగుపై ఉన్న రోడ్డు గత కొన్నేళ్లుగా గుంతపడి ప్రమాద సూచికగా మారింది. అయినా అధికారులు మాత్రం దానిపై ప్రత్యేక దృష్టి పెట్టడం లేదు. ఏదైనా జరుగరాని ప్రమాదం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని వాహనదారులు, ప్రజలు మండిపడుతున్నారు. ఈ మధ్యలో పోలీసులు, రోడ్డు రవాణా సంస్థ చేపట్టిన రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని రోడ్డు భద్రత మహోత్సవాలు నిర్వహించినప్పటికీ ఇలాంటి గుంతలపై చర్యలు చేపట్టని అధికారుల నిర్లక్ష్యమే అని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గుంతపడిన రోడ్డును బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయం పై ఆర్ అండ్ బి అధికారులను వివరణ కోరగా పోలీస్ సిబ్బందికి చెప్పి ఒక బారికేడ్ ఏర్పాటు చేపిస్తామన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

- నలుగురు ఉద్యోగులు తొలగింపు
- అర్చకుడికి చార్జ్ షీట్
- ఈవో, సూపరింటెండెంట్ సస్పెన్షన్‌కు ఆదేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అటవీ,పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం ఆకస్మిక తనిఖీ సందర్భంగా దేవాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు అధికారులపై వేటు వేశారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం వంటి తీవ్రమైన అంశాలను మంత్రి గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నలుగురు సిబ్బందిని సేవల నుండి తొలగించాలని మంత్రి ఆదేశించారు. స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) జి. రాము, అటెండర్ (రెగ్యులర్) ఎస్. శ్రీహరి, స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) పి. నరసింహ, సీనియర్ అకౌంటెంట్ (ఔట్‌సోర్సింగ్) జి. ప్రభాకర్ రావును విధుల నుండి తొలగించాలని నిర్ణయించారు. అర్చకుడు ఎ. శ్రీనివాస చార్యులపై చార్జ్ షీట్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. అలాగే, పరిపాలనా, పర్యవేక్షణ లోపాల కారణంగా దేవాలయ సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)లను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ నిర్వహణ పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేసినట్లు తెలిసింది.

# సౌమ్య కుటుంబానికి విశ్రాంత ఉద్యోగుల బాసట

- ఒకరోజు పెన్షన్ మొత్తం 2.80 లక్షలు సేకరణ
- మంత్రి జూపల్లి చేతుల మీదుగా కుటుంబానికి అందజేత



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు తమ ఒక రోజు పెన్షన్ మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు రూ.2.80 లక్షల చెక్కును ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సౌమ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న ఒక సహోద్యోగి కుటుంబానికి విశ్రాంత ఉద్యోగులు తమ పెద్ద మనసుతో అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. కోటి ఆర్థిక సాయంతో పాటు, ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఎక్సైజ్ సిబ్బంది కృషిని ప్రభుత్వం గుర్తిస్తుందని, వారికి అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గంజాయి, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియకు మోక్షం లభించనుందని మంత్రి జూపల్లి వెల్లడించారు. వారం రోజుల్లోగా సుమారు 2,500 మంది కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తి చేస్తామని, అనంతరం ఇతర హోదాల్లోని అధికారుల బదిలీలను దశలవారీగా చేపడతామని వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో చిన్నారి మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారని తెలిపారు. తెలంగాణను దేశీ, విదేశీ పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నూతన పర్యాటక విధానం ద్వారా వాటర్ స్పోర్ట్స్, ఎకో, వెల్నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారుల వెంట పర్యాటకులకు సమాచారం అందించే సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ముకుంద రెడ్డి, ప్రతినిధులు విష్ణు స్వరూప్ రెడ్డి, నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సౌమ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర నివేదిక రూపొందించండి

**99 రోజుల యాక్షన్ ప్లాన్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్ (జనంసాక్షి) : రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఏం చేసింది, రాబోయే రోజుల్లో ఏం చేయాలనుకుంటుంది ప్రజలకు స్పష్టంగా అర్థం అయ్యేలా వివరించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రజాభవన్ లో 99 డేస్ యాక్షన్ ప్లాన్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ స్థాయిల్లో ఏ తరహా కార్యక్రమాలు చేపట్టాలి, వివిధ శాఖలను ఏ విధంగా సమన్వయం చేసుకోవాలి, పూర్తి సమాచారంతో కూడిన నివేదికల రూపొందించడం అనే అంశాలను నివేదికలో జోడించాలని మంత్రులు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, యోగితా రానా, క్రిస్టిన, అనిత రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# దర్యాప్తు సంస్థల ముసుగులో రాజకీయ కుట్రలు

- లిక్కర్ కేసులో కోర్టు తీర్పే నిదర్శనం: దేశపతి



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రత్యర్థులను అణచి వేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అల్లిన కుట్రలు ఒక్కొక్కటిగా వీగిపోతుండటం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మద్యం కేసులో ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందించారు. మద్యం కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవిత వంటి నాయకులపై మోపిన అక్రమ కేసులు కేవలం రాజకీయ కక్షతో కూడుకున్నవని కోర్టు తీర్పుల ద్వారా స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం రాజకీయంగా బద్నాం చేయడమే ధ్యేయంగా ఈ కేసులు బనాయించబడ్డాయని నిరూపితమయ్యిందని అన్నారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకులను ఇబ్బంది పెట్టాలని చూసిన శక్తులకు ఇది గొడ్డలిపెట్టని స్పష్టం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎంతటి దుష్ప్రచారం చేసినా చివరికి సత్యమే జయించిందని,ఇది కేవలం వ్యక్తుల విజయం కాదు, భారత రాజ్యాంగం పట్ల నమ్మకాన్ని పెంచే న్యాయ విజయమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని, ఆ పార్టీ నాయకత్వాన్ని అభాసుపాలు చేయాలని చూసిన కుతంత్రాలన్నీ నేటితో పటాపంచలయ్యాయని తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఫ్లై ఓవర్ పనులు ప్రారభం

- ట్రాఫిక్ మళ్లింపు చేపట్టిన పోలీసులు
- పనులు పరిశీలించిన సిపి సజ్జన్నార్



హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) : బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పార్క్ హయత్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులని మేఘా నిర్మాణ సంస్థ ప్రారంభించింది. వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన ప్రాంతాన్ని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. సీపీ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఫ్లైఓవర్‌నిర్మాణ పనులు ప్రారంభమైన సందర్భంగా శుక్రవారం నుంచి పలుమార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లైఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ రోజు పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఇవాళ నుంచి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాహనదారులకు పలు సూచనలు చేశామని అన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేశామని తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్లాన్ చేశామని చెప్పుకొచ్చారు. ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణ పనులు దశల వారీగా జరుగుతాయని వెల్లడించారు. రాత్రి వేళ ఎక్కువగా పనులు చేయాలని నిర్మాణ సంస్థలను కోరామని అన్నారు. బేస్‌మెంట్ పూర్తి అయితే తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. 7 అండర్ పాసులు, 7 ఫ్లైఓవర్లు అందుబాటులోకి వస్తే ఆయా రోడ్లు సిగ్నల్ ఫ్రీగా మారుతాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బీఆర్ పార్కు చుట్టూ 7 ఫ్లై ఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. ఈ సందర్భంగా జోయల్ డేవిస్ మాట్లాడుతూ నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని వాహనదారులకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశామని అన్నారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనాలు శ్రీనగర్ కాలనీ, ఇంద్రానగర్ బస్తీ మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లాలని జోయల్ డేవిస్ సూచించారు. మాసబ్ ట్యాంక్ నుంచి కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లే వాహనాలు రోడ్ నెంబర్- 45 మీదుగా వెళ్లాలని అన్నారు. రెండున్నర నెలలపాటు బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పిల్లర్స్ పనులు కొనసాగుతాయిని వివరించారు. రెండున్నర నెలలపాటు కొంత ట్రాఫిక్ సమస్య ఉంటుందని.. పరిస్థితులను బట్టి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. పీక్ అవర్స్‌లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు. నిర్మాణ పనులు ప్రారంభమైనందున వాహనదారులు పోలీసులకు సహకరించాలని జోయల్ డేవిస్ కోరారు.

# మా పెళ్లి విందుకు రండి

- మోడీ అమిత్‌షాలను ఆహ్వానించిన విరోషా జంట



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : గురువారం పెళ్లి చేసుకున్న హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న రిసెప్షన్ ఏర్పాట్లలో ఉన్నారు. గురువారం ఉదయం 10.10 గంటలకు మూడు ముళ్ల బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో వీరి పెళ్లి జరిగింది. ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం.. సాయంత్రం కొడవ సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి అతి కొద్ది మంది బంధుమిత్రులను మాత్రమే ఆహ్వానించారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా రిసెప్షన్ నిర్వహించనున్నారు. రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. విజయ్, రష్మికలు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రిసెప్షన్‌కు రావాలని ప్రధానికి ప్రత్యేక ఆహ్వానం అందించారు. అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిశారు. పెళ్లి రిసెప్షన్‌కు రావాలని అహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్విటేషన్‌తో పాటు వినాయకుడి విగ్రహాన్ని కూడా ఆయనకు అందించారు. విజయ్, రష్మికల జంట ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఆయేషా అవశేషాల ఖననం

విజయవాడ, ఫిబ్రవరి27 (జనంసాక్షి) : 2007లో హత్యకు గురైన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా అవశేషాలను తల్లిదండ్రులకు అధికారులు అప్పగించారు. వీటిన తెనాలిలో ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. విజయవాడలోని కోర్టు ప్రాంగణం నుంచి ర్యాలీగా బయలుదేరిన ఆయేషా తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదని, నేరుగా తెనాలి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తన బిడ్డను అన్యాయంగా చంపేశారని ఆయేషా తల్లి శంషాద్ బేగం ఆరోపించారు. 19 ఏళ్లుగా పోరాటం చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దేవుడే దోషులను కఠినంగా శిక్షించాలని వేడుకుంటున్నట్లు చెప్పారు. చివరకు తెనాలిలో వాటిని ఖననం చేశారు.

# డోన్ సమీపంలో ఘోర ప్రమాదం

- కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు దుర్మరణం



నంద్యాల, ఫిబ్రవరి27 (జనంసాక్షి) : నంద్యాల జిల్లా డోన్ సమీపంలో బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. కారు, క్రేన్ ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కర్ణాటకకు చెందిన ప్రమోద్ తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళుతుండగా.. జగదూతి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న క్రేన్ ఢీ కొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. ఇందులో ప్రయాణిస్తున్న ఓ మహిళతోపాటు ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర గాయాలపాలైన ప్రమోద్‌ను 108 వాహనంలో డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ రాకేశ్, ఎస్సై మమత ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# రచ్చకెక్కిన విజయ్ వ్యక్తిగత జీవితం

- భర్తతో మానసికంగా ఐదేళ్లుగా దూరంగా ఉన్నట్లు సంగీత వెల్లడి
- ఇక వేగలేనంటూ చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకులకు దరఖాస్తు
- రాజకీయంగా దెబ్బేనంటున్న పరిశీలకులు



చెన్న, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం చర్చనీయాంశంగా మారింది. ఆయన భార్య సంగీత సంచలన ఆరోపణలు చేశారు. ఐదేళ్ల కిందటే తాము మానసికంగా విడిపోయామని విజయ్ భార్య సంగీత అన్నారు. విజయ్‌కి ఓ నటితో వివాహేతర సంబంధం ఉందని ఆరోపించారు. ఆ నటితో విదేశాలకు, పార్టీలకు విజయ్ వెళ్తారని చెప్పుకొచ్చారు. విజయ్ తనను వేధింపులకు గురి చేస్తున్నారని.. ఇది ఇలాగే కొనసాగితే ఆ నటి పేరు బయటపెడతానంటూ సంగీత హెచ్చరించారు. వివాహేతర సంబంధం ఓ ద్రోహమని సంగీత ఫైర్ అయ్యారు. విజయ్ వివాహేతర సంబంధం గురించి 2021లో తెలిసిందని అన్నారు. ఆ నటితో సంబంధం తెంచుకుంటానని విజయ్ తనతో చెప్పారని ప్రస్తావించారు. మాట తప్పి ఆ సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పదేపదే తమ మధ్య విభేదాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఆ నటికి మద్దతుగా విజయ్ మాట్లాడుతూ వచ్చారని.. ఆయన నిర్లక్ష్యం కారణంగా తాను ఒంటరినయ్యానని సంగీత పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన భార్య సంగీత చెంగల్‌పట్టు కుటుంబ న్యాయస్థానంలో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివాహ జీవితం సజావుగా కొనసాగడం లేదని, వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయస్థానం ఈ పిటిషన్‌ను స్వీకరించగా.. ఏప్రిల్ 20వ తేదీన కోర్టుకు హాజరుకావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. సంగీత లండన్‌కు చెందిన తమిళ కుటుంబానికి చెందినవారు. విజయ్ నటుడిగా ఎదుగుతున్న సమయంలో ఆయన అభిమానిగా సంగీత పరిచయం అయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. కుటుంబ సభ్యుల సమ్మతితో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, వివాహమైన కొంతకాలం తర్వాతే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు ప్రారంభమైనట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా వీరిద్దరూ వేర్వేరుగా జీవిస్తున్నారని సినీవర్గాల్లో ప్రచారం ఉంది. ప్రత్యేకంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సంగీత విడాకులు కోరుతూ పిటిషన్ వేయడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. విజయ్, త్రిషకు మధ్య సంబంధం ఉందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల తమిళనాడుకు చెందిన కొందరు రాజకీయ నేతలు సైతం ఇవే కామెంట్స్ చేశారు. విజయ్ త్రిష ఇంటిని విడిచి ప్రజల్లోకి రావాలంటూ బీజేపీ నాయకుడు నయినర్ నాగేంద్రన్ కామెంట్ చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు తమిళనాట పెద్ద వివాదానికి దారి తీశాయి. ఈ వ్యాఖ్యలపై త్రిష తీవ్రంగా స్పందించడం.. ఆ తర్వాత నాగేంద్రన్ క్షమాపణలు చెప్పడంతో వివాదం కాస్త సద్దుమణిగింది. ఇంతలో సంగీత విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో.. విజయ్ - త్రిష రిలేషన్ ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. విజయ్ ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని ఆయన రాజకీయ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఈ సమయంలో వ్యక్తిగత జీవితంలో ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందా అనే చర్చ జరుగుతోంది. అయితే, విజయ్ అభిమానులు మాత్రం ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. విజయ్ తమిళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటుల్లో ఒకరు. ఆయన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఈ వార్త అభిమానులను కలవరపరిచింది. సోషల్ మీడియాలో అభిమానులు తమ స్పందనలు తెలియజేస్తున్నారు.

# ఉద్యోగుల కోసం ప్రభుత్వం నిలబడుతుంది

- ఉద్యోగులు ప్రజల కోసం నిలబడాలి
- ఉద్యోగ సంఘ నాయకులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఉద్యోగుల కోసం ప్రభుత్వం నిలబడుతుంది ఉద్యోగులు ప్రజల కోసం నిలబడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, కోటి రూపాయల ప్రమాద బీమా, సహజ మరణానికి 10 లక్షల బీమా, విద్యా విధాన పరిషత్తు ఉద్యోగులను 010 పద్దు కింద తీసుకురావడంలో దిశ నిర్దేశం చేసిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రజా భవన్ లో ఉద్యోగ సంఘ నాయకులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉద్యోగులు మొత్తాన్ని బాగా చూసుకోవాలి అనేది ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో చేపట్టే ప్రతి అంశం చివరి వ్యక్తి వరకు చేరే కార్యక్రమాన్ని ఉద్యోగులతో చేయించాలనేది మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఉద్యోగ వ్యవస్థ బలంగా ఉండాలి వారి కుటుంబాలు భరోసాతో ఉండాలని కోటి రూపాయల ప్రమాద బీమా, హెల్త్ స్కీం తీసుకొచ్చామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజలకు వ్యవస్థలు, సంస్థలు ఉపయోగపడాలనేది మా కోరిక అన్నారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 1.02 కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాము, అదేవిధంగా రాజు ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నాము అన్నారు. ప్రతి పథకం ప్రజల దగ్గరికి తీసుకు వెళ్ళేందుకు 99 రోజుల కార్యక్రమాన్ని తీసుకువచ్చామని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకొని యధాతథంగా కింది వరకు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, దామోదర్ రెడ్డి, సదానంద్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, బి. శ్యామ్, దాస్య నాయక్, వెంకట్ రెడ్డి, ఉమా దేవి, డాక్టర్ రామారావు, షౌకత్ హుస్సేన్, వెంకట్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370